ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

2-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 60 పేజీలు: 10+4 వెల: 6.50

నెలాఖరుకల్లా బిజెపి జాతీయ అధ్యక్షుని ఎన్నిక

ధోలాఘూట్‌లో సిలిండర్ పేలి ఏడుగురి మృతి

5లో

## మూడు నెలలు ఎండమంటలే



### వడగాడ్పులు అధికంగా వీచే అవకాశం

### అనంతపురం, వైఎస్సార్ మినహా మిగిలిన జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత వేసవిలో ఏప్రిల్-జూన్ మధ్య ఎండలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) అంచనా వేస్తోంది. మధ్య, తూర్పు ప్రాంతాల్లో, వాయవ్య రాష్ట్రాల్లో ఎక్కువరోజులు వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఎక్కువ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి నమోదవుతాయని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పలుచోట్ల సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని ఐఎండీ అధిపతి మృత్యుంజయ్ మహాపాత్ర ఆన్‌లైన్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. రాబోయే మూడు నెలలపాటు అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు నుంచి నాలుగు రోజులు ఎక్కువగా వడగాలులు వీస్తాయన్నారు.
మామూలుగానైతే ఈ మూడు నెలల్లో నాలుగు నుంచి ఏడురోజుల వరకు వడగాలులు నమోదవుతుంటాయని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువగా వడగాలుల రోజులు కొనసాగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఏప్రిల్‌లో దేశంలో చాలా ప్రాంతాల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వివరించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎపిలో అనంతపురం, వైఎస్సార్ మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ వడగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని సీజనల్ అవుట్‌లుక్‌లో ఐఎండి ప్రకటించింది. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో 10 మండలాలు, విజయనగరంలో 6, శ్రీకాకుళంలో 6, అల్లూరి సీతారామరాజులో 3, తూర్పుగోదావరిలో ఒక మండలంలో వడగాలులు వీచాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి కూర్మనాథ్ తెలిపారు. సోమవారం నంద్యాల జిల్లా >>2

# నెలాఖరులోగా మెగా డిఎస్సీ

### స్కూళ్లు తెరిచే నాటికి నియామకాలు పూర్తి

### పేదరికం నిర్మూలనకే పి-4

### అనవసర విమర్శలు చేసే వారిని ప్రజలు నిలదీయాలి

### బాపట్ల ప్రజావేదిక సభలో సిఎం చంద్రబాబు



బహిరంగసభలో పాల్గొన్న ప్రజలు,అభిమానులు,నాయకులు




మంగళవారం బాపట్ల ప్రజావేదికలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**బాపట్ల,ఎప్రిల్01,ప్రభాతవార్త:** సంపద సృష్టించగా వచ్చిన ఆదాయాన్ని పేద ప్రజలకు ఖర్చు చేస్తామని, పేదరికం నిర్మూలనకే పి4 విధానానికి శ్రీకారం చుట్టామని, ప్రజలే ముందు ఆ తర్వాతే మిగిలిన వాటికి ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలో పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదిక సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బటన్లు నొక్కామని కొందరు గొప్పగా చెప్పుకుంటున్నారని వారు నొక్కినబటన్లు మనమిచ్చేపెన్షన్లతో సమానమనిఅన్నారు. అనవసర విమర్శలు చేసే >>2

## తిరుపతి రైల్వేస్టేషన్ సుందరీకరణ పూర్తి

### రూ. 300 కోట్లతో అభివృద్ధి పనులు

**తిరుపతి(రవాణ),ఏప్రిల్ 1ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందడంతో ఇక్కడకు నిత్యం వస్తున్న యాత్రికులు, ప్రయాణీకుల సౌలభ్యం కోసం 300 కోట్ల రూపాయలతో తొలిదశ ఆధునీకరణ, సుందరీకరణ పనులు పూర్తికావస్తున్నాయి. రైల్వేస్టేషన్‌లో మొదటి దశలో 3 అంతస్థులు,రెండవ దశలో మొత్తం 10 అంతస్తులు నిర్మాణం జరుగుతుంది. ఈ ప్రాజెక్టులో ప్రయాణీకుల సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ 20 లిఫ్టులు,22 ఎస్కలేటర్లు ఏర్పాటు చేయబోతున్నారు. మంగళవారం మధ్యాహ్నం తిరుపతి లోని ఆధునీకరణ, సుందరీకరణ పనుల్లో భాగంగా తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ పరిశీలించారు. త్వరలోనే ఈ స్టేషన్‌ను ప్రయాణీకుల సేవలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. తిరుమల శ్రీవారి పాదాలచెంత, స్వామి దర్శనానికి వచ్చే వేలాదిమంది ప్రయాణీ టకుల సౌకర్యాలు కల్పించేందుకు ఆధునీకరణ రూపుదిద్దుకుంటోంద >>2

# నెరవేరుతున్న పేదల కల

### ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీ అమలు చేస్తున్న మంత్రి నారా లోకేష్

### మొదటిదశలో మూడు వేల పట్టాల పంపిణీకి రంగం సిద్ధం

### మంగళగిరిలో 'మన ఇల్లు మన లోకేష్' పేరుతో ఏప్రిల్ మూడు నుండి పట్టాల పంపిణి



**మంగళగిరి(గుంటూరుజిల్లా), ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** లోకేష్ హామీ ఇస్తే నెరవేరినట్టే.. మంగళగిరి పేద ప్రజల కల నెరవేరబోతోంది. ఎంతో మంది నాయకులు హామీ ఇచ్చారు కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేస్తూ నారా లోకేష్ అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలు అందజేసి మంగళగిరి పేద ప్రజల దశాబ్దాలకల నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 91,413 ఓట్ల భారీ మెజారిటీతో మంగళగిరి ప్రజలు నారా లోకేష్‌ను గెలిపించారు. గెలిచిన మొదటి రోజు నుండే నారా లోకేష్ ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే దశగా కార్యాచరణ మొదలుపెట్టారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యల పరిష్కారం కోసం పట్టుదలతో పనిచేస్తున్నారు. ఎన్నికల ముందు లోకేష్ఇచ్చిన హామీల్లో ప్రధానమైంది ఇళ్ల పట్టాల సమస్య. ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నారు. వారంతా తాము నివసిస్తున్న భూమిని, రెక్కల కష్టంతో నిర్మించుకున్న గూడుని క్రమబద్ధీకరించాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఎంతోమంది నాయకులు వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో లబ్ది పొందినా ఆ హామీ అమలుకు కనీస కృషి చేసింది లేదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది మంగళగిరి శాసనసభ్యుడిగా లోకేష్ పేదల పట్ల తనకున్న చిత్తశుద్ధిని కార్యాచరణలో పెట్టారు. గత పది నెలల్లో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రజల వివరాల సేకరణ దగ్గర నుండి వివిధ శాఖలతో సమన్వయం, పేద ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులే ఇళ్లకు వెళ్లి దరఖాస్తులు నింపడం వరకూ అన్నీ దశలను నారా లోకేష్ స్వయంగా పర్యవేక్షించారు. అత్యంత క్లిష్టమైన అటవీ భూములు, రైల్వే భూముల సమస్యను కూడా పట్టుదలగా తీసుకోని పరిష్కారం వైపు అడుగులు వేస్తున్నారు. మొదటి దశలో 3 వేల ఇళ్ల పట్టాల పంపిణికి రంగం సిద్ధం చేసారు. నారా లోకేష్. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారి భూమిని, వారునిర్మించుకున్న ఇంటిని క్రమ బద్దీకరిస్తూ శాశ్వత హక్కు కల్పిస్తూ ఇంటి పట్టాలు అందజేయనున్నారు.
నారా లోకేష్. పట్టాల పంపి ణితో పేదలకు భరోసా లభించనుంది. ఏప్రిల్ 3న మొదటి పట్టాను ఉండవల్లి గ్రామంలో అందజేయ నున్నారు. నారా లోకేష్ స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందజేసి మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 4తేదీ నుండి మంగళగిరి డాన్ బాస్కో స్కూల్‌ను అనుకోని ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటుచేస్తున్న వేదికపై లబ్ధిదారులకు నారా లోకేష్ ఇల్ల పట్టాలు అందజేయనున్నారు. ఏప్రిల్ 4 న యర్రబాలెం, నీరుకొండ, కాజా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నారా లోకేష్ ఇల్ల పట్టాలు అందజేయనున్నారు. ఏప్రిల్ 7న పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం, కొలనుకొండ, పద్మశాలి బజార్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు, ఏప్రిల్ 8న రత్నాల చెరువు, మహానాడు2కు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు, ఏప్రిల్ 11న సీతానగరం, సలాం సెంటర్, డ్రైవర్స్ కాలనీకు చెందిన లబిదారులకు, ఏప్రిల్ 12 న మహానాడు1, ఉండవల్లి సెంటర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు లోకేష్ పట్టాలు అందజేయనున్నారు.
మొత్తంగా మూడువేలకు పైగా పట్టాల పంపిణి కి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్యనాయకులు, నారా లోకేష్ భారీ విజయానికి కృషి చేసిన ఆయా గ్రామాల, వార్డుల ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.



## లక్షకు చేరువలో పసిడి

### ఇప్పటికే దాటేసిన వెండి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. రోజురోజుకూ బులియన్ మార్కెట్‌లో బంగారంధరలు రికార్డులు నమోదుచేస్తున్నాయి. రాజధాని ఢిల్లీలో తాజాగా 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.94,150కి చేరింది. దేశీయంగా పసిడిధరలు ఈస్థాయికి రావడం ఇదే తొలిసారి. అంతకుముందు వారాంతంలో 99.9 స్వచ్ఛత కలిగిన బంగారంధరలు రూ.92,150వద్ద ఉంటే మరో రెండువేలు తాజాగాపెరిగింది. ఈక్విటీతో పోలిస్తేప్రత్యామ్నాయంగా పెట్టుబడులకు బంగారం భావిస్తుండటంతో అంతర్జాతీయంగా డిమాండ్‌పెరిగింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ బంగారంధర సుమారు 18శాతంపెరిగింది.
జనవరి ఒకటిన రూ.79,390గా ఉన్న పసిడి సుమారు రూ.15 వేలు పెరిగింది.
అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్‌గోల్డ్ >>2

## వాట్సప్‌లో ఇంటర్ ఫలితాలు

**విజయవాడ ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 12-15 మధ్య విడుదల చేసేందుకు అధికారులు చర్యలుచేపట్టారు. ఏప్రిల్ 6 నాటికి మూల్యాంకనం పూర్తవుతుంది. ఆతర్వాత కంప్యూటరీకరణ వర్క్ ఉంటుంది. దీనికి ఐదారురోజులు సమయం పడుతుంది. ఈసారి వాట్సప్‌లోనే ఫలితాలు విడుదల చేయనున్నారు. ఇందుకోసం ఒక్కోవిద్యార్థి మార్కులను పిడిఎఫ్ రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఇవే షార్ట్ మెమోలుగా ఉపయోగ పడనున్నాయి. గతంలో ఫలితాలు ఇచ్చి, ఆ తర్వాత షార్ట్ మెమోలను ఆన్‌లైన్‌లో ఉంచే వారు. ఈసారి వాట్సప్‌లో ఫలితాలు ఇస్తున్నం దున పిడిఎఫ్ రూపంలో మార్కులు ఇవ్వనున్నారు.



## బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

### 17 మంది మృతి, మరికొందరికి తీవ్ర గాయాలు

**అహ్మదాబాద్, ఏప్రిల్ 1:** గుజరాత్‌లోని దీశాలోని ధువరోడ్డులో ఉన్న గోదాములో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది సిబ్బంది చనిపోయారు. దీశా మున్సిపల్ పరిధిలోని అగ్నిమాపక సిబ్బంది 108 అంబులెన్సులు ఆప్రాంతానికి చేరుకుని రక్షణ చర్యలుచేపట్టాయి. గన్‌పౌడర్ ఫ్యాక్టరీలో ఈ భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శక్తివంతమైన పేలుడు కావడంతో సమీపంలోని గోదాము కూలిపోయింది. శిథిలాలు >>2

### కోటిమంది లబ్దిదారులు దాటే విధంగా

# రెండో విడత దీపం -2 అమలు

### అర్హులు అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**సచివాలయం,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** కోటి మంది లబ్దిదారులు దాటే విధంగా రెండో విడత దీపం-2 పథకాన్ని రాష్ట్రంలో నేటినుండి ప్రారంభించడం జరిగిందని,అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు.మంగళవారం రాష్ట్ర సచివాలయం 4వ బ్లాక్ ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రప్రథమంగా నెరవేర్చిన హామీ దీపం-2ని ఈ పథకాన్ని గత ఏడాది అక్టోబర్ 31న దీపావళి రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్ఛాపురంలో ప్రారంభించారు.ఈ పథకాన్ని పెద్దఎత్తున 99.03లక్షల మంది సద్వినియోగం చేసుకోవడం జరిగిందని,దాదాపు రూ.760కోట్లు లబ్దిదారుల ఖాతాల్లోకి నేరుగా జమచేయడం జరిగిందన్నారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఇకెవైసి నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మొత్తం 4,24,59,028మంది లబ్దిదారులకు గాను ఇప్పటి వరకు 93శాతం అంతే 3,85,74,194మంది లబ్దిదారుల ఇకెవైసి పూర్తిచేయడం జరిగిందని,కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు మిగిలిన 3శాతాన్ని కూడా ఈ మాసాంతానికల్లా పూర్తిచేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.ఇకెవైసి నమోదు విషయంలో లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకై గ్రామవార్డు సచివాలయాల్లోని మొబైల్ యాప్,ఈ పోస్ మిషన్ ద్వారా ఇకెవైసి నమోదు చేసుకునే అవకాశాన్ని క్షేత్రస్థాయిలోనే కల్పించడం జరిగిందన్నారు.

**మధ్యాహ్న భోజన పథకం క్రింద నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ**

ఈ విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజన పథకం క్రింద నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.ఈ ఏడాది జూన్‌నుండి 44,394 ప్రభుత్వపాఠశాలలకు, 3938వసతి గృహాలకు నాణ్యమైన సన్నని బియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో నెలనెలా కొరియర్ ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

**రబీలో 10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం**

నేటి నుండి రబీ సీజన్‌ప్రారంభం అయిందని,ఈ రబీలోదాదాపు 10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యాన్ని నిర్ధేశించు కోవడం జరిగిందని మంత్రి తెలిపారు.

# ప్రజల చేతుల్లోకి ప్రభుత్వం

### • పాలనా సంస్కరణలే కారణం • పి-4 తప్పక విజయవంతం

### • వాట్సప్ గవర్నెన్స్‌తో పాలనా విధానాలు సరళం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్1.ప్రభాతవార్తప్రతినిధి:** పరిపాలనా విధానాల్లో తాము తీసుకుని వస్తున్న మార్పులకు ప్రజలనుంచి అనుహ్య స్పందన లభిస్తోందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయన ఈ ఉదయం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఒకప్పుడు పాలనను ప్రజల వద్దకు తీసుకుని వెళ్ళామన్నారు. ఇప్పుడు ఏకంగా ప్రజల చేతుల్లోకే పరిపాలన వెళ్లిందన్నారు. పాలన సంస్కరణల్లో మనం తీసుకున్న ప్రతి రంగం విజయవంతమైందన్నారు. వాటప్స్ గవర్నెన్స్‌తో ప్రజలు ప్రభుత్వం నుంచి అవసరమైన సేవలు అందుకుంటున్నారన్నారు. గతంలో నేను ప్రజల వద్దకు పాలన ప్రవేశపె ట్టాను. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవ ర్నెన్స్ తీసుకొచ్చి ప్రభుత్వ సేవలు అందిస్తున్నా మని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచం వేగంగా మారుతోంది. ఈ పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు జరుగుతూనే ఉండాలి. ప్రతి ఒక్కరూ హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలి. కేవలం 25 ఏళ్లలోనే అమెరికన్ల కంటే రెండింతలు ఆదాయం సంపాదించింది మనతెలుగువారే అయినందుకు నాకు గర్వంగా ఉంది. నేనూ, ప్రధాని మోడీ, మిత్రులు పవన్ కల్యాణ్ ఆలోచించేది ఒకటే. మనరాష్ట్రం, దేశం బాగుండాలని. ప్రపంచంలో మనదేశం అగ్రస్థానంలో ఉంటే, దేశాన్ని నడిపించే శక్తి తెలుగుజాతికి ఇవ్వాలని ఆ భగవంతుణ్ని కోరకుంటున్నాను. గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం కళ తప్పింద న్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆ ఐదేళ్లు రాష్ట్రం కళ తప్పింది. అందరం కూర్చుని సంతోషంగా మాట్లాడుకునే పరిస్థితి లేదు. గడిచిన ప్రభుత్వం సృష్టించిన సమస్యలు నా సుదీర్ఘ రాజకీయ అను భవంలో ఏనాడు చూడలేదు. అన్నీ చిక్కుముడులే. ఒక్కో చిక్కుముడిని విడదీస్తూ వ్యవస్థను సరిచేస్తున్నాం. ఈ ఏడాది రూ. 3.22 లక్షలకోట్ల బడ్జెట్ పెట్టాం. ప్రజల ఆదాయం పెరగాలి. టెక్నాలజీని యువత అంది పుచ్చుకోవాలన్నారు. పేదరికం లేని రాష్ట్రమే గమ్యం.అందుకే పి4ను తీసుకుని వచ్చాను. ప్రపంచం మొత్తం అధ్యయనం చేసి పి4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సిఎం చంద్రబాబు తెలిపారు. ఇది డబ్బుతో పరిష్కారమయ్యేది కాదని మనస్సు పెట్టి పనిచేసి సమస్యను పరిష్కరించేదని చెప్పారు. పి4 విధానం సరికొత్త చరిత్రకు శ్రీకారం అవుతుందన్నారు. రాష్ట్రాన్ని పేదరికం లేని ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకే ఉగాది నాడు ఈ విధానానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. గత ఐదు దశాబ్దాలుగా రాజకీయరంగంలో తనను ఆదరిస్తున్న తెలుగు ప్రజలకే ఈ జీవితం అంకితం తప్ప వేరే ఆలోచనలు లేవని సీఎం స్పష్టంచేశారు. సంపద కొందరికే పరిమితం కాకూడదు. ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమవుతుంది. ఎన్టీఆర్, మహాత్మాగాంధీ, అంబేద్కర్ సహా ఎవరూ పుట్టుకతోనే గొప్పవారిగా పుట్టలేదు. వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని మహోన్నత వ్యక్తులుగా ఎదిగారు. నేడు ఉగాది పర్వదినాన మార్గదర్శి బంగారు కుటుంబం జీరో పావర్టీ పి4కు శ్రీకారం చుట్టాను. సంపన్నులు పేదలను ఆదుకోవాలి. వారిని ఆర్థికంగా పైకి తేవాలన్నారు.

# గంజాయి భారీగా అక్రమ రవాణా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందల్

### నలుగురి అరెస్టు, 147 కిలోల గంజాయి స్వాధీనం

**విజయనగరం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి :** విజయనగరం జిల్లా రామభద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొట్టక్కి వద్ద ఫిబ్రవరి 10వ తేదీన పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలను గ్రహించి 147 కిలోల గంజాయితో ఉన్న కారును వదిలి పరారయిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కొట్టక్కి చెక్ పోస్టు వద్ద రామభద్రపురం ఎస్‌ఐ వి. ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేస్తుండగా విషయం గ్రహించిన నిందితులు అదే మార్గంలో వస్తూ 147 కిలోల గంజాయితో వారు వస్తున్న >>2



మంగళవారం ప్రజలనుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న సిఎం చంద్రబాబు

### జూన్ నెలాఖరు నాటకి విజయవాడ బైపాస్ రోడ్డులో

# వాహనాలకు అనుమతి

### కాజ నుంచి వెంకటపాలెం, గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు బైపాస్‌ను అందుబాటులోకి

## సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఏప్రిల్ 1,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ బైపాస్ రోడ్డులో వాహనాలకు అనుమతినిచ్చే దిశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యచరణ చర్యలు చేపట్టింది. ముందు అనుకున్న ప్రణాళిక ప్రకారం బైపాస్ పూర్తిచేసి, జూన్ ఆఖరునాటికి వాహనాల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు."ఎక్స్" వేదికగా ఆయన విషయం స్పష్టం చేసారు.సీఎం చంద్రబాబు అందించిన సమాచారాన్ని అనుసరించి జూన్ నాటికి పెండింగ్ పనులు పూర్తిచేసి కాజ నుంచి వెంకటపాలెం, గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు బైపాస్‌ను అందుబాటులోకి తీసుకొస్తారు. ఆ తర్వాత నాలుగు గ్రిడ్ రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలో ముమ్మరంగా కార్యకలాపాలు మొదలైన నేపథ్యంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లే బైపాస్ తక్షణమే అందుబాటులోకి వచ్చేలా చూసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రాజధాని ప్రాంతానికి కీలక జాతీయ రహదారి అందుబాటులోకి రావడమే కాకుండా, అక్కడి నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను సులువుగా తరలించేందుకు కూడా అవకాశం ఏర్పడుతుంది.

కాజ నుంచి గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు ఉన్న విజయవాడ బైపాస్ (చెన్నైకోల్‌కతా హైవే బైపాస్) ఉంది. అందులోని కాజగొల్లపూడి ప్యాకేజీ 17.88 కిలోమీటర్లు. ఇది రాజధాని ప్రాంతంలోని 9 గ్రిడ్ రోడ్ల మీదుగా వెళ్తుంది. వీటిలో ఇ3, ఇ8, ఇ10, ఇ13, ఇ15 గ్రిడ్ రోడ్లు క్రాస్ అయ్యేచోట్ల ఎన్‌హెచ్ఏఐ అండర్ పాస్‌లను నిర్మించింది. దీనివల్ల ఆయా గ్రిడ్ రోడ్లలో రాకపోకలు సాగించే వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

అయితే ఇ9, ఇ11, ఇ12, ఇ14 గ్రిడ్ రోడ్ల వద్ద మాత్రం అండర్‌పాస్‌లు లేకుండానే, బైపాస్ నిర్మాణం పూర్తిచేశారు. బైపాస్ క్రాస్ అయ్యేప్రాంతాల్లో ఆ నాలుగు గ్రిడ్ రోడ్లు శాశ్వతంగా మూసుకుపోతాయి. ఈ గ్రిడ్ రోడ్లపై రాకపోకలు సాగించేవారు.. బైపాస్ దాటి వెళ్లాలంటే మరో ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలిసినా గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు పనులు చేసేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు గ్రిడ్ రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు లేని విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి రావడంతో ఎట్టిపరిస్థితుల్లోనూ అక్కడ అండర్‌పాస్‌లు ఉండాల్సిందేనని ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆ నాలుగు చోట్ల బైపాస్‌ను కట్‌చేసి, అండర్‌పాస్‌ల నిర్మాణానికి అంచనాలు రూపొందించే పనుల్లో ఇంజినీర్లు ఉన్నారు.ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి గడ్కరీతో మాట్లాడారు. రాజధాని పనులు వేగంగా జరుగుతున్న వేళ మొదట బైపాస్ నిర్మాణం పూర్తిచేయాలని, ఆ తర్వాత నాలుగు గ్రిడ్ రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించేలా ఇద్దరూ చర్చించి, నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ ప్రస్తుతం బైపాస్ ఆపేసి, నాలుగు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తిచేయాలంటే మరో 15 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో తొలుత బైపాస్ పూర్తిచేయడానికే సమ్మతించారు. దీంతో ఈ పనులు మరింత వేగంగా సాగనున్నాయి. వర్షాలు మొదలయ్యే లోపు జూన్ ఆఖరుకు బైపాస్ అందుబాటులోకి వచ్చేలా పెండింగ్ పనులు పూర్తిచేస్తామని ఎన్‌హెచ్ఏఐ వర్గాలు తెలిపాయి

## వెంకన్న ఆస్తులు కాపాడటంపై 'ఫోకస్'!

### దేశవ్యాప్తంగా తిరుమలేశుని ఆస్తులు కబ్జా కాకుండా యాక్షన్‌ప్లాన్

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు,దాతలు పలు రకాలుగా బహుమానంగా ఇచ్చిన ఆస్తులను కాపాడటంపై తిరుమల తిరుపతి దేవస్థానం ఫోకస్ పెట్టింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఏడుకొండల స్వామి ప్రియభక్తులు సమర్పించుకున్న కానుకల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా, కబ్జాకు గురికాకుండా చూడాలనే యాక్షన్‌ప్లాన్ అమలుచేసే దిశగా రాష్ట్రప్రభుత్వం కూడా చొరవతీసుకుంటోంది. ఇందుకోసం టిటిడి అధికారులు, పాలకమండలి సభ్యులతో ఒకమిటీని కూడా ఏర్పాటుచేశారు. గతనెలలో తిరుమలకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వేంకటేశ్వరస్వామి ఆస్తులు కబ్జా కానివ్వనని, రక్షణకు చర్యలు తీసుకుంటున్నామంటూ పునరుద్ఘాటించారు. ఎక్కడైనా దేవుని ఆస్తులు కబ్జా చేసివున్నా తిరిగి కాపాడుకోవడానికి కంకణంకట్టుకున్నామని వెల్లడించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం(నేడు) ఉండవల్లిలోని సిఎం నివాసంలో టిటిడి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి, రెవెన్యూ అధికారులు కలసి కీలక సమావేశం కానున్నారు. ముఖ్యంగా దేవుని ఆస్తుల పరిరక్షణకు యాక్షన్‌ప్లాన్, భక్తులకు మరింత సులభంగా స్వామివారి దర్శనం చేయించడం, అలిపిరి టోల్‌గేట్‌లో తనిఖీలకు అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు ,అన్యమత ఉద్యోగులపై చర్యలకు కీలక సూచనలు తీసుకోనే దిశగా చర్చ సాగించనున్నారు. దేశవ్యాప్తంగా వెయ్యికిపైగా స్థిరాస్థులు ఉన్నాయని, 7,126.85 వేల ఎకరాలు ఉండగా ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 690 ఆస్తులు ఉన్నాయి. 6,657.43 ఎకరాలు ఉండటం విశేషం. సాక్షాత్తు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుపతి నగరం పరిసరాల్లోనే వివిధ చోట్ల 3,663 ఎకరాలు భూములు ఉన్నాయి. 584 ఎకరాలు స్థలాలపై వివిధ న్యాయస్థానాల్లో కేసులు నడుస్తున్నాయి. పలు కోర్టుల్లో ఉన్న కేసులు కూడా పరిష్కారానికి చొరవ తీసుకునేదిశగా ప్రస్తుత పాలకమండలి ముందడుగు వేయనుంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో భక్తులు తమ కానుకగా, దేవునిపై భక్తివిశ్వాసాలతో స్థిరాస్థులు, భూములు ఇనాంగా రాసిచ్చారు. ఈ ఆస్తులను ఎవరూ కూడా విక్రయించడానికి వీలులేకుండా గత పాలకమండలి తీర్మానం చేసి, ప్రత్యేక జిఒ కూడా జారీచేసింది.

**సిఎం సమక్షంలో యాక్షన్‌ప్లాన్ :**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి దేశవ్యాప్తంగా ఉన్న వేలకోట్లరూపాయలు విలువైన ఆస్తుల రక్షణ దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం గట్టి చర్యలు చేపట్టేందుకు యాక్షన్‌ప్లాన్ సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వెంకన్న ఆస్తులను పూర్తిస్థాయిలో గుర్తించి ఎక్కడా అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఇప్పటికే పలువురు చేతిలో ఉన్న వాటిని వెనక్కుతీసుకుని పరిరక్షించాలని ఆలోచన చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో తిరుపతి, రూరల్ పరిసరాల్లో, చంద్రగిరి, తొండమనాడు, నాగలాపురం ప్రాంతాలతోబాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా, ఢిల్లీ వంటి ప్రధాన నగరాల్లో శ్రీవారికి ఆస్తులు ఉన్నాయి. ఆస్తులన్నీటినీ గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చూసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా వెంకన్న భక్తులు స్వామివారికి కానుకలుగా సమర్పించిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టేదిశగా ఛైర్మన్, అధికారులు అధ్యయనం చేస్తారు. దేశంలోని పలుప్రాంతాల్లో జనక్‌పురి, రిషికేష్, డెహ్రాడూన్ తదితర దూర ప్రాంతాల్లో ఉన్న ఆస్తులను ఆక్రమణలకు గురికాకుండా టిటిడి చూసే వీలుకలుగుతుంది. అంతేగాక దేశవ్యాప్తంగా ఉన్న వెంకన్న ఆస్తులను పూర్తిస్థాయిలో పరిరక్షించేందుకు , రక్షణ చర్యలు తీసుకోవడానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇప్పుడు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడికి చెందిన ఆక్రమణలకు గురైన స్థలాలను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకునే దిశగా పటిష్టచర్యలు తీసుకోనున్నారు.

# నెలాఖరులోగా మెగా డీఎస్సీ

>> వారిని ప్రజలు నిలదీయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి బిసిలు వెన్నుముక. రాష్ట్రంలో టిడిపి ఇంత బలంగా ఉందంటే అందుకు వెనుకబడిన వర్గాలే కారణమన్నారు. 43 ఏళ్లుగా టిడిపి జెండా మోసింది బలహీన వర్గాలేనని బెదిరించినా భయపడకుండా ఎదురొడ్డి పోరాడారని ఆయన అన్నారు. పార్టీని ఆదుకున్న వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన అన్నారు. గత ప్రభుత్వ అసమర్థ పాలన ఎలా ఉందో అందరం చూశామని రాష్ట్రాన్ని సర్వనాశం చేసిపోయారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రూ. 10 లక్షల కోట్ల అప్పు వారసత్వంగా వచ్చిందని ఓవైపు సంక్షేమం, అభివృద్ధి చేస్తూనే మరోవైపు అసలు, వడ్డీ రెండూ కట్టాల్సిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. సంపద సృష్టించి ఆదాయం పెంచి దాన్ని నిరంతరం పేదలకే ఖర్చు పెడతానని హామీ ఇస్తున్నానన్నారు.రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు మిత్రులు పవన్ కల్యాణ్ , తాను , బిజెపి జతకట్టామని ఇచ్చిన హామీలన్నీ అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు.తాను ముందుండి నడిపించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నానన్నారు.28 రకాల పింఛన్లు ఇస్తున్నామని మన దేశంలో ఒక్క పెన్షన్ల కిందే ప్రతి నెలా 63 లక్షల మందికి ఏడాదికి రూ. 33,100 కోట్లు వ్యయం చేస్తున్నామన్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసే రాష్ట్రం దేశంలో ఒక్క ఎపినేనన్నారు. రూ. 200 పింఛను రూ. 2 వేలు చేసింది తానేనన్నారు. ఎన్నికల డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు ఇస్తున్నామని మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్టే పింఛన్లూ అందిస్తున్నామన్నారు. కొందరి ఆదాయం కంటే పింఛను ద్వారానే ఎక్కువ వస్తోందని ఉపాధి నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లిన వారు పింఛను అందుకోలేకపోయేవారని అలాంటి వారికి గత ప్రభుత్వంలో పింఛను ఇచ్చేదికాదన్నారు. కానీ ఎన్డీఏ ప్రభుత్వంలో మూడో నెలలోనైనా పింఛను తీసుకునే అవకాశం కల్పించామన్నారు. అలా రెండు నెలలు వరుసగా పింఛను తీసుకోని వారు మన రాష్ట్రంలో 93,324 మంది ఉన్నారు.రాజధాని అమరావతి పనులకు శ్రీకారం చుట్టామని నాలుగేళ్లలో అమరావతికి పూర్వ వైభవం తెస్తామన్నారు.

ఈ నెలలో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చి జూన్‌లోగా కొత్త టీచరు పోస్టులు భర్తీ చేస్తామన్నారు.47 సంవత్సరాలుగా ప్రజలు నన్ను ఆశీర్వదిస్తున్నారు. సమైక్యాంధ్రలో 9 ఏళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లు ప్రతిపక్షనేతగా, నవ్యాంధ్రలోఆరో సంవత్సరం ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం లభించిదని ఇది తనకిప్రజలిచ్చిన అరుదైన గౌరవమన్నారు.ఇటువంటి అవకాశం ఏ నాయకుడికి దొరకలేదన్నారు. పేదరికం లేని సమాజమే నా ఆశయమన్నారు. పేద కుటుంబాలను ఆదుకునే వారు మార్గదర్శిగా, ఆదుకోబడిన వారు బంగారు కుటుంబంగా పరిగణించబడతారన్నారు. కొత్తగొల్లపాలెంలో మానసిక దివ్యాంగురాలైన వడ్లమూడి సుభాషిణి ఇంటికి పింఛను అందించేందుకు ఆయన స్వయంగా వెళ్లారు. సుభాషిణి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయడంతో పాటు ఆమె తల్లికి ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సుభాషిణి చెల్లెలు భరణిని ఏం చదువుకుంటున్నావ్, ఏం కావాలనుకుంటున్నావని సిఎం అడిగారు. భరణి సమాధానం ఇస్తూ.. తనకు పోలీస్ అవ్వాలని ఉందని చెప్పింది. జనాల్ని బాగా కొట్టొచ్చు అని పోలీస్ అవుదామనుకుంటున్నావా అని నవ్వుతూ అన్నారు. పోలీస్ అయ్యి ప్రజల్ని కాపాడాలని సిఎం సూచించారు.

చదివించుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని కుటుంబ సభ్యులు తెలపగా ఆమెను కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.మరో లబ్ధిదారు బత్తుల జాలమ్మ గృహానికి వితంతు పెన్షన్ పంపిణీ చేశారు. జాలమ్మ ఇల్లు శిథిలావస్థకు చేరడంతో చూసి చలించిపోయిన సిఎం వెంటనే గృహాన్ని మంజూరు చేయడంతో పాటు గ్యాస్ కనెక్షన్ కూడా ఇవ్వాలని ఆదేశించారు. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కునేందుకు బిసి కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఏం చదవు కుంటున్నావని జాలమ్మ చిన్నకుమారుడుని ప్రశ్నించగా పదవ తరగతి మధ్యలో నిలిపేశానని చెప్పారు. చదువుకుంటావా అని సిఎం అడగ్గా చదువు రాదు అని అతను తిరిగి సమాధానం ఇచ్చాడు. ఎందుకు రాదు, మేమంతా వచ్చి చదువుకున్నామా, ఇష్టపడి చదవుకున్నాం అని అన్నారు. చదవు రాదని మనసులో పడితే రాదని, వస్తుందంటే వస్తుందని అన్నారు. ఎప్పుడూ గొర్రెలు మేపడమే కాదు, పై స్థాయికి రావాలని సిఎం చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి,జిల్లా ఎస్పీ తుషార్ డూడి,ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, , బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

### ఎపి సిఐడి మాజీ చీఫ్ సంజయ్‌కు

## సుప్రీంకోర్టు నోటీసులు

**విజయవాడ ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి సిఐడి మాజీ చీఫ్ సంజయ్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఇటీవల ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈకేసులో సంజయ్‌కు ఎపి హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ అమానుతుల్లా జస్టిస్, పి.కె మిశ్రా ధర్మాసనం, ఎపి ప్రభుత్వ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సంజయ్‌కు నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను నెలాఖరుకు వాయిదా వేసింది.

## సుందరీకరణ పూర్తి

>>న్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా, మారుతున్న కాలంతోబాటు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. దేశంలోనే ప్రముఖ ప్రముఖ రైల్వేస్టేషన్‌లలో తిరుపతి ఒకటిగా నిలిచిపోతుందన్నారు. ప్రయాణీకులు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నామని డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఆధునీకరణ పనులు ఉత్తరభారతదేశంకు చెందిన వీరేంద్ర కన్‌స్ట్రక్షన్స్ చేపట్టిందన్నారు. రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్‌లు విస్తరణ, పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆధునిక పరికరాలు, సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ చిన్న రెడ్డప్ప, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి, నిర్మాణసంస్థ సూపర్ వైజర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఎండమంటలే

>> గోస్పాడులో 40.3, కర్నూలు జిల్లా కమ్మరచేడులో 40.2, అనంతపురం జిల్లా నాగసముద్రంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో వేడి, ఉక్కపోత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించనుంది. మంగళవారంనుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు తగ్గుతాయని ఐఎండి తెలిపింది. శనివారం ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

## చేరువలో పసిడి

>> ధర ఔన్స్ 3149 డాలర్లకు చేరడంతో దేశీయంగా అదేస్థాయిలో పెరుగుతోంది. మరోవైపు వెండిధర మాత్రం కాస్త తగ్గుముఖం పట్టింది. శుక్రవారం కిలో వెండి ఢిల్లీలోరూ.1,03,000గా ఉటే మంగళవారం రూ.500 తగ్గి 1,02,500కి చేరింది. అమెరికా భాగస్వామ్య దేశాలపై బుధవారం నుంచి ప్రతీకార సుంకాలు అమలుకు ట్రంప్ ప్రకటించడంతో ఆయా దేశాలు కూడా సుంకాలు ప్రారంబించే యోచనలో ఉన్నాయి. దీనివల్లప్రపంచ ఆర్థికవ్యవస్థకు పెనుముప్పు తప్పదని అందుకే సురక్షిత పెట్టుబడి స్థావరంగా బంగారం వైపు ఇన్వెస్టర్లు పరుగులు తీస్తున్నట్లు ఆర్థికరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 02-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల పంచమి రా.11.54
కృత్తిక ఉ.8.51
వర్జ్యం రా.11.39-1.09
దు.ఉ.11.47 - మ.12.36
శుభసమయం : ఉ.9.25 - 10.10
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృషభం :** సంఘంలో గౌరవం పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో ముందడుగు వేస్తారు. దైవదర్శనాలు.

**మిథునం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలు లాభ సాటిగా సాగుతాయి.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

**కన్య :** ఆర్థిక లావాదేవీలలో ఆటుపోట్లు ఎదురైన అధిగమిస్తారు. చేపట్టిన పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**తుల :** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కారించుకుంటారు. విలువైన పత్రాలు జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**ధనుస్సు:** కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** శుభకార్యాలలో పాల్గొంటారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వస్తులాభం.

**కుంభం:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు.

**మీనం:** ఉద్యోగులకు బదిలీలు వుంటాయి.పనులలో ఆటంకాలు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్

## రాష్ట్రంలో నాలుగు తప్ప 64 జాతీయ రహదారులపై టోల్ పెంపు

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి :** ఎపిలో నాలుగును మినహాయించి జాతీయ రహదారులన్నింటిపై టోల్ రుసుములు పెరిగాయి.మంగళవారం నుంచి ఇవి అమలులోకి వచ్చాయి. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఏపీ రీజినల్ అధికారి పరిధిలో 68 టోల్ ప్లాజాలు ఉన్నాయి. వాటిలో నాలుగు మినహా మిగిలిన 64 చోట్ల 2025- 2026 ఆర్థిక ఏడాదికి టోల్ పెంపు ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చింది. కార్లు, జీపులకు కిలోమీటరుకు రూ.5 పైసలు, బస్సులు, లారీలకు 18 పైసలు నుంచి వాటి యాక్సిల్‌ను బట్టి 35 పైసలు వరకు పెరిగాయి. స్థానికులకు అందజేసే నెలవారీ పాస్ ప్రస్తుతం రూ.340 ఉండగా అది ఇప్పుడు రూ.350కి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే హోల్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా టోల్‌లను ఏటా సవరిస్తుంటారు. నెల్లూరు తడ మధ్యఉన్న సూళ్లూరుపేట, బూదనం, వెంకటాచలం టోల్‌ప్లాజాలు, విజయవాడహైదరాబాద్ మార్గంలో ఉన్న కీసర టోల్‌ప్లాజా కలిపి మొత్తం నాలుగు చోట్ల మాత్రం పెరగలేదు. ఇవి 1997 టోల్ నిబంధనల కింద ఉన్నాయి. వీటికి ఏటా ఆగస్టులో పెంపు అమలు చేస్తారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లేమార్గంలో నాలుగు టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటిలో కీసర మినహా కొర్లపహాడ్, చిల్లకల్లు, పంతంగి ప్లాజాల్లో రుసుములు తగ్గాయి. చిల్లకల్లు ప్లాజాలో అన్ని వాహనాలకు రూ.5 చొప్పున, పంతంగిలో కార్లు, జీపులకు రూ.15, టూ యాక్సిల్ బస్సులు, లారీలకు రూ.25, భారీ వాహనాలకు రూ.50 వరకు వరకు తగ్గాయి. ఈ మార్గంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి యాదాద్రి జిల్లా దండుమల్కాపురం వరకు 181 కిలోమీటర్ల రోడ్డును గతంలో జీఎంఆర్ సంస్థ నిర్మించింది. గత సంవత్సరం జూన్ ఆఖరు వరకు ఆ సంస్థ టోల్ వసూలు చేసింది. దాని గడువు ముగియడంతో, గత జులై నుంచి ఈ టోల్‌ప్లాజాలు ఎన్‌హెచ్ఏఐ ఆధీనంలోకి వచ్చినట్లు గెజిట్ ప్రచురించారు. ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం లెక్కలు వేసి, ఆ మూడు టోల్‌ప్లాజాల్లో రుసుములను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ తగ్గింపు ఈరోజు నుంచి అమల్లోకి వచ్చింది. హైదరాబాద్ ఓఆర్ఆర్ టోల్ రుసుములను సగటున ఐదు శాతం పెంచుతున్నట్లు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ తెలిపింది. కొత్తఛార్జీలు మార్చి 31 అర్ధరాత్రి నుంచి అమలవుతాయని తెలిపారు.నెల్లూరుతడ మధ్య ఉన్న సూళ్లూరుపేట, బూదనం, వెంకటాచలం టోల్‌ప్లాజాలు, విజయవాడహైదరాబాద్ మార్గంలో ఉన్న కీసర టోల్‌ప్లాజా కలిపి మొత్తం నాలుగు చోట్ల మాత్రం పెరగలేదు.

## ఎల్ఎస్జీపై చెలరేగిన పంజాబ్‌కింగ్స్

### సొంతగడ్డపై 8 వికెట్ల తేడాతో లక్నో జట్టు చిత్తుగా ఓటమి



**లక్నో ఏప్రిల్ 1:** ఐపిఎల్ 2025 సీజన్‌లో 13వ మ్యాచ్‌లో పంజాబ్‌కింగ్స్ చెలరేగిపోయింది. సొంత మైదానంలో లక్నో సూపర్ జెయింట్స్‌కు ఓటమి తప్పలేదు. ఐపిఎల్ 18వ సీజన్‌లో పంజాబ్‌కింగ్స్ రెండో విజయం సాధించింది. తొలిపోరులో గుజరాత్ టైటాన్స్‌కు షాకిచ్చిన పంజాబ్ లక్నో గ్రౌండ్‌లో ఎల్ఎస్జీ జట్టును చిత్తుచేసింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్‌సింగ్ 69 పరుగులు, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 52పరుగులుచేసారు. అయ్యర్ నాటౌట్‌గానే నిలిచారు. ఇంపాక్ట్ ప్లేయర్ నేహాల్ వధేరా 43పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచి ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరి మెరుపులతోనే లక్నోపై 8 వికెట్ల తేడాతో పంజాబ్‌కింగ్స్ విజయం సాధించింది. 16.2 ఓవర్లలోనే ఎల్ఎస్జీ టార్గెట్ ఛేదించింది. హిట్టర్లతో నిండిన ఎల్ఎస్జీ భారీ స్కోరుకూడా చేయలేకపోయింది. పంజాబ్‌కింగ్స్ పేసర్ అర్షదీప్‌సింగ్ మూడు 43 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసాడు. ఆదినుంచి కూడా లక్నోజట్టు తడబడుతూ వచ్చింది. పవర్‌ప్లేలోనే 3 కీలక వికెట్లు కోల్పోయింది. నికొలస్‌పూర్ 44, ఆయుష్ బదోనిలు జట్టును ఆదుకున్నారు. పంజాబ్ స్పిన్నర్లను ధీటుగా ఎదుర్కొంటూ లక్నో స్కోరుబోర్డును ఉరికించారు. అర్థసెంచరీకి ముందు పూరన్ ఔట్ అయినా అబ్దుల్‌సమద్ 27 పరుగులుచేసి బదోని కూడా అంతే దూకుడుతో ఆడి సోనకరుపెంచారు. దీనితో పంత్‌సేన నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 171 పరుగులుచేసి విజయం తన ఖాతాలో వేసుకుంది. తొలుత బ్యాటింగ్‌చేసిన లక్నోజట్టుకు ఆరంభంలోనే అర్షదీప్ షాకిచ్చాడు. తొలి ఓవర్‌లో నాలుగో బంతికే మిచెల్‌మార్ష్ వికెట్ నష్టపోయాడు. తర్వాత మార్క్‌రమ్ 28 పరుగులుచేసి నాల్గవ ఓవర్‌లో ఔట్ అయ్యాడు.

## గంజాయి భారీగా అక్రమ రవాణా

>> కారును వదిలి పరారయ్యారని వివరించారు. వెంటనే గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వివరించారు. సాంకేతికతను ఉపయోగించి నలుగురు నిందితులు విశాఖ జిల్లా ఆనందపురం మండల ం దుక్కవానిపాలెం గ్రామానికి చెందిన భోగవిల్లి గోవిందరావు (20), సరుగుపల్లి అనిల్‌కుమార్ (29), బంక రామసురేష్ (25), అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం కిలగడ గ్రామానికి చెందిన అంబిడి బాలరాజు(32)లను అరెస్టు చేసినట్లు వివరించారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు ఎఎస్ఆర్ జిల్లా అనంతగిరి మండలం శివలింగాపురానికి చెందిన శెట్టి ఉమామహేశ్వరరావు అలియాస్ హుస్సేన్ (42) ఇప్పటికే పలు గంజాయి కేసుల్లో అరెస్టు కాబడి జైలులో ఉన్నాడని వివరించారు. గంజాయి వ్యాపారం ద్వారా ప్రధాన నిందితుడు సంపాదించిన 2 కోట్ల రూపాయిల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు వివరించారు.ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని ఎస్‌పి వకుల్ జిందల్ వివరించారు. ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యారెడ్డి, బొబ్బిలి రూరల్ సిఐ కె.నారాయణరావు, రామభద్రపురం ఎస్ఐ వి.ప్రసాదరావు,కానిస్టేబుళ్లు వై.రమేష్,ఎస్.రవి, ఎ.ధర్మారావు,పి.నాగార్జునలను ఎస్‌పి వకుల్ జిందల్ అభినందించారు. ప్రశంసా పత్రాలను అందజేశారు. విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి భవ్యారెడ్డి,బొబ్బిలి రూరల సిఐ నారాయణరావు, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు,ఆర్‌విఆర్‌కె చౌదరి, రామభద్రపురం ఎస్ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

>> సుమారు 200 మీటర్ల దూరం వరకూ చెల్లాచెదురయ్యాయి. పనిచేసే కార్మికులు తమ విధుల్లో బాణాసంచా తయారీలో ఉన్నారు. అదే సమయంలో పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు మానవ శరీర భాగాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఒకదశలో మంటలు అదుపుచేసేందుకు విధ్వంసం కట్టడిచేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ఎంతో శ్రమించాల్సి వచ్చింది. ప్రమాద తీవ్రతవల్ల మృతులసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకూప్రమాదానికి గల కారణాలపై అధికారిక సమాచారం ఏదీ లేదు. అయితే ఇంకా ఎంతమంది కార్మికులు ఈప్రమాదంలో చిక్కుకున్నారన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను రికవరీచేసారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలతో దీశా సివిల్ ఆసుపత్రికి తరలించారు. బనసకాంత కలెక్టర్ మిహిర్ పటేల్ మాట్లాడుతూ బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించిందని, దీశా పారిశ్రామిక వాడలో జరిగిందని ఈ ఉదయం తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. పేలుడు ధాటికి శ్లాబ్ కూలిపడింది. కార్మికుల కుటుంబాలు కూడా ఫ్యాక్టరీ ఆవరణలోనే నివసిస్తున్నాయి. మున్సిపల్ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చింది.



# రోలర్ స్కేటింగ్‌లో దొంతర గ్రీష్మ ప్రతిభ

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖకు చెందిన ఆర్టిస్టిక్ స్కేటర్ దొంతారా గ్రీష్మను ఏపీ ప్రభుత్వం సముచిత రీతిన సత్కరించే దిశలో సన్నద్ధమవుతుంది. శాప్ చైర్మన్ రవినాయుడు, క్రీడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆ దిశలో అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఇటీవల తైవాన్‌లో జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 3 స్వర్ణపతకాలు సాధించింది. విశాఖ వ్యాలీ స్కూల్‌లో ప్లస్ టూ చదువుతున్న 16 ఏళ్ల గ్రీష్మ ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు తైవాన్‌లో జరిగిన ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంది. పెయిర్, పెయిర్ డ్యాన్స్, క్వార్టెట్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఈ క్రమంలో స్కేటర్ దొంతారా గ్రీష్మకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో 3 స్వర్ణాలు సాధించిన గ్రీష్మ మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఎక్స్ లో పోస్ట్ చేశారు. మరో రెండు ఈవెంట్లలో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది దక్షిణ కొరియాలో జరగనున్న ఆసియా ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించడమే లక్ష్యమని గ్రీష్మ వెల్లడించింది. తల్లిదండ్రులు, కోచ్‌లు సత్యనారాయణ, చిట్టిబాబుల తర్ఫీదు వల్లనే ఈ పతకాలు సాధించినట్లు, వారికి గ్రీష్మ కృతజ్ఞతలు తెలిపారు. పాల్గొన్న ప్రతి పోటీలోనూ గ్రీష్మ పతకాల పంట పండిస్తోంది.

# దుర్గమ్మకు విశేష పుష్పార్చన



పుష్పార్చనలో పాల్గొన్న జపాన్ టోక్యోకు చెందిన మహిళలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 1, ప్రభాత'వార్త'** ప్రత్యేక పుష్పార్చనలందుకున్న దుర్గమ్మ వారు భక్తులను అనుగ్రహించారు. వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా తెల్లచామంతులు, మల్లెపూలు అమ్మవారి అర్చన ప్రాంగణానికి అధికారులు పండితులు, అర్చకస్వాములు తీసుకొచ్చి అక్కడ అమ్మవారికి పూజాదికాలు జరిపించారు. జపాన్ టోక్యోకు చెందిన ఇద్దరు మహిళలుశ్రీ అమ్మవారి పుష్పార్చనలో పాల్గొనడం విశేషం.

# వైద్యులు నైతిక విలువలకు కట్టుబడి పనిచేయాలి

**- ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్**

## అవసరం లేకున్నా స్కానింగ్‌లు,ఎక్స్‌రేలు రాయకండి, ఆస్పత్రి అంటే ప్రజలు భయపడకుండా వచ్చేలా చేయండి



మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,ఏప్రిల్1.,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్యులు నైతిక విలువలకు కట్టుబడి పనిచేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం వైద్య విద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. వైద్యో నారాయణో హరి అన్న నానుడిని నిజం చేస్తూ ముందుకు సాగాలన్నారు. అవసరమున్న లేకున్నా ఎక్స్ రేలు,స్కానింగ్‌లు రాయకూడదన్నారు. వైద్య వచ్చిన వారిలో ఆత్మస్థయిర్యం కలిగించాలి తప్ప ఆస్పత్రికి వెళ్ళాలంటే భయపడే పరిస్థితి తీసుకుని రావోద్దన్నారు. ఎన్టీయార్ హెల్త్ యూనివర్సిటీలో ఏపీ మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం, పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం వేడుకగా జరిగింది. ఏపీ మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ జి. సుజాత, డాక్టర్ కె. వెంకట సుబ్బనాయుడు, డాక్టర్ డి. శ్రీహరి, డాక్టర్ స్వర్ణ గీత, డాక్టర్ ఎస్. కేశవరావు బాబు, డాక్టర్ సి. మల్లేశ్వరీ ల చేత మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ వైద్యుల రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్ లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. వైద్యులు తమ సర్టిఫికెట్లను ప్రతి ఐదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేయించుకోవాలని, ఈ నిబంధన ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. దీంతో వైద్యుల పనితీరుపై పర్యవేక్షణ పెరుగుతుందన్నారు. విదేశాల్లో ఉన్న వైద్యుల విషయం లో కొంత సమస్య ఉన్నప్పటికీ వాటిని కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. వైద్యులు నైతిక విలువలు పాటించాలని, అవసరం ఉన్నా లేకపోయినా యాంటిబయోటిక్స్ వాడించడం, టెస్ట్ లు పేరుతో రోగులు ఆర్ధికంగా చితికిపోయేలా వ్యవహరించకూడదన్నారు. నేడు వైద్య వృత్తి వ్యాపారమైందన్న విమర్శలకు చెక్ పెట్టాలని కోరారు. పవిత్రమైన వైద్య వృత్తిని స్వీకరించిన నాడు చేసిన ప్రమాణం ప్రకారం వైద్యులు నడుచుకోవాలని వైద్యులకు మంత్రి సూచించారు. అయితే కొంత మంది రోగులు, వారి బంధువులు ఎక్కువ టెస్ట్ లు రాసి, ఎక్కువ మందులు రాసిన వారే మంచి వైద్యులన్న ఆలోచన లో ఉన్నారని, వారు కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. నేటి కాలంలో సిజేరియన్ ఆపరేషన్లు పెరిగిపోయాయని,

అందుబాటులోకి వస్తున్న కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని నార్మల్ డెలివరీలు జరిగేలా వైద్యం అందించాలన్నారు.

ఏపీఎంసీలో మొత్తం 23 మంది సభ్యులు ఉంటారని, నలుగురు ఎక్స్ అఫిషియో మెంబర్లు, 13 ఎలక్టెడ్ మెంబర్లను ఎన్ను కోవాల్సి ఉందన్నారు. అలాగే మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక కూడా జరగాల్సి ఉందన్నారు.

# విజయవాడలో ప్రవీణ్ ఉన్న మూడు గంటల్లో ఏమి జరిగింది?

**- పాస్టర్‌కు కుటుంబ సమస్యలున్నాయా..**

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** రాజమహేంద్రవరంలో పాస్టర్ ప్రవీణ్ మరణానికి ముందు విజయవాడలో గడిపిన మూడు నుంచి నాలుగు గంటల నడుమ ఏం జరిగిందనే విషయాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఆయన విజయవాడ రామవరప్పాడు చౌరస్తా సమీపంలోని ఓ పార్కులో విశ్రాంతి తీసుకున్న తర్వాత నుంచి మృతి వరకు మధ్యలో ఏం జరిగిందనే విషయాలు బయటికొస్తున్నాయి. ప్రధానంగా విజయవాడలో ఆయన్ని చివరిసారిగా చూసిన ట్రాఫిక్ ఎస్ఐ, టీకొట్టు మాస్టర్ ఆ రోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు రామవరప్పాడు వద్ద ఏం జరిగిందనేది వివరించారు. ప్రవీణ్ ద్విచక్రవాహనం హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం మరోవైపు చాలా నీరసంగా కనిపించడంతో ఈ రాత్రి వేళ రాజమహేంద్రవరం వెళ్లొద్దని, స్థానికంగా ఉన్న హోటల్‌లో విశ్రాంతి తీసుకుని ఉదయం బయల్దేరి వెళ్లాలని ఎస్ఐ, టీకొట్టు మాస్టర్ ప్రవీణ్‌కు సూచించినా ఆయన వినిపించుకోలేదని అందున్నారు. రాజమహేంద్రవరంలో అత్యవసర పని ఉంది ఇప్పుడే వెళ్లాల్సి అంటూ ప్రవీణ్ లైట్లు లేని ఆ బైక్‌పైనే వెళ్లిపోయినట్లు వారిద్దరూ పేర్కొన్నారు. గత నెల 24న సాయంత్రం 4.45 గంటలకు గొల్లపూడిలో పెట్రోల్ బంక్‌కు ప్రవీణ్ చేరుకున్నారు. అప్పటికే ద్విచక్ర వాహనంపై తూలుతూ ఉండటం, బైకు లైట్ పగిలిపోయి ఉండటం, బైక్ సేఫ్టీ రాడ్ వంకర పోవడం పెట్రోల్ బంకులోని సీసీ కెమెరాలో నమోదైంది. బంకులో సిబ్బంది ఎంత పెట్రోల్ కావాలని అడిగితే చేతితో 8 అని సైగ చేశారు. రూ.872 తన ఫోన్‌పే ద్వారా నగదు పంపించి విజయవాడ వైపు వెళ్లిపోయారు. రామవరప్పాడు రింగ్ వద్ద తాను ఆ రోజు విధులు నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. సాయంత్రం 5:20 గంటల ప్రాంతంలో సెల్ఫ్ యాక్సిడెంట్ అయిందని చెప్పారు. చుట్టుపక్కల వారు ప్రవీణ్‌ను లేపి పక్కన కూర్చోబెట్టారని వివరించారు. సమాచారం తెలిసిన వెంటనే తాను ప్రమాద స్థలానికి వెళ్లినట్లు పేర్కొన్నారు. బండికి హెడ్‌లైట్ ఊడిపోయిందని, కళ్లజోడుకు ఒక అద్దం లేదన్నారు. దెబ్బలు తగిలాయా? అని అడిగితే ప్రవీణ్ లేదని చెప్పారు. ఆయణ్ని సమీపంలోని పార్కులో కూర్చోబెట్టామని సుబ్బారావు వెల్లడించారు; దాదాపు మూడు గంటలు ప్రవీణ్ అక్కడే కూర్చున్నారని సుబ్బారావు పేర్కొన్నారు. తన విధులు ముగిసిన తర్వాత ఎనిమిది గంటల సమయంలో వెళ్లి ప్రవీణ్‌ను పలకరించానని చెప్పారు. టీకొట్టుకు తీసుకెళ్లి టీ ఇప్పించినట్లు తెలిపారు. అప్పటికే హెడ్‌లైట్ వేలాడుతోందని తాను ట్రాఫిక్ బూత్‌లోకి తాడు కోసం వెళ్లానని వివరించారు. మళ్లీ తిరిగి వచ్చే సరికే కనిపించలేదని ఆయన బాగా నీరసంగా, మగతగా ఉన్నారని ట్రాఫిక్ ఎస్సై అన్నారు. ద్విచక్ర వాహనం పడిపోవడంతో పగిలిపోయిన హెడ్‌లైట్‌ను మరమ్మతు చేసేందుకు ఎవరైనా స్థానికంగా మెకానిక్ ఉన్నారా అంటూ ప్రవీణ్ తనను అడిగారని టీకొట్టు మాస్టర్ నాగార్జున తెలిపారు. ఇక్కడ ఎవరూ లేరని తాము చెప్పామని అన్నారు. హెడ్‌లైట్ కిందకు వేలాడుతుండటంతో కనీసం దానిని తీగతో కడతాను ఉండండి అంటూ హోటల్‌లోకి వెళ్లి వచ్చేలోగానే అక్కడి నుంచి ప్రవీణ్ తన వాహనంపై వెళ్లిపోయారని వివరించారు.



# మత్స్యకారులపై అలల పంజా

**-ఇద్దరు మత్స్యకారులు గల్లంతు**

**శ్రీకాకుళం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో మంగళవారం ఉదయం సముద్రంలో వేటకు వెళ్లి రాకాసి ఆలకు ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. మంచినీళ్లపేటలో మంగళవారం ఉదయం నాలుగు గంటల సమయంలో గ్రామానికి చెందిన బొంగ కోటేశ్వరరావు, చింతల వెంకటేష్, వంక కృష్ణ, బుంగ ధనరాజులు వేటకు వెళ్లారు. రాకాసి అలలకు బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో చింతల వెంకటేష్, బొంగ కోటేశ్వరరావు ఈదుకుంటూ ప్రమాదం నుంచి తప్పించుకుని ఒడ్డుకు చేరుకున్నారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. వీరి ఆచూకీ కోసం స్థానిక మత్స్యకారులు సముద్రంలో గాలిస్తున్నారు. మత్స్యకారుల గల్లంతుపై మంత్రి అచ్చెన్నాయుడు మత్స్యశాఖ అధికారులతో ఫోన్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేటకు వెళ్లి వస్తుండగా మత్స్యకారుల బోటు తిరగబడడంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. గల్లంతైన నలుగురు మత్స్యకారుల్లో ఇద్దరు క్షేమంగా ఒడ్డుకు చేరుకోవడంతో మిగిలిన ఇద్దరు మత్స్యకారులను ఒడ్డుకు చేర్చేందుకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి ఆలయంలో 6న శ్రీరామనవమి ఆస్థానం -7న పట్టాభిషేకం



**తిరుమల,ఏప్రిల్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** త్రేతాయుగంలో సాక్షాత్తు శ్రీరామచంద్ర మూర్తి కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా ఆవిర్భవించారనే పురాణగ్రంధాల ఆధారంగా తిరుమలలో శ్రీరామనవమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 6వతేదీ వెంకన్న ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం, 7న శ్రీరామపట్టాభిషేకం మహోత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు. 6వతేదీ ఆదివారం ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు రంగనాయకుల మండపంలో శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపిస్తారు. ఇందులో పాలు,పెరుగు,తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు,చందనంతో అభిషేకం చేస్తారు. సాయంత్రం6.30గంటల నుండి 8గంటలవరకు హనుమంతవాహనసేవ తిరుమలలో వైభవంగా జరగనుంది. ఆ తరువాత రాత్రి 9గంటల నుంచి 10గంటలవరకు బంగారువాకిలిలో శ్రీరామనవమి ఆస్థానం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం సహస్రదీపాలంకారసేవ రద్దయ్యింది. 7వతేదీ సోమవారం రాత్రి 8గంటల నుంచి 9గంటల వరకు బంగారువాకిలిలో ఆలయ అర్చకులు శ్రీరామపట్టాభిషేక ఆస్థాన మహోత్సవం వేడుకగా నిర్వహిస్తారు.

## బేడిఆంజనేయస్వామి మూలమూర్తికి నిధులు విడుదలైనా అమలుకాని బంగారుతాపడం



**తిరుమల,ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** మూడేళ్ళక్రిందట అప్పటి అధికారంలో ఉన్న టిటిడి పాలకమండలి ప్రతిపాదనలకు నేటికీ మోక్షం కలగలేదు. ఆ ఆమోదం అమలుకాకపోగా ఆ వైదిక కార్యక్రమం కోసం విడుదలైన నిధులు ఏమయ్యాయో?అనేది ఇప్పుడు టిటిడి అర్చకుల్లో చర్చ మొదలైంది. ప్రస్తుతం వెండి తాపడాలతోనే బేడి ఆంజనేయ స్వామి భక్తులకు దర్శనమిస్తుండటం విశేషం. కలియుగవైకుంఠం తిరుమలకొండపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా బేడిఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ప్రత్యేకత కూడా లేకపోలేదు. సాక్షాత్తు స్వామివారి ప్రియభక్తుడుగా పూజలందుకుంటున్నాడు. ఇక్కడ బేడి ఆంజనేయస్వామి మూలవిరాట్టుకు బంగారుతాపడం చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం 2002 జులైలో నిర్ణయించింది. ఇందుకు అవసరమైన సుమారు 18.75లక్షలు రూపాయలు నిధులను మంజూరుచేస్తూ అప్పటి పాలకమండలి ఆమోదించింది. ఈ పనులు అదే ఏడాది సెప్టెంబర్‌లో వెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యేనాటికి పూర్తిచేసే దిశగా టిటిడి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా ఈ పనులు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం బేడిఆంజనేయస్వామికి వెండితోతయారుచేయబడిన కవచాలును అమర్చిఉన్నారు. వీటిపై బంగారుతాపడం చేయాలని భక్తుల కోరిక మేరకు టిటిడి ఈ పనులు మొదలుపెట్టాలని, ఇందుకు దాతల సహకారం కూడా తీసుకోవాలని నిర్ణయించారు. అయితే గత మూడేళ్ళుగా ఇవేమీ అమలు కాలేదు. తిరుమలలో ఏదేని ఆలయ శుభకార్యాలు, పట్టువస్త్రాలు సమర్పణ, మఠాధిపతులు, పీఠాధిపతులు పెద్దమర్యాద సమయాల్లో, బ్రహ్మోత్సవాల్లో గొడుగులు సమర్పణకు ముందు వాటిని తొలుత బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చి ఇక్కడ ఉంచి ప్రత్యేక పూజలు చేయడం సంప్రదాయం. దీంతో బేడి ఆంజనేయస్వామికి మరింత విశిష్టత సంతరించుకుంది. ఇక్కడ స్వామివారికి బంగారు తాపడం చేయాలనేది భక్తుల అభిప్రాయాలు మాత్రం కాగితాలపైనే ఉండిపోయింది. అంతేగాక తిరుమల ఆలయంలో మూలవిరాట్టు శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైఉన్న బంగారువాకిలిని కూడా స్వర్ణమయం చేయాలని సంకల్పం నెరవేరడం లేదు.

## అనారోగ్యంతో తమిళనాడు భక్తుడు మృతి

**తిరుమల,ఏప్రిల్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన తమిళనాడు భక్తుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆలయానికి సమీపంలోని సహస్రదీపాలంకారసేవ జరిగే ప్రాంతంలో అతను ప్రాణాలు కోల్పోయాడు. తిరుమల పోలీసుల సమాచారం మేరకు.....తమిళనాడు తిరువళ్ళూరుకు చెందిన ఎస్. మోహన్‌సుందర్(35)గా గుర్తించారు. అతని జేబులోని ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో మృతి చెందాడనేది పోలీసుల సమాచారం. అయితే మరెలాంటి వివరాలు లేకపోవడంతో దర్శనానికి వచ్చి ఇలా జరిగిందా లేక ఏదేని కారణాలు ఉన్నాయా అనేది పోస్టుమార్టమ్ నివేదికలో తేలాల్సివుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. తిరుమల 1టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# 6న సీతారాముల కళ్యాణోత్సవానికి సన్నాహాలు

**శ్రీరామనవమికి ముస్తాబౌతున్న ఆలయాలు**



కైకాలవీధిలోని సూరాతివారి రామమందిరంలో వెలసిన సీతారామలక్ష్మణుల

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తి పట్టణంలోనూ, పరిసర గ్రామాల్లో శ్రీరామ మందిరాలు నవమి ఉత్సవాలకు ముస్తాబౌతున్నాయి. ఈ నెల 6 శ్రీరామనవమి కావటంతో గ్రామాల్లో సందడి నెలకొంది. అంతేకాక శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూడా శ్రీరాముని కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సూచనలతో ఇఓ టి.బాపిరెడ్డి సారధ్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

**6న కళ్యాణోత్సవం:** ఏర్పాట్లులో అధికారులు శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించే సీతారాముల కళ్యాణోత్సవం ఈ నెల 6న నిర్వహించుటకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో ప్రసన్న వరదరాజస్వామి ఆలయ ప్రంగణంలో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించే వారు. గత మూడేళ్ళుగా వరదరాజ స్వామి ఆలయం పునర్నిర్మాణం జరుగుతున్నందువల్ల నెహ్రూవీధిలోని శ్రీరామ మందిరంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఇఓ టి.బాపిరెడ్డికి ఇది కొత్త. కాబట్టి ఎలాంటి అవరోధాలు లేకుండా నిర్వహించుటకు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

**గ్రామాల్లో సందడే సందడి:** సాధారణంగా శ్రీరామనవమి ఉత్సవాల్ని పట్టణంలోనే కాకుండా పల్లెల్లో కూడా అంగరంగవైభవంగా నిర్వహించటం ఆనవాయితి. ఒక్కొక్క మందిరం పరిధిలోని అన్ని కుటుంబాల వారు భాగస్వాములుగా ఉభయాల్ని అందించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో శ్రీరామనవమి అంటే పల్లెల్లో ఎక్కడ లేని సంబరాలు, పోటీలు పడి ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నెహ్రూవీధిలోని శ్రీ పట్టాభిరామ మందిరంలో బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితి. ఈ ఉత్సవాల్ని నేడు నిర్వహించనున్నారు. ఇప్పటికే మందిరంను శుభ్రం చేసి చలువ పందిళ్ళు వేశారు. శ్రీకాళహస్తి పట్టణంలో సుమారు 70 మందిరాలు ఉన్నాయి. ఒక్కొక్క మందిరంలో పురాతన కాలం నాటి సీతారామలక్ష్మణుల చిత్రపటాలున్నాయి. ఆ రోజుల్లోనే ఉభయదారులు చిత్రపటాల్లోని శ్రీరాముని చిత్రాల్ని బంగారు పూతతో తయారు చేయించుకున్నారు. వాటిని గుర్తించిన దొంగలు కొందరు చిత్రపటాల్ని తీసుకెళ్ళారు. ఇటీవల కాలంలో సన్నిధివీధి, గాంధీవీధి,వైష్ణవకోనేరు వద్ద శ్రీరామమందిరాలు జీర్ణోద్ధారణ గావించారు. ఉత్సవాల్ని ప్రతి వీధిలోనూ ఘనంగా నిర్వహించటం ఆనవాయితి. సన్నిధివీధి, అగ్రహారంలోని మందిరంలో భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహించటం జరుగుతుంది. దేవస్థానం సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ సీతారాముల కళ్యాణాన్ని ప్రసన్న వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే వారు. ఇదో పండగ వాతావరణం చోటు చేసుకునేది. ఇప్పటికే రామమందిరాలు ముస్తాబు అయ్యాయి. శ్రీకాళహస్తి పరిసర గ్రామాల్లో శ్రీరామనవమిని ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలో రెండు మూడు రామమందిరాలుంటున్నాయి. ఇక్కడ ఉభయదారులు కూడా అధిక సంఖ్యలో ఉంటున్నారు. ప్రతి రోజూ రాత్రి వేళల్లో ఉభయదారులు పోటీలు పడి ఉత్సవాల్ని నిర్వహిస్తారు. కొన్ని గ్రామాల్లో 15 రోజుల పాటు ఉత్సవాల్ని నిర్వహిస్తారు. ఏ రోజు కా రోజు పోటీలు పడి సంబరాలు జరుపుతారు. ముఖ్యంగా పట్టాభిషేకం, కళ్యాణోత్సవం, వసంతోత్సవం అంటే పండగల కన్నా అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. శ్రీకాళహస్తిలోని రామమందిరాల్లో చిత్రపటాలుంటే సన్నిధివీధిలో సీతారామలక్ష్మీణ భరత శత్రుఘ్నుల విగ్రహాల్ని తయారు చేసి పూజలు జరుపుతున్నారు.

# రూ.2000 కోట్లతో రహదారుల పునరుద్ధరణ

**విజయవాడ ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అధ్వాన్నంగా మారిన ప్రధాన రహదారులను పునరుద్దరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గుంతలు పూడ్చినా చిన్నచిన్న మరమ్మతులు చేసినా వాహనాలు సాఫీగా ప్రయాణించేందుకు అవకాశం లేని రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వాలని ఆర్ అండ్ బీశాఖను ఆదేశించింది. ఈ మేరకు 4972 కి.మీ. మేర రహదారుల పునరుద్దరణ పనులు చేయాల్సి ఉంటుందని ఆర్‌అండ్‌బీ లెక్కతేల్చింది. వీటికి రూ.రెండు వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. ఈ నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వం కసరత్తు ఆరంభించింది. గత ప్రభుత్వంలో హయాంలో సకాలంలో మరమ్మతులు, పునరుద్దరణ పనులు చేయకపోవడంతో అనేక రోడ్లు ఘోరంగా తయారయ్యాయి. అటువంటి వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. నాబార్డ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ఇచ్చే రూ.400 కోట్లతో 1,247 కి.మీలను అభివృద్ధి చేయనున్నారు. అలాగే మరో 1433 కి.మీల పునరుద్దరణకు కేంద్రం ఇచ్చే స్పెషల్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ నిధులు రూ.600 కోట్లు వెచ్చించనున్నారు. ఈ పనులకు రెండు రోజుల కిందట అనుమతులు కూడా ఇచ్చారు. న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులు, రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధితో పనులు చేసేందుకు గతంలో ఎంపికచేసి తర్వాత రద్దయిన రోడ్లలో 2292 కి.మీ.లను పూర్తిస్థాయిలో పునరుద్దరించనున్నారు. వీటికి కూడా సాస్కి నిధులు రూ.1000 కోట్లు వెచ్చించేలా ప్రతిపాదించారు. మొత్తంగా రూ.2 వేల కోట్లతో 4972 కి.మీ.ల పనులు చేయనున్నారు. ఇందులో జిల్లా రహదారులు 3162 కి.మీ. కాగా రాష్ట్ర రహదారులు 1810 కి.మీ ఉన్నాయి. న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం రూ.6400 కోట్లతో గత ప్రభుత్వంలో ఏక వరుస రహదారులను రెండు వరుసలుగా విస్తరించేలా పనులు చేపట్టారు. ఈ నిధుల్లో 70 శాతం రుణం కాగా రాష్ట్రవాటా 30 శాతంగా ఉంది. అయితే ఈ ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. మొదటి దశలో 1244 కి.మీ.లు విస్తరణ , రెండు వంతెనల నిర్మాణానికి రూ.3014 కోట్లు మంజూరయ్యాయి.

# పింఛన్ సొమ్ము పంపకం చేయకుండా పరారైన సెక్రటరీ

**పిఠాపురం, ఏప్రిల్ 1, ( ప్రభాత వార్త ) :** పింఛన్ సొమ్మును పింఛనుదారులకు పంపిణీ చేయకుండా, సచివాలయం ఉద్యోగి పరారైన సంఘటన పిఠాపురం పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డు సచివాలయంలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న వై. వెంకటరమణ, క్లస్టర్ సి6, సి 7 లో పింఛన్ పంపిణీ అధికారిగా ఉంటున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఏప్రిల్ నెలకు సంబంధించి, రూ.1,82,000 గాను, 31 తేదీన రూ.32 వేలు నగదును వార్డు అడ్మిన్ సెక్రటరీ రవి వద్ద ఉంచి, మిగిలిన రూ.1,50,000 తీసుకువెళ్ళాడు. మంగళవారం ఉదయం 7 గంటలకు ఫించన్ పంపిణీ ప్రారంభ కావాల్సి ఉండగా, పంపిణీ జరగలేదు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సదరు సెక్రటరీకి ఫోన్ చేయగా, ఫోన్ పని చేయకపోవడం, ఇంటి దగ్గర వారికి కూడా తెలియకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సెక్రటరీ ఆచూకీ తెలియకపోవడంతో అసలు ఏమి జరిగింది, అనేది ప్రశ్నగా మారింది.

# అమృత్ పథకం ద్వారా 17 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ

**- 446 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు**

**రైల్వే డివిజన్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి**

**అనంతపురం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త బ్యూరో** దక్షిణ మధ్య రైల్వే లో గతంలో ఎప్పుడూ లేనివిధంగా అభివృద్ధి పనులు జరుగు తున్నాయని గుంతకల్ రైల్వే డివిజన్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.. 446 కోట్లతో 17 రైల్వేస్టేషన్లో ఆధునీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.. మంగళవారం అనంతపురం రైల్వే స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం రైల్వే స్టేషన్ భవన్ లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్లో రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయన్నారు. ప్రయాణికులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా అమృత్ భారత్ స్టేషన్లు అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ అంశాలను తీసుకున్నారని డీసీఎం శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 53 స్టేషన్లు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతపురం జిల్లాలోని గుంతకల్ డివిజన్ పరిధిలో 17 స్టేషన్ల కోసం 446 కోట్లు నిధులు కేటాయించినట్లు వివరించారు. ఇందులో అనంతపురం రైల్వే స్టేషన్ ను 29 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఫెస్ 1 లో 10 కోట్ల పనులు జరుగుతున్నాయని... ఇప్పటికే ప్రయాణికులకు మెరుగన సౌకర్యాలు అందిస్తున్నట్లు వివరించారు.

తక్కువ పదాలతో ఎక్కువ విషయాలు చెప్పడం మేధావుల లక్షణమైతే, చెప్పేదేమీ లేకపోయినా ఎక్కువ పదాలు వినియోగించడం మూర్ఖుల లక్షణం.

-కాల్టన్

# పంచాయతీలను నిర్వీర్యం చేయొద్దు!

జాతిపిత మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలకపెద్దలు ఏనాటి నుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి హామీలుగానే మిగిలిపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉన్నది. కనీసం రాజ్యాంగం కల్పించిన అధికారాలు కూడా స్థానిక సంస్థల ప్రతినిధులకు అప్పగించేందుకు పాలకపెద్దలు ఇష్టపడడం లేదు. కొత్త అధికారాల సంగతి దేవుడెరుగు. సర్పంచులకు గతంలో ఉన్న అధికారాలు కూడా క్రమేపీ కనుమరుగైపోతున్నాయి. ఒకనాడు గ్రామాల్లో తిరుగులేని అధికారాలు, హోదా ఉన్న సర్పంచులు నేడు ఉత్సవ విగ్రహాలుగా మారిపోతున్నారనే చెప్పొచ్చు. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గురించి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎందరో నాయకులు పెద్దపెద్ద మాటలు చెప్తూనే ఉన్నారు. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాటికి కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవంగా చూస్తే గ్రామసర్పంచులకు ఒక వ్యూహం ప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. చివరకు స్వతంత్రంగా చీపురుకట్ట కొనలేని దురదృష్టపు పరిస్థితులుతెచ్చిపెట్టారు. ఇందుకు కారణం వారూవీరు అనే దానికంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు తమవంతు ప్రయత్నాలు చేశారు, చేస్తున్నారు. గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలను పెట్టి సర్పంచులను పక్కకు పెట్టారు. వారి ప్రమేయం లేకుండానే వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితులు తీసుకువచ్చారు. ఒకరకంగా చెప్పాలంటే సర్పంచులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. నిన్న మొన్నటివరకు ఆంధ్రప్రదేశ్‌లో వాలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టి సర్పంచుల ఉనికినే ప్రశ్నార్థకం చేశారు. ఇలాంటి చర్యలతో ఉన్న ప్రాధాన్యత కూడా లేకుండాపోయింది. నేతల వాగ్దానాలు, ఉపన్యాసాలు, హామీలతో ఏదో సాధించాలని సమాజానికి ఏదోచేయాలని నూతన ఉత్సాహంతో ఎందరో యువతీయువకులు పోటీచేసి ఎన్నోవ్యయప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. గ్రామాభివృద్ధికి తాము చేసిన వాగ్దానాలు తీర్చేందుకు నడుం కట్టారు. కానీ ఈ చట్టాల వలలో, రాజకీయాల వ్యూహాలలో తాము ఏమీ చేయలేమనే విషయం అర్థంకావడానికి వారికి చాలాకాలం పట్టింది. అయితే తమ గ్రామప్రజలకు తాము చేసిన వాగ్దానాలు పూర్తిచేసేందుకు తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి కొన్నిగ్రామాల్లో పనులు పూర్తిచేశారు. అయితే ఎంతకూ ఆ బిల్లులు రాకపోవడం ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి ఇంకొకపక్క అప్పులు, వడ్డీలుపెరిగి మరొకపక్క గ్రామప్రజల ముందు తలవంచుకోలేక డజను మందికిపైగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ పరిస్థితిలో గతయేడాది జనవరి 31వ తేదీతో వారి పదవీ కాలం గడువు పూర్తయిపోయింది. అప్పటి నుంచి వారు మాజీలుగా మారిపోయారు. అయినా ఇప్పటికీ వారికి బిల్లుల డబ్బులు రాకపోవడంతో సర్పంచులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. మరొకపక్క ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికీ బిల్లులు వస్తాయో రావో తెలియదు. వస్తే ఎప్పుడువస్తాయో చెప్పేవారు లేరు. అంతా అగమ్యగోచరంగా ఉంది. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులంటే గౌరవమర్యాదలుండేవి. భారత దేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్రఉంది. చంద్రగుప్తుడి కంటే ముందు నుంచి గ్రామాలు, గ్రామవ్యవస్థ అమలులో ఉన్నట్లు ఆధారాలున్నాయి. ఆనాడు కూడా గ్రామసభలుండేవి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికం వ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేది. ప్రాచీన కాలం నుండి గ్రామీణ వ్యవస్థ ఏదోఒక రూపంలో భారత్‌లో కొనసాగుతూనే ఉన్నది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్‌రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామస్వరాజ్య లక్ష్యంలో స్థానిక సంస్థల పటిష్టత అన్నది ముఖ్యాంశం. భారతరాజ్యాంగంలో స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. 1952 నుంచి ఎన్నో కమిటీలు, మరెన్నో అధ్యయనాల అనంతరం ఎన్నో మార్పులు చేర్పులు చేశారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలకపెద్దలకు మనసు ఒప్పడం లేదు. రాను రాను పంచాయతీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలతో ఎన్నికైన సర్పంచులను సస్పెండ్ చేసే అధికారం అధికారులకు కట్టబెట్టిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ఈ వ్యవస్థలో ఎన్నో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నా, ప్రభుత్వాలు మారినా అధికార వికేంద్రీకరణలో మాత్రం ఆది నుంచి అధికారంలో ఉన్న పెద్దలు జాగ్రత్తపడుతూనే ఉన్నారు. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది వంటిది. అందులో సర్పంచులు చాలాకీలకం. రాష్ట్రానికి మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు కేకలు పెడుతున్న నాయకులు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడందురదృష్టకరం. ఇప్పటికైనా ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ పదేపదే వల్లించే నేతలు పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులతో కాలం గడపడం ఏ కోణంలో చూసినా సమంజసం కాదు.

వినడంలో మనిషి తొందర పడాలి, కానీ మాట్లాడటంలో తొందర పడకూడదు. అపార్థం చేసుకోవడంలో అసలు త్వరపడకూడదు.



జేమ్స్ జ్యూడిత్

మనస్సును మంచి ఆరోగ్యకరమైన ఆలోచనలతో నింపండి. అవే జీవితాన్ని సుఖమయం చేస్తాయి.



విల్‌కిన్స్

# 'ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్'తో న్యాయం సాధ్యమా?

న్యాయవ్యవస్థలోని అవినీతి ఆరోపణలను కేంద్రప్రభుత్వం, సుప్రీంకోర్టు ఏవిధంగా చట్టపరంగా పరిష్కరించగలదు అన్నదే దేశం ఎదుర్కొం టున్న సమస్య. తెరమీదికి అప్పుడప్పుడూ వచ్చే ఈ అంశం ఇప్పుడు ఢిల్లీ జడ్జి ఇంట్లోని కరెన్సీ మంటల ఆరోపణల నేపథ్యంలో తక్షణ పరిష్కారాన్ని కోరుతున్నది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన అంతర్గత న్యాయాధీశుల కమిటీ ఎలాంటి రిపోర్టు ఇస్తుందో అని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సామాన్యుడు పౌరుడిగా ఈ దేశంలో జీవించే వ్యక్తి కోరుతున్నది ఒక్కటే. అవినీతి ఆరోపణ రాజకీయ నాయకుడు ఎదుర్కొన్నా, న్యాయాధీశులు ఎదుర్కొన్నా, ప్రభుత్వ ఉద్యోగస్థులు ఎదుర్కొన్నా చట్టాలు వారి పట్ల పారదర్శకతతో న్యాయాన్ని బాహాటంగా చేస్తేనే ప్రజాస్వామ్య విలువలను, మనుగడను కాపాడినట్లవుతుంది. ఈ అంటుకున్న నిప్పును కేవలం నామమాత్రంగా ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్‌తో తాత్కాలికంగా ఆర్పుతే న్యాయం జరగదు.



రావులపాటి సీతారాంరావు

ఢిల్లీ హైకోర్టు జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో అవుట్‌హౌస్‌గా పిలవబడే ఇంటి పరిసరాలలోనే తగలబడిన లెక్కకు మించిన కరెన్సీ నోట్లు, నిప్పును ఆర్పటానికి వచ్చిన ఫైర్ డిపార్టుమెంట్ వారు చూసి పోలీసులకు చెప్పారని అదీ, జస్టిస్ ఊళ్లోలేని సమయంలో జరిగిందని కథలుకథలుగా ఘటన గురించి వదంతులో, నిజాలో బయటకు వచ్చాయి. మొదట ఫైర్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారి కాలిన కరెన్సీ మాట నిజం కాదన్నారు. తర్వాత నీళ్లు నమిలారు. కానీ ఈ సంఘటన జరిగిన మరునాటి సాయంత్రం ఢిల్లీ చీఫ్ జస్టిస్‌కు ఢిల్లీ పోలీసు కమిషనర్ సంఘటన గురించి తెలియపర్చారు. ఆ తర్వాత చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకు కూడా తెలిసింది. వివాదంలో చిక్కుకున్న జడ్జిని తిరిగి అలహాబాద్ హైకోర్టుకు (ఆయన పారెంట్ కోర్టు) పంపటం జరిగింది. జడ్జిగారు ఆరోపణనుఖండించారు. బహుశా ఎవరి కుట్ర అయినా వుండొచ్చు అన్న సందేహాన్ని కూడా వెలిబుచ్చారు. ఉన్నతస్థాయిలో ఉన్న జడ్జీలు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవటం చాలా అరుదు. అన్నివ్యవస్థలూ పారదర్శకత లోపించి, అవినీతికి పాల్పడుతున్నప్పుడు న్యాయస్థానాలు నిప్పులాంటివి అని, చెదలు అంటవని భారతదేశ వాసుల ప్రగాఢనమ్మకం. ఆ నమ్మకం నీరు కారిపోవటంతో న్యాయవ్యవస్థ కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న జాబితాలో చేరటం, వ్యవస్థకు కాదు నష్టం, దేశం అనుసరిస్తున్న రాజ్యాంగానికీ, ప్రజాస్వామ్యానికి అపార నష్టం కలిగిన భావనతో ప్రస్తుత సమాజం ఉండటం కడు విషాదకరం. ఇది కేవలం టీకప్పులో తుఫాన్‌గా చెదిరిపోవాలనే సామాన్యులు ఇప్పటికీ ఆశిస్తున్నారు. న్యాయస్థానాలలో అవినీతి చోటు చేసుకుంటున్న అంశం పూర్వాపరాలు గమనిస్తేఇదేమీ కొత్తగా బయటకు వచ్చిన మురికికాదు అని విశ్లేషకుల అభిప్రాయం. అభిప్రాయాలు వేరు, నిజాలువేరు. నిజాలు నిగ్గు తేల్చడానికే ఉన్నత న్యాయస్థానం అంతర్గతంగా ఒక జడ్జీల కమిటీని నియమించి వారు ఇచ్చేరిపోర్టు కోసం ఎదురు చూస్తున్నది. సుప్రీంకోర్టే కాదు, దేశంలో అన్నివ్యవస్థలతోపాటు సామాన్య ప్రజానీకం కూడా ఎదురుచూస్తున్న మాట నిజం. కొన్నేళ్ల కిందట పట్టాభిరామారావు అనే సెషన్స్ జడ్జి స్థాయి న్యాయాధీశుడు, అందరికీ తెలిసిన కర్ణాటక మైనింగ్ కింగ్, గాలిజనార్ధన రెడ్డి కేసు విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొని, అరెస్టు కాబడి, అవమాన భారాన్ని తట్టుకోలేక బెయిల్ మీద ఉన్నప్పుడు ఆత్మహత్య కు పాల్పడ్డారని ఒక కథనంగా ఘటనగా ఇప్పటికీ మర్చిపో లేదు. ఈ కొత్త ఆరోపణ, ఉన్నత న్యాయాధీశుడు మీద వెలుగులోకి రావటంతో మళ్లీ ఈ సంఘటన గురించి చర్చించుకుంటున్నారు. లోయర్ లెవల్‌లో ఉన్న జడ్జి కాబట్టి సి. బి.ఐ ఆయన మీద తీవ్రచర్యలు తీసుకున్నట్లుగా భావిస్తున్నారు కానీ, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయాధీశులకు ఇంపీ చ్‌మెంట్ మాత్రమే చర్యలకు ఆఖరిఅస్త్రంగా ఉండటం గమనార్హం. సామాన్యుడికి ఒక న్యాయం, న్యాయం చెప్పే వారికి మరొక న్యాయం



అన్న అంశం బయటపడింది. రాజ్యాంగంలో ఇలాంటి భేదాలు చోటు చేసుకున్నాయా, న్యాయస్థానాలు చట్టాలను విశ్లేషించి అవసరమైతే తగు చర్యలతోపాటు లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ఉన్నది కదా అన్నదే చర్చ. ఒకటో, రెండో కేసులు వారి పరిధిలో విచారణకు వచ్చిఉండొచ్చు. కానీ అవి అంతగా వెలుగుచూడ లేదు. ప్రజాబాహుళ్యంలో నాన లేదు. అందుకే ఇంకా ఈ చట్టం గురించి అవగాహనా లోపం వల్లనో, స్పష్టత లేకపోవడం వల్లనో పరిస్థితులు, న్యాయాన్యాయాలు క్షుణ్ణంగా ప్రజాస్వామ్యంలో వ్యవహరిస్తున్న మనదేశంలోని చట్టసవర ణకు ప్రతిపాదనలు చోటు చేసుకోలేదు. ప్రముఖ పబ్లిక్ ఇంట్రెస్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ సమస్యను వివరిస్తూ మీడియాలో ఒక వ్యాసం ద్వారా తన అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సంఘటన వల్ల ఉత్పన్నమైన పరిస్థితుల ను ప్రభుత్వం తమకు వీలుగా మల్చుకొనే ప్రయత్నంలో భాగంగా జడ్జీలను నియమించే విషయాన్ని పూర్తిగా తమ కంట్రోల్‌లోకి తీసుకొనేప్రయత్నం మరొకసారి చేస్తున్నదని అభిప్రాయపడ్డారు. అందుచేతే రాజ్యసభ ఛైర్మన్ వైస్ ప్రసి డెంట్ రాజకీయ నాయకులను (అన్ని పక్షాల నుంచి) సమావేశపర్చి నేషనల్ జ్యూడిషియల్ అపాయింట్‌మెంట్ యాక్ట్‌ను కొట్టేసిన తిరిగి ఎందుకు చట్ట పరిధిలోకి తీసుకొని రాకూడదన్న వివాదాంశాన్ని తెరమీదికి తీసుకొని వచ్చారు. (సుప్రీం ఆ యాక్ట్ రాజ్యాంగ బేసిక్ స్ట్రక్చర్‌ను ఉల్లంఘిస్తుందని కొట్టి వేయడం జరిగింది)సుప్రీం కోర్టు జ్యుడిషియల్ అపా యింట్‌మెంట్స్ విషయంలో ప్రభుత్వ జోక్యం సరికాదన్న భావనతో ఈ యాక్ట్‌ను కొట్టేసింది. ఆ విషయాన్ని జడ్జిల అవినీతి ఆరోపణలతో ముడిపెట్టిన చర్చలు అవసరమా? విషయం ఒకటవుతే మరొక విషయాన్ని ముడిపెట్టి సమస్య పరిష్కారం బదులు సమస్యలో భాగంకావడం ఎంతవరకు సమంజసమని కొందరు విజ్ఞులు కూడాభావిస్తున్నారు. అయితే జడ్జిల నియామకాలు కొలీజియం వ్యవస్థ పారదర్శకత లోపించి పూర్తిన్యాయం చేకూర్చటం లేదన్న భావన కూడా న్యాయనిపుణులలో ఉంది. ఆ సమస్యను తేల్గ్గా తీసివేయడం సమంజసం కాదని మరి కొందరి అనుభవజ్ఞుల అభిప్రాయం. ప్రభుత్వం ఎక్కువగా న్యాయమూర్తుల నియామకాలు నియంత్రణ చేయడంకూడా ఈ సమస్యకు పరిష్కారంకాదు. కొలీజియంలోని సిట్టింగ్ జడ్జీలు పనిభారంతో సతమతమ వుతున్నారు. అందుకనే నియామకాల బాధ్యతను పూర్తి ఏకాగ్రతతతో నిర్వర్తించలేక పోతున్నారు. సంవత్సరానికి వందలమంది జడ్జీల నియామకాలు జరగాల్సిన అవసరంఉంది. పూర్తిస్వేచ్ఛతో ఈ బాధ్యతను నిర్వహించటానికి జ్యుడిషియల్ అప్పాయింట్‌మెంట్ కమిషన్ లాంటిది మిగతా నియామకాల వ్యవస్థల మాదిరి చట్టం ద్వారా నిర్దిష్టమైన మార్గదర్శకాలతోటి, అనుభవం కలిగిన వ్యక్తులతోటి జడ్జిలనియా మకాలు చేపట్టటం అనేది మరొక పరిష్కారంగా భావించవచ్చు. న్యాయవ్యవస్థలోని అవినీతి ఆరోపణలను కేంద్రప్రభుత్వం, సుప్రీంకోర్టు ఏవిధంగా చట్టపరంగా పరిష్కరించగలదు అన్నదే దేశం ఎదుర్కొంటున్న సమస్య. తెరమీదికి అప్పుడప్పుడూ వచ్చే ఈ అంశం ఇప్పుడు ఢిల్లీ జడ్జి ఇంట్లోని కరెన్సీ మంటల ఆరోపణల నేపథ్యంలో తక్షణ పరిష్కారాన్ని కోరుతున్నది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన అంతర్గత న్యాయాధీశుల కమిటీ ఎలాంటి రిపోర్టు ఇస్తుందో అని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సామాన్యుడు పౌరుడిగా ఈ దేశంలో జీవించే వ్యక్తి కోరుతున్నది ఒక్కటే. అవినీతి ఆరోపణ రాజకీయ నాయకుడు ఎదుర్కొన్నా, న్యాయాధీశులు ఎదుర్కొన్నా, ప్రభుత్వ ఉద్యోగస్థులు ఎదుర్కొన్నా చట్టాలు వారి పట్ల పారదర్శకతతో న్యాయాన్ని బాహాటంగా చేస్తేనే ప్రజాస్వామ్య విలువలను, మనుగడను కాపాడినట్లవుతుంది. ఈ అంటుకున్న నిప్పును కేవలం నామమాత్రంగా ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్‌తో తాత్కాలికంగా ఆర్పుతే న్యాయం జరగదు.

# వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన అవసరం

రామ కిష్టయ్య సంగన భట్ల

వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల హక్కు అని అర్థం. భారత దేశంలో 1986లో వినియోగదారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. ఈ చట్టం ప్రకారం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగదారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాదకారక వస్తువులు, సేవల నుంచి రక్షణపొందే హక్కు. అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు సేవలను పొందాలి. అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియజేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు. వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసుకోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. వినియోగదారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, లోపాల నుండి పరిహారం పొందేహక్కు. వినియోగదారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగ దారుల విద్య హక్కు. వినియోగదారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతోఅవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కుల పట్ల అవగాహన లేకఎంతో మోసపోతున్నారు. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈకామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుంతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. వినియోగదారు రక్షణచట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కారసంస్థల ఏర్పాటుకు మార్గంసుగమం చేసింది. కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. కేంద్రప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటుచేసే రాష్ట్రవినియోగదారు పరిష్కారసంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ జ్యూడిషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

# తీవ్ర ఒత్తిడిలో ఉపాధ్యాయ లోకం

శ్రీశ్రీ కుమార్

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయ లోకమే నేడు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నట్టు స్పష్టమవుతున్నది. పరీక్షలు, ఫలితాలు వాటితో పాటుగా ప్రమాణాల పేరుతో రకరకాల సర్వేలు, రిపోర్టులు తయారవుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుండడం గమనార్హం. పబ్లిక్ పరీక్షలలో ఫలితాలు ఇంత శాతం సాధించాలని జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు ప్రతి సంవత్సరం నిర్దేశించడం మామూలే. ఫలితాలు అనేవి నిర్దేశిస్తే వచ్చేవి కావని మన అధికారులు ఎప్పటికీ గ్రహించలేరు. వారు క్షేత్రస్థాయిలో వాస్తవాలు గ్రహించకుండా కేవలం ప్రభుత్వాల మెప్పుపొందడం కోసమే ఈ రకమైన నిర్దేశాలు, ఆదేశాలు జారీ చేస్తారు. వారు ఆ రకంగా ఉపాధ్యాయ లోకంపై ఒత్తిడి పెంచడం, ఉపాధ్యాయులు విద్యార్థులపై ఒత్తిడి పెంచడం పర్యవసానంగా విద్యార్థులు తీవ్రమైన చర్యలకు అనగా ఆత్మహత్య లాంటి చర్యలకు పాల్పడడం మనం ప్రతి ఏడూ చదువుతాం. ఫలితాలలో ప్రమాణంగా భావించినంత కాలం నిజమైన ప్రమాణాల స్థాయి ఎప్పటికీ మెరుగుపడదనేది వారు గ్రహించాలి. మనదేశంలో విద్యను ఆషామాషీగా ఆటపాటలుగా నేర్చుకోవడం జరగడం లేదు. అది ఒక తపస్సు లాగాసాగుతుంది. మే నెలలోనే తదుపరి విద్యా సంవత్సరానికి ఒక క్యాలెండర్ తయారు చేయించడం కోసం కొంతమంది మేధావులు నియమింపబడుతారు. వారు తమదైనశైలిలో తమస్థాయిలో ఒక క్యాలెండర్ తయారు చేసి ఆమోదింపచేసుకున్న తర్వాత అన్ని పాఠశాలలకు కళాశాలలకు పంపడం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులతో నిమిత్తం లేకుండా ఏసీ గదుల్లో కూర్చుని తయారు చేసే క్యాలెండర్ వాస్తవాల లోతుల్లోకి చూడకపోగా కనీసం వాటి దరిదాపుల్లో కూడా చేరదు. అందుకే అవన్నీ ప్రయోగాత్మక వైఫల్యాలే. కేవలం పరీక్షల నిర్వహణా మాత్రమే ఆ క్యాలెండర్ ప్రకారం సజావుగా జరుగుతుంది. వాటిలక్ష్యాలు, స్పష్టీకరణలు ఏ మేరకు సాధించగలుగుతున్నారనే ఒక చర్చ ఏనాడూ జరగదు. ప్రతి పాఠ్యాంశానికి సంబంధించిన విషయ బోధన, గ్రహణ లాంటివి ఆచరణాత్మకంగా తయారు కావాలి. సెకండరీ స్థాయిలో కూడా విద్యార్థులకు కనీస సామర్థ్యాలు లేకపోవడం శోచనీయం. అందుకు ఉపాధ్యాయులను నిందించడం దుర్మార్గం. అనేక కారణాలు సమస్యలు ముప్పిరిగొన్న నేపథ్యంలో కనీస సామర్థ్యాల సాధన ఎప్పటికైనా అందని ద్రాక్షే. ఉపాధ్యాయులకు స్వేచ్ఛ లేదు. వారిని ఒక చట్రంలో బిగించి ఈ విధంగానే బోధించాలి, ఇవే బోధించాలి, వాటి ఫలితాలు ఇవే కావాలి అన్నట్లు అధికారులు నిర్దేశించడం హేతుబద్ధం కాదు. అసలు వారికి తరగతి గది పనికి మించి ఇతర కార్యక్రమాలు పనులు ఎక్కువవుతున్నాయి. చివరికి వారు కంప్యూటర్ల లాగానే మానవ రోబోలుగాను మారే పరిస్థితులు దాపురించాయి. బోధన కన్నా బోధనేతర పనులు ఎక్కువైనాయి. అధికారులు కూడా విద్యా ప్రమాణాల గూర్చి, తరగతి బోధనగూర్చి ఏనాడూ పట్టించుకున్న పాపాన పోరు. వారికి కావలసిన, వారు తిరిగి పైఅధికారులకు సమర్పించవలసిన సమాచారం కాగితాల రూపంలో అందిందా లేదా అన్నదే వారి బాధ. అంకెల రూపంలో సమాచారం మాత్రమే వారికి ముఖ్యం. క్షేత్రస్థాయిలో నిజమైన బోధన జరుగుతున్నదో లేదో వారికి



అనవసరం. ప్రమాణాలు మెరుగుపడుతున్నాయా లేదా విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెరుగుదల వారికి ఏనాడు పట్టవు. నైపుణ్యం వెలికి తీసే చర్యలు ఏమీఉండవు. ఆలోచనలకు, సృజనాత్మకతకు తావులేకుండా మన విద్యాధికారులు ఒక ఏడాదికి సరిపోను కార్యక్రమాలు తయారు చేయడం శోచనీయం. వారు మనుషులతో కాకుండా కాగితాలతోనే మాట్లాడతారనేది వాస్తవం. అసలు మంత్రులైనా, అధికారులైనా క్షేత్రస్థాయిలో వాస్తవాలు అధ్యయనం చేశారా వాటిపై సమగ్రమైన సమీక్ష జరిపారా అనేది ఉపాధ్యాయ లోకం ప్రశ్నించాలి. ముఖ్యంగా కరోనా అనంతరపరిస్థితుల్లో విద్యార్థులను నాలుగు గదులకు పరిమితం చేసి వారిచే పాఠ్యాంశాలు చదివించడం, వారికి వినిపించడం ఉపాధ్యాయులకు గగన కుసుమమైన పరిస్థితి. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు అలవాటు పడటం ఒక సంవత్సరానికి పైగా పాఠశాలలకు దూరం కావడం చదువుకు దూరం కావడం ఇలాంటి సమస్యలు మనం తరగతి గదిలో ఎదుర్కొంటున్నాం. కొవిడ్ తర్వాత విద్యార్థులలో మానసిక శారీరక మార్పులు చోటు చేసుకోవడంతో వారిని నియంత్రించడం సరైన మార్గంలో నడిపించడం ఉపాధ్యాయులకు కష్ట సాధ్యమవుతుందనేది కాదనలేని వాస్తవం. కానీ ఇవన్నీ పట్టని అధికారులుమాత్రం మీరు ఏ విధంగానైనా తాము నిర్దేశించిన ఫలితాలు తేవాల్సిందే అనడం ఉపాధ్యాయ లోకాన్ని మరింత సమస్యల వలయంలోకి నెట్టివేస్తున్నది. వారిచే ఇష్టం లేని అనైతిక చర్యలకు పాల్పడేలా చేస్తున్నది. ఎందుకంటే ప్రమాణాల కంటే ఫలితాలు అధికారులను సంతృప్తి పరుస్తాయి. ప్రశ్నపత్రం సరిగా తయారు చేయించలేని లీకులు లేకుండా పరీక్షలు సక్రమంగా జరుపలేని ప్రభుత్వాలు ఫలితాల విషయంలో మాత్రం ఉపాధ్యాయ లోకాన్ని తప్పుపడుతున్నది. ఇటు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, అటు అధికారుల మధ్య ఉపాధ్యాయులు నలిగిపోయి తమ విధులుసక్రమంగా నిర్వహించలేకపోతున్నారనేది కఠినమైన నిజం. మొన్న విజయనగరం జిల్లాలో ఒక ప్రధానోపాధ్యాయుడు ఉదయం పూట విద్యార్థుల ఎదుట తనను తాను శిక్షించుకున్నాడు. విద్యార్థులు సరిగాచదవలేకపోతున్నారని వారు కనీస సామర్థ్యాలు సాధించలేకపోతున్నారని బాధతో ఒక నిస్సహాయ పరిస్థితుల్లో మాత్రమే సదరు ప్రధాన ఉపాధ్యాయుడు ఆ రకమైన చర్యకు పాల్పడ్డాడు. అది ఆ ఒక్కప్రధాన ఉపాధ్యాయుడి స్థితి మాత్రమే కాదు. మొత్తం ఉపాధ్యాయ లోకం మానసిక దైనస్థితిని తెలియజేస్తున్నది. దానికి కారణాలు విశ్లేషించాలి. వాటికి పరిష్కారాలు కనుక్కోవాలి. సమస్య లోతుల్లోనికి పోకుండా రోగనిర్ధారణ సరిగా జరగకుండా కేవలం పైపూత మందులు పనిచేయవు. ఉపాధ్యాయులు తరగతి గదులలో అద్భుతాలు సృష్టించగలరు కానీ వారు సంతోషంగా స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులుండాలి. విద్యార్థి ఒక్క ఉపాధ్యాయుడితో ఉండేది కేవలం 45 నుండి 50 నిమిషాలు మాత్రమే. మొత్తం పాఠశాలలో ఆరు గంటలు ఉంటాడు. ఒక్కొక్క ఉపాధ్యాయుడు విద్యార్థులను ఒక్కొక్క రీతిలో ప్రభావితం చేస్తాడు. సమగ్ర మూర్తిమత్వ రూపకల్పనలో ఎన్నో అంశాలు విద్యార్థిని ప్రభావితం చేస్తుంటాయి. ఇవికాక తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలు, ఆకాంక్షలు, తోటి విద్యార్థుల ఆలోచనలు కూడా ఇందులోభాగమే. అధికారులు రకరకాల పేర్లతోవిద్యార్థుల సామర్థ్యాల మదింపు చేస్తూ ఉపాధ్యాయులను విద్యార్థులను గందరగోళంలో పడవేస్తున్నారు. స్వీయ శిక్షలు క్రమశిక్షణరాహిత్యాన్ని మార్చలేవు. కేవలం సానుభూ తిని మాత్రమే పెంచుతాయి. చాలీచాలని జీతంతో, డిమాండ్ చేసినా తమ హక్కు అయిన డిఏలు రాక, తమ సొంత పిల్లల చదువులు పట్టించుకోలేక తమ ఆరోగ్యాలు పణంగా పెట్టి నిస్వార్థంగా సేవచేసే ఉపాధ్యాయులకు ఇటు ప్రభు త్వంలోనూ సమాజంలోనూ గుర్తింపు గౌరవం లోపిస్తున్న సందర్భం ఇది. పిఆర్సి గొంతెమ్మ కోరిక అయినది. డిఏలు అడగొద్దంటున్నారు. విద్యకు నిధులు కేటాయింపులు అరకొరగానే ఉంటున్నాయి. ఏనాడో చెప్పిన ఆరు శాతానికి ఆరు దశాబ్దాలు దాటినా దిక్కులేదు. నిత్యం అసంతృప్తితో పని చేస్తే ఆ పనిలో ఎవరూ పరిపూర్ణత సాధించలేరు.

# ప్రజావాక్కు



## అయ్యో! బర్మా

పెను భూకంపం ధాటికి మయన్మార్ (బర్మా) కకావికలమైంది. పదహారు వందలకుపైగా మానవప్రాణాలు పోయినట్లు, మూడు వేల మంది క్షతగాత్రులైనట్టు లెక్క ఇప్పటికి తేలినా, గంట గంటకు ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. అమెరికా అంచనాల ప్రకారం విగత జీవుల సంఖ్య కొన్ని వేలల్లో ఉండొచ్చు. అక్కడి రెండు పెద్ద నగరాలు కూలిన భవనాలు, నిర్మాణాలతో మట్టిదిబ్బలుగామారినట్లు ఛాయా చిత్రాలుచెప్తున్నాయి. ఆ శిథిలనగరాల్లో చిక్కుకున్న ప్రాణాలు ఎన్ని ఉన్నాయో, ఎంతవరకు నిలబడతాయో ఎవరూ చెప్పలేరు. వెంటనే అక్కడ సహాయకచర్యలు అందించడానికి భారత్ ముందుకురావడం, 139 టన్నుల సహాయక సామగ్రి, పలు సహాయక బృందాలు, విపత్తు నిర్వహణా టీములు వెంటనే పనిలోకి దిగడం అభినందనీయం.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## పథకాలతో ప్రయోజనాలు

ఇటీవల తెలంగాణ ప్రభుత్వము తెస్తున్న రెండు పథకాలలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇది భూమిలేని నిరుపేదల పాలిటవరం. ఎందుకంటే రాజ్యగంలో ప్రస్తావించిన అధికరణ 41 ద్వారా పౌరుల పనికి హక్కును కల్పిస్తూ మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టంద్వారా పౌరులను కనీస సమయం పనిలో కచ్చితంగా భాగాస్వాములను చేస్తూ మీవెంట మేమున్నాం అనే భరోసాను కల్పిస్తుంది. మరొకవైపు వడ్డీలేని రుణాలను మహిళలకు పెద్ద మొత్తంలో అందిస్తూ మహిళలలో నాయకత్వ బాధ్యతను సమిష్టి తనాన్ని పెంచుతూ మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగాస్వాములను చేస్తూ బ్యాంకులద్వారా రుణాలు ఇవ్వడం ద్వారా గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతమవుతుంది.

-భారత అవినాష్, జనగామ

## అభివృద్ధికి కృషి చేయాలి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూమిని యూనివర్సిటీకే అప్పగించాలని కోరుతూ విద్యావ్యవస్థ బలోపేతంలో భాగంగా యూనివర్సిటీ భూములు యూనివర్సిటీ అభివృద్ధికే ఉపయోగించాలని తెలుపుతూభవిష్యత్తు తరాలకు సంపూర్ణ విద్యను అందించాలి అంటే యూనివర్సిటీలలోఉన్న భూములను క్రీడా మైదానాలకు ల్యాబ్‌లకు, నూతనకోర్సులు ప్రవేశపెట్టి భవన నిర్మాణాలు చేపట్టాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## 16వ వసంతంలోకి విద్యహక్కు చట్టం

ఆరు నుండి పధ్నాలుగు సంవత్సరాలు గల పిల్లలకు ఉచిత నిర్భంద విద్యను అందించడం కోసం భారత పార్లమెంటులో 2009 ఆగస్ట్ 4న ఆమోదం పొందిఆగస్టు 26నాడు రాష్ట్రపతి ఆమోదం పొందింది. 2010 ఏప్రిల్ 1నుండి విద్యహక్కు చట్టం అమలులోకి వచ్చింది. ఆర్టికల్ 21లో ఇది పొందుపర్చారు. విద్యను ప్రాథమిక హక్కుగా అందించే 135 దేశాల సరసన మనదేశం చేరింది. 7 అధ్యాయాలు, 38సెక్షన్లు, ఒక అనుబంధ సెక్షన్ పొందుపరిచారు. బడుల మంజూరు, విద్య పని దినాలు, ఉపాధ్యాయ విధులు, ప్రైవేట్ పాఠాశాలల్లో పేద విద్యార్థులకి సీట్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. చట్టం అమలులోకి వచ్చి 16 సంవత్సరాలు అవుతున్నా నేటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. బడులను మంజూరు చేయాలని చట్టంలో ఉంటే దేశ వ్యాప్తంగా హేతుబద్ధీకరణ పేరుతో బడులు మూసివేయడం చెస్తున్నారు. ఇప్పటికైన విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు చేయాలి. టీచర్లను బడుల్లో బోధనకు మాత్రమే వినియోగించుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా అందరూ కలిసి కృషి చేయాలి.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## తల్లిదండ్రులను గౌరవించండి

తమ జీవితాంతం పిల్లల కోసం బతికిన తల్లిదండ్రులనుచివరకు వృద్ధాశ్రమంలో, రోడ్లపైనా వదిలేస్తున్నారు కొందరు. తల్లిగా ప్రేమను పంచిన అమ్మ, కష్టపడి సంపాదించి చదువు చెప్పించి బిడ్డల ఉన్నతికి కారణమైన తండ్రి, రోడ్డుపై , వృద్ధాశ్రమంలో జీవిత చరమాంకంలో ఒంటరిగా, అనాథలా కాలం గడపాల్సి వస్తుంది. అదెంత బాధాకరం అనే విషయాన్ని పిల్లలు తెలుసుకోవాలి. రేపు తమ బిడ్డలు కూడా అలాగే చేస్తే అని ఒక్కసారి ఊహించుకుంటే ఇంకెప్పుడు అలాంటి తప్పు చెయ్యరు. పిల్లలు వృద్ధ తల్లిదండ్రులకు అండగా ఉంటే, సమాజం మరింత సంతోషకరంగా మారుతుంది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## తెలుగు భాషపై కమిటీ వేయాలి

సుమేరియన్లు తెలంగాణ ప్రాంతం నుండి వలస వెళ్ళారని ప్రొ. జేమ్స్ ఎడ్గర్ స్పైన్ పేర్కొన్నారు. తెలుగు భాష నుండే సుమేరియన్ భాష ఆవిర్భవించింది. తెలుగు ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన భాష. తెలుగు భాష ప్రాచీనత గురించి అధ్యయనం చేయడానికి రాష్ట్రప్రభుత్వం కమిటీనిఏర్పాటు చేయాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మన విఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నెలాఖరుకల్లా బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నిక!

## పది నెలలుగా పెండింగ్‌లోనే..



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** భారతీయ జనతాపార్టీకి సుదీర్ఘకాలంగాపెండింగ్‌లో ఉన్న జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ఈ నెలాఖరుకు పూర్తి అవుతుందని అంచనా. గడచిన పదినెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈ బిజెపిదేశాధ్యక్షుడి ఎన్నికకు కసరత్తులు ముమ్మరంచేస్తున్నారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన వెంటనే బిజెపి ఇక సంస్థాగత కార్యక్రమాలపై ఫోకస్ పెంచుతోంది. ఎన్నికలు ఇప్పటికే ట్రాక్‌లోకి వచ్చాయి. గత నెల 15వ తేదీనాటికే జరగాల్సి ఉన్నప్పటికీ పార్లమెంటు సమావేశాలకారణంగా వాయిదాపడింది. మొత్తం 13 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించారు. మిగిలిన 13 రాష్ట్రాల సంస్థాగత అధ్యక్షుల ఎన్నిక పూర్తి అయిన వెంటనే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక మొదలవుతుంది. వచ్చే వారంరోజుల్లోనే మిగిలి ఉనన కీలక రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో రాష్ట్ర చీఫ్‌లను ప్రకటిస్తారు. మొత్తం 19 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించిన తర్వాత పార్టీపరంగా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ప్రారంభం అవుతుంది. బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు 50 శాతం రాష్ట్రాల సంస్థాగత ఎన్నికలు పూర్తి చేసుకుని రాష్ట్రాల చీఫ్‌లను ప్రకటించి ఉండాలి. అంతకుముందే బూత్, మండల్, జిల్లాస్థాయిలో ఎన్నికలు పూర్తి చేసి ఉండాలి. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డా బిజెపి జాతీయ అధ్యక్షుడుగా 2019లో బాధ్యతలు చేపట్టారు. 2020లో ఆయన బిజెపి జాతీయ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత హోంమంత్రి అమిత్‌షానుంచి ఆయన పాలనపగ్గాలుచేపట్టారు. ఆ తర్వాత ఆయన పదవీకాలం 2024 జూన్‌వరకూ పొడిగించారు. ఆకాలంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున సంస్థాగత ప్రక్రియను వాయిదావేసారు. ఇక కేంద్రకేబినెట్‌లోకి ఆయన్ను చేర్చుకోవడంతో ఇపుడు జోడుపదవులకు బ్రేక్‌చెపుతూ అర్హుడైన జాతీయ నాయకుడికోసం అన్వేషణ సాగుతోంది. ఈప్రక్రియలో బిజెపి కులాల సమీకరణ చూడాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇటీవలి కాలంలో పెరిగిపోయిన ఉత్తర దక్షిణ వివాదాలను కూడా సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలి. అలాగే పునర్విభజన, భాషా వివాదాలను కూడా పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. ఉత్తరప్రదేశ్‌లో పార్టీబేస్‌ను మరింత శక్తివంతంచేసుకునేందుకు ఇప్పటికే బిజెపి ఒత్తిడి ఎదుర్కొంటున్నది. లోక్‌సభ ఎన్నికల్లో కొంతమేర పార్టీకి విఘాతం కలిగిన సంగతి తెలిసిందే. యుపిలో సీట్లు మెజార్టీ సాధిస్తే లోక్‌సభలో సింగిల్ హ్యాండెడ్‌గా నడుస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు. అన్నివర్గాలకు ఆమోదయోగ్యుడయిన వ్యక్తి పార్టీ అధ్యక్షుడిగా రావాలి. బిజెపి సైద్ధాంతిక గురువు రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ ప్రభావంతోపాటు సంస్థాగత విలువలను పరిరక్షించుకుంటూ ముందుకుపోయే నాయకుడి అన్వేషణకు బిజెపి ఇప్పటినుంచే మొదలు పెట్టింది.

# ఒకరి అరెస్టు తప్పదు

**ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు**




**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డిఒజిఇ) శాఖ సారథిగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోషల్ సెక్యూరిటీ నిధుల దుర్వినియోగంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ సెక్యూరిటీ డేటాబేస్ నుంచి 4 లక్షల నంబర్లు దొంగలించిన వ్యక్తి రేపు అరెస్టు అవుతారని పేర్కొన్నారు. మస్క్ మాట్లాడిన ఒక వాయిస్ నోట్‌ను డోజ్ డిజైనర్స్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఆడియో ప్రకారం 'రేపు ఒకరిని అరెస్టు చేయ బోతున్నారు. అతడు సోషల్ సెక్యూరిటీ డేటా బేస్ నుంచి 4 లక్షల సోషల్ సెక్యూరిటీ నం బర్లను, వ్యక్తగత సమాచారాన్ని దొంగలించి, విక్ర యించాడు. ఇది వలసదారులను అక్రమ ఓటర్లుగా మార్చే వేదికగా మారింది' అని మస్క్ పేర్కొన్నారు. అమెరికా పౌరులు ఆని ప్రజలకు వీటిని అందించి తమకు ఇష్టమైన వ్యక్తులకు ఓటు వేసేలా ప్రేరేపిస్తున్నారని మస్క్ ఆరోపించారు. ఈ సందర్భంగా మస్క్ డెమోక్రాట్లపైనా పలు విమర్శలు చేశారు. అక్రమ వలసదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేందుకు డెమోక్రాట్లు ప్రభుత్వంలోని ప్రతిదాన్ని వినియోగించార న్నారు. జాతీయ విపత్తులు నుంచి దేశంలోని పౌరులను రక్షించేందుకు ఫెమాకు అందించే నిధులను సైతం దారి మళ్లించారని ఆరోపించారు. వాటిని న్యూయార్క్‌లోని లగ్జరీ హోటల్స్‌లో అక్రమ వలసదారులను ఉంచేందుకు వినియోగించారన్నారు. గతంలోనూ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ మస్క్ ఇదే వ్యాఖ్యలు చేశారు. ఇక ఈ అంశంపై దర్యాప్తు సంస్థలు ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఇటీవల కాంగ్రెస్‌లో ప్రసంగించే సమయంలో సోషల్ సెక్యూరిటీ నిధుల దుర్వినియోగంపై ట్రంప్ పలు వ్యాఖ్యలు చేశారు. భారీ స్థాయిలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలిందన్నారు. సోషల్ సెక్యూరిటీ మాజీ కమిషనర్ ఆస్ట్రూ దీనిపై స్పందించారు. ట్రంప్ యంత్రాంగానికి సోషల్ సెక్యూరిటీపై సరైన అవగాహన లేదని విమర్శించారు. దీనికి ఉపయోగించే పాత, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై డోజ్ బృందానికి నైపుణ్యం లేదన్నారు.

# భూకంప మృతులు 2719 పైనే..!

### మరో 441 మంది ఆచూకీ గల్లంతు

### తీవ్రగాయాలతో చికిత్సపొందుతున్న 4521 మంది క్షతగాత్రులు




**నాయ్‌పైథా(మైన్మార్), ఏప్రిల్ 1:** మైన్మార్‌లో సంభవించినభూకంపాలలో మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతవారంలో వచ్చిన ఈ భూకంప ధాటికి 2719 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సూనిక ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో ఐదేళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారని తెలిపాయి. 4521 మంది గాయపడగా 441 మంది ఆచూకీ ఇప్పటికీ లభించాల్సి ఉంది. సైనికపాలన అంతర్యుద్ధాలతో మగ్గిపోతున్న మైన్మార్‌ప్రజలపై గత వారం సంభవించిన భూకంపం తీవ్రప్రభావమే చూపించింది. ప్రాణ, ఆస్థినష్టం భారీస్థాయిలో ఉంది. సహాయక బృందాలు చేరుకోలేని ప్రాంతాలు ఇప్పటికీ అనేకం ఉన్నాయి. మాండలే వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం వెలువడుతోంది. మండుటెండలో ఉత్త చేతులతో చిన్నచిన్న పారలతో శిథిలాలను తొలగిస్తూ ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమో తెలుసుకునేందుకు వారి కుటుంబీకులు యత్నిస్తున్నారు. ప్రీస్కూలు కూలిపోవడంతో 50 మందిచిన్నారులు, ఇద్దరు టీచర్లు చనిపోయినట్లు ఐక్యరాజ్యసమితి సిబ్బంది వెల్లడించారు. కొన్ని భూకంప తాకిడిప్రాంతాలకు తరలివెళ్లేందుకు ఆయా చోట్లప్రభుత్వ తిరుగు బాటు దళాలమధ్య జరుగుతున్న ఘర్షణలు అవరోధంగా మారాయి. ఈ పరిణామాలమధ్య మృతులసంఖ్య ఎంతకు చేరుతుందోనన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం నీరు, షెల్టర్ తక్షణమే అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇదిలా ఉంటే బ్యాంకాక్‌లో కూలిన భారీ భవనం శిథిలాల్లో అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. బ్యాంకాక్‌నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవంతి పేకమేడలా కూలిపోయింది. మొత్తం 74 మంది శిథిలాలకింద ఉన్నారని చెపుతున్నా ఆ శిథిలాలకింద 300నుంచి 400కు పైగా ఉంటుందని అధికారులే అంచనాలు వేస్తున్నారు. శిథిలాలకింద చిక్కుకున్నవారిలో 60 మంది మైన్మార్ వాసులున్నారు. మిగిలిన వారంతా కూలిపనులకోసం విదేశాలనుంచి తీసు కువచ్చిన కార్మికులేనని చెపుతున్నారు. 2020లో ఈభవన నిర్మాణంప్రారంభించారు. చైనాకు చెందిన ఒకసంస్థకు భాగస్వామ్యం ఉంది. ఈ భవంతి కూలినతర్వాత నలరగురు చైనీయులు శిథిలాలు ఉన్న ప్రాంతం వద్దకు అక్రమంగా వెళ్లి కొన్ని పత్రాలు తీసుకునేందుకు యత్నించారని తేలింది. ఇతర భవనాలు సురక్షితంగానే ఉన్నా ఈ భవనం కూలిపోవడం అనుమానాలకు తావిస్తోంది నాసిరకం ఉక్కు, ఇతర నిర్మాణ సామగ్రి వాడినట్లు గుర్తిం చామన్నారు.

# నేను ఒక యోగిని.. పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ జాబ్‌కాదు

**యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్**



**లక్నో, ఏప్రిల్ 1:** ప్రధాని నరేంద్ర మోడీ వారసత్వం గురించి మహారాష్ట్ర అధికారి, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన రాజకీయ జీవితంపై యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని . పార్టీ నన్ను యుపి ప్రజల కోసం నియమించింది. అందుకే రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తున్నారు. ఇక పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు. వాస్తవానికి 'నేను ఒక యోగిని' అని ఆయన పేర్కొన్నారు. ప్రతి పనికి ఒక కాలపరిమితి ఉంటుందని అదేవిధంగా తన రాజకీయ జీవితానికి కూడా పరిమితి ఉంటుందని అన్నారు. జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బిజెపి హైకమాండ్‌తో తనకు విభేదాలు ఉన్నాయని వస్తున్న వార్తలను యోగి ఖండించారు. తనకు పార్టీ ఇచ్చిన అవకాశం వల్లే ఇక్కడ కూర్చున్నానని, పార్టీ పెద్దలతో విభేదాలు ఉంటే ముఖ్యమంత్రి స్థానంలో కొనసాగేవాడిని కాదని అన్నారు. ఎవరో ఒకరు తప్పుడు ప్రచారాలు చేస్తూనే ఉంటారని వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. నాగ్‌పుర్‌లోని సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని ప్రధాని నరేంద్రమోడీ సందర్శించడంపై శివసేన నేత సంజయ్‌రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

గత పదేళ్లలో ఎన్నడూ ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లని ప్రధాని ఇప్పుడు వెళ్లడం వెనుక ముఖ్యమైన కారణం ఉండవచ్చని అన్నారు. ఆయన పదవీవిరమణ చేయాలని యోచిస్తున్నారని తన రిటైర్మెంట్ ప్రణాళికల గురించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో చర్చలు జరపడానికే అక్కడికి వెళ్లి ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ రాజకీయ నాయకత్వంలో ఆరెస్సెస్ మార్పు కోరుకుంటోందని, మోడీ వారసుడు మహారాష్ట్ర నుంచే వస్తాడని అన్నారు. ఆయన వ్యాఖ్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కొట్టిపడేశారు. ఈ నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### పార్కు చేసిన ట్యాంకర్ నుంచి విషవాయువు లీక్

# ముగ్గురు మృతి, 50 మందికి తీవ్ర అస్వస్థత



**జైపూర్,ఏప్రిల్ 1:** రాష్ట్రంలోని బేవార్‌జిల్లాలో ఉన్న రసాయన కర్మాగారంలో పార్కుచేసిన ట్యాంకర్‌నుంచి ప్రమాదకర విషవాయువు విడుదల కావడంతో ముగ్గురు చనిపోయారు. 50 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఫ్యాక్టరీ యజమానితోపాటు మరో ఇద్దరు కూడా చనిపోయినట్లు తేలింది. జిల్లాకలెక్టర్ మహేంద్ర ఖడ్‌గావత్ మాట్లాడుతూ నైట్రిక్‌యాసిడ్ లీకు వల్ల ఈప్రమాదం జరిగిందని, నివాసిత ప్రాంతం అయిన బైద్య ప్రాంతంలో అక్రమంగా నిల్వచేసి ఉంచారని, ఈప్రమాదంలో 53 మందికిపైగా గాయపడినట్లు గుర్తించామని చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని ఎస్పీ శ్యాంసింగ్ చెప్పారు. అనేకమంది ఈప్రాంతం పరిసరాల్లో ఉన్నవారు కూడా అస్వస్థతకు లోను కాగా వారందరినీ వివిధ ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఫ్యాక్టరీ యజమాని సునీల్ సింఘాల్(47) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. స్థానికులు దయారామ్, నరేంద్ర సోలంకి అనే ఇద్దరు మంగళవారం చనిపోయారు. ఈప్రాంతంలో అనేకమందికి ఈ విషవాయుప్రభావం సోకడంతో వారిని కూడా ఆసుపత్రులకు తరలించారు. అందరికీ శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు, వాంతులు రావడంతో అందరినీ ఆసుపత్రులకు తరలించామన్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో వీరిని అజ్మేర్‌లోని జెఎల్ఎన్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఫ్యాక్టరీ పరిసరప్రాంతాలుమొత్తం ఖాళీ చేయించినట్లు కలెక్టర్ చెప్పారు. అంతేకాకుండా నగరపరిషత్, రెవెన్యూ,పోలీస్‌శాఖలతో కమిటీలుఏర్పాటుచేసి అనుమతుల్లేకుండా కొనసాగిస్తున్న ఫ్యాక్టరీలను సర్వే చేయాలని ఆదేశించారు.

# సౌదీకి ట్రంప్ తొలి విదేశ పర్యటన..

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా పాలనపగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ తొలి విదేశీపర్యటనకు రెడీ అవుతున్నారు. వచ్చే నెలలో అరబ్‌దేశాల్లో పర్యటించనున్నట్లు ఆయన స్వయంగా ప్రకటించారు. వైట్‌హౌస్ మీడియా మీట్‌లో ఆయనే ఈ సమాచారం తెలిపారు. తాను ఖతార్, యుఎఇ, సౌదీ అరేబియా దేశాల్లో పర్యటిస్తానని ట్రంప్ తెలిపారు. అయితే పర్యటన పూర్తి షెడ్యూల్, అజెండా వంటి వివరాలపై అధ్యక్షుడు స్పష్టత నివ్వలేదు. అమెరికా కంపెనీల్లో సౌదీ ఒక ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్న అంశాన్ని ట్రంప్ గుర్తుచేసారు. ఆ కంపెనీలు సౌదీతోపాటు మధ్యప్రాచ్యంలోని ఇతర దేశాలకు కావాల్సిన పరికరాలు తయారు చేస్తాయన్నారు. మధ్య ప్రాచ్యదేశాలతో కూడా తనకు మంచి సంబంధాలున్నాయన్నారు. 2017లో ట్రంప్ అధ్యక్ష హోదాలో తొలిసారి సౌదీలో పర్యటించారు. ఆ సమయంలో రియాద్‌తో ఆయన సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నారు. అవి కొనసాగించాలనే లక్ష్యంతోనే తొలిపర్యటనకు అక్కడికే వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఇజ్రాయెల్ దాడులతో ధ్వంసమైన గాజాను స్వాధీనంచేసుకుని అమెరికా పునర్నిర్మిస్తుందని ట్రంప్ ప్రకటించారు. అంతకంటే ముందు గాజాలో యుద్ధం కారణంగా నిరాశ్రయులైన పాలస్తీనీలకు అరబ్‌దేశాలు ఆశ్రయం కల్పించాలని ప్రతిపాదిస్తే ఆదేశాలు ఖండించాయి. తమ ప్రతిపాదనలు నిరాకరిస్తే అమెరికా నుంచి అందే సాయం నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఈజిప్టు రూపొందించిన గాజా అభివృద్ధిప్రణాళికవైపు గల్ఫ్ దేశాలు మొగ్గుచూపాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ అరబ్‌దేశాల పర్యటనకు వెళతానని ప్రకటించడం గమనార్హం.

# గడువుకు ముందే.. భారత్ వేసే సుంకాలు తగ్గొచ్చు

**యుఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ స్పందన**



**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** భారత్ సహా కీలక భాగ స్వామ్యదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలపై రేపు (బుధవారం) తుది నిర్ణయం వెలువడనుంది. ఈ తరుణంలో మన దేశాన్ని ఉద్దేశించి ట్రంప్ స్పందించారు. లిబరేషన్ డే డెడ్‌లైన్‌కు ముందే భారత్ నుంచి భారీగా టారిఫ్ కోతలు ఉంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. అమెరికా ఉత్పత్తులపై సుంకాలను గణనీయంగా తగ్గించాలని నిర్ణయానికి వచ్చిందని పేర్కొన్నారు. 'అమెరికాతో అన్యాయంగా ప్రవర్తించిన చాలా దేశాలు తమ సుంకాలను తగ్గించుకుంటాయి.ఇయు ఇప్పటికే 2.5 శాతం మేర తగ్గించుకుంది. భారత్ కూడా గణనీయంగా సుంకాలను తగ్గించుకుంటుందని ఇటీవల విన్నాను' అని అధ్యక్షుడు తాజాగా మాట్లాడారు. పరస్పర సుంకాల తగ్గింపు అమలులోకి తీసుకురావాలనుకుంటున్న రోజునే ఆయన లిబరేషన్ డేగా అభివర్ణిస్తున్నారు. ఈనెల 3నుంచి వాహ నాలు, వాటి విడిభాగాలపై 25శాతం సుంకాలు అమలు కానున్నాయి. ఇంతకుముందు ఇదే అంశంపై వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ మాట్లాడారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ 100శాతం సుంకాలు వసూలు చేస్తోం దని అన్నారు. ఇతర దేశాలు విధించే అధిక సుంకాల వల్ల అమెరికా ఉత్పత్తులను ఎగుమతి చేయడం అసాధ్యంగా మారుతోందని అన్నారు. అందుకే వాటిపై ప్రతీకార సుంకాలకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం భారత్‌కు అమెరికా చేసే ఎగుమతులకు సగటున 7.7 శాతం టారిఫ్ ఉండగా అమెరికాకు భారత ఎగుమతులపై కేవలం 2.8శాతమే ఉంది. అంటే వ్యత్యాసం 4.9శాతం. ఒకవేళ భారత్ నుంచి ఎగుమతయ్యే అన్నిఉత్పత్తులపై ఏకరీతిలో అమెరికా టారిఫ్‌లు విధిస్తే అదనంగా ఈ 4.9 శాతం మేర పెరగొచ్చు. ఒకవేళ వ్యవసాయ, పారిశ్రామికరంగాల ఉత్పత్తులకు వేరుగా టారిఫ్‌లు విధించాలని నిర్ణయిస్తే భారత్ నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులకు 32.4శాతం, పారిశ్రామిక ఉత్పత్తులకు 3.3శాతం మేర టారిఫ్‌లు పెరిగే అవకాశం ఉంటుంది.

# ధోలాఘాట్‌లో సిలిండర్ పేలి ఏడుగురు మృతి



**కోల్‌కతా, ఏప్రిల్ 1:** రాష్ట్రంలోని దక్షిణ 24 పరగణాల జిల్లాలోని పథర్‌ప్రతిమా ప్రాంతంలో ఒక ఇంట్లో గ్యాస్ సిలిండర్‌ఫేలి ఏడుగురు మరణించారు. వీరిలో నలుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. పథర్‌ప్రతిమ బ్లాక్‌లోని ధోలాఘాట్‌గ్రామంలో రాత్రి తొమ్మిది గంటలప్రాంతంలో ఈసంఘటన జరిగిందని సుందర్బన్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు తెలిపారు. మృతదేహాలన్నింటినీ స్వాధీనంచేసుకుని పోస్టుమార్టంకు పంపించారని, తీవ్రంగా గాయపడిన ఒక మహిళను మాత్రం ఆసుపత్రిలో చేర్పించామని అన్నారు. ఇంట్లో రెండు గ్యాస్‌సిలిండర్లు ఉన్నాయని, ఇదే ఇంట్లో బాణాసంచాను కూడా దాచిపెట్టడంతో ఈ మంటలు మరింత వ్యాపించాయని రావ్ వెల్లడించారు. ముందు బాణాసంచా పేలి ప్రమాదం జరిగిందని భావించారు. కానీ గ్యాస్ సిలిండర్ అని తర్వాత నిర్ధారణ అయింది. ఇదే మరో సంఘటనలో వారణాసి కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ సమీపంలో ఒకసిలిండర్ పేలి అనేక షాపులు ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు. సిగ్రా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఒ సంజయ్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ రైల్వేష్టేషన్ 59వ పిల్లర్ వద్ద ఈ పేలుడు సంభవించిందని సమాచారం తెలిసిన వెంటనేఫైర్‌మెన్, పోలీసులు స్పాట్‌కు చేరుకుని మంటలను అదుపుచేసారని అన్నారు. కొన్ని షాపులు దెబ్బతిన్నాయని అయితే ఎలాంటి మరణాలు సంభవించలేదని పోలీసులు తెలిపారు.

# లైంగిక హింసకేసులో వివాదాస్పద పాస్టర్‌కు జీవితఖైదు

**అమృత్‌సర్, ఏప్రిల్ 1:** అత్యాచారం కేసులో సెల్ఫ్ స్టైల్డ్ క్రిస్టియన్ పాస్టర్ బాజిందర్ సింగ్‌కు పంజాబ్‌కోర్టు శిక్ష ఖరారుచేసింది. ఆయనకు జీవితఖైదు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పింది. యేసు యేసు ప్రొఫెట్‌గా సింగ్ పాపులార్ అయ్యారు. బాజిందర్‌సింగ్ తనపై అత్యాచారానికి పాల్పడినట్లు 2018లో పంజాబ్‌లోని జిరాక్‌పూర్‌కు చెందిన ఒక మహిళ ఆరోపించింది. విదేశాలకు తీసుకెళతానని మాయ మాటలు చెప్పి బాజిందర్ తనను శారీరకంగా వాడుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు ఆయనపై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటు మొత్తం ఏడుగురిపై ఈ కేసులో అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసు విచారణ జరిపిన ట్రయల్ కోర్టు బాజిందర్‌సింగ్‌ను నాలుగు రోజుల క్రితమే దోషిగా తేల్చింది. కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మిగిలిన ఆరుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈక్రమంలో ఈరోజు ఆతడికి శిక్షఖరారుచేసింది. బాజిందర్‌సింగ్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. అయితే బాజిందర్‌సింగ్ తరచూ వివాదాల్లో ముందుంటాడు. ఆయన తన కార్యాలయంలో ఒక మహిళపైనా మరో వ్యక్తిపైనా దాడికి పాల్పడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వారిని చెంపలపై కొట్టడం, చేతికి ఏది దొరికితే అది విసరడం వంటి దృశ్యాలు విడియోలో ఉన్నాయి. 2022లో ఓ మహిళ తనను లైంగికంగా వేధించాడని సింగ్‌పై ఆరోపణలుచేసింది. అలాగే అనారోగ్యంతో ఉన్న ఒక మహిళను బాగుచేస్తానని చెప్పి ఆమె కుంటుం బనుంచి భారీగా డబ్బులు వసూలు చేసాడు. అయితే ఆమె మరణించింది.



# 13యేళ్ల తర్వాత బంగ్లాకు పాక్ విదేశాంగమంత్రి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పాకిస్థాన్‌ప్రధానమంత్రి షెహబాజ్‌షరీఫ్ బంగ్లాదేశ్ కేర్‌టేకర్ చీఫ్ మహ్మద్‌యూనస్‌తో ఫోన్‌లోసంభాషించిన తర్వాత ఆదేశ విదేశాంగమంత్రి ఇషాక్‌దర్ సుమారు 13 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్ పర్యటనకు వస్తున్నట్లు ఖరారుచేసారు. ఇరువురు అగ్రనేతలు ఈద్ ఉల్‌ఫితర్ శుభాకాంక్షలు చెప్పుకున్న తర్వాత రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక బంధం మరింతశక్తివంతం కావాలని ఆకాక్షించారు. పాకిస్థాన్‌కు రావాలని షరీఫ్ యూనస్‌ను ఆహ్వానించారు. అంతేకాకుండా బంగ్లాదేశీ సాంస్కృతిక బృందాన్ని కూడా ఆహ్వానించారు. ప్రముఖ గాయని రూనా లైలా కచేరి పాకిస్థాన్‌లో ఏర్పాటుచేయాలని ఆయన కోరారు. ఇక డిప్యూటిప్రధానమంత్రి విదేశాంగమంత్రి అయిన ఇషాక్‌ధర్ కూడా బంగ్లాదేశ్ పర్యటనకు వస్తున్నారు. ఈనెల 22 నుంచి 24తేదీల్లో ఆయన పర్యటిస్తారు. యూనస్‌తోభేటీ అయి వివిధ అంశాలపై చర్చలు జరుపుతారు. బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు తౌహిద్ హొస్సేన్ ఇతర కేబినెట్ సభ్యులతో చర్చలు జరుపుతారు. కొన్ని ఎంఒయులు కూడా చేసుకుంటారని అంచనా. వాణిజ్యం, ఇతర ఒప్పందాలు, ప్రజలమధ్య నేరుగా సంబంధాలు వంటి వాటిపై ఒప్పందాలు జరుగుతాయని అంచనా. పాక్‌కుచ ఎందిన విదేశాంగమంత్రి హినా రబ్బాని ఖర్ ఒక్కరే బంగ్లాదేశ్‌ను చివరిసారిగా పర్యటించిన పాక్ విదేశాంగ మంత్రిగా నిలిచారు. అమె 2012లో బంగ్లాలో పర్యటించారు. సముద్రమార్గంలో నేరుగా కెనెక్టివిటీ పెంచుకన్న తర్వాత మొదటి కార్గోనౌక బంగ్లా సముద్రజలాల్లోకి వచ్చిన తర్వాతనుంచి పాక్ బంగ్లాదేశ్ రెండూ కూడా వాణిజ్యబంధం పెంచుకోవాలని భావిస్తున్నాయి. బంగ్లాలో రెండో అత్యున్నత ఆర్మీ అధికారి ప్రిన్సిపల్ స్టాఫ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్ఎం కమరుల్ హస్సన్ కూడా ఇటీవలే పాకిస్థాన్‌లో పలుసార్లు పర్యటించారు.



### మాకు వేరే అవకాశం లేదు..

# అణ్వాయుధాల వైపే: ఇరాన్



**టెహరాన్, ఏప్రిల్ 1:** అణ్వాయుధాల ఒప్పందం విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అగ్రరాజ్యం తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయుత్లా అలీ ఖమేనీ హెచ్చరించిన విషయం విదితమే. తాజాగా ఈ విషయమై ఖమేనీ సలహాదారుడు అలీ లారిజానీ కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే తాము అణ్వాయుధాల వైపు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. 'మేం అణ్వాయుధాల వైపు వెళ్లాలనుకోవడం లేదు. మీరు ఇరాన్ విషయంలో ఏదైనా తప్పు చేస్తే దేశాన్ని రక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితుల్లో వాటిని వినియోగించడంపై దృష్టి పెట్టాల్సి వస్తుంది' అని ఆయన హెచ్చరించారు. ఇంతకుమించి తమకు వేరు అవకాశం లేదన్నారు.

ఇరాన్ చుట్టూ ఉన్న ప్రాంతంలో అమెరికన్లకు కనీసం 10 స్థావరాలు 50,000 మంది సైనికులు ఉన్నారని ఇరాన్ ఇస్లామికన రివల్యూషనరీ గార్డ్ సీనియర్ కమాండర్ జనరల్ అమిరాలి హాజీజాదే పేర్కొన్నారు. అద్దాలమేడలో కూర్చున్న అధికారులు తమపై రాళ్లు విసిరితే అవి తిరిగి మేడలనే కూల్చేసే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి తమపై విమర్శలు చేసే ముందు అగ్రరాజ్యం మరోసారి ఆలోచించుకోవాలని హితవు పలికారు.

ఇరాన్-అమెరికా మధ్య గత కొన్ని రోజులుగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. హూతీ తిరుగుబాటుదారులకు అండగా నిలుస్తున్న టెహ్రాన్‌కు అగ్రరాజ్యం గట్టిగానే హెచ్చరికలు చేసింది.

దీనికి ఇరాన్ స్పందిస్తూ తన కొత్త భూగర్భ క్షిపణి నగరానికి సంబంధించిన విడియోను విడుదల చేసింది. ఇందులో ఖైబర్ షెకాన్స్, ఘద్రహాస్, సెజ్జిల్స్, హాజ్ ఖాసీమ్స్, పవేహ్ ల్యాండ్ అటాక్ క్షిపణులు ఉన్నాయి. మరోవైపు, ఈ ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసేలా అణుఒప్పందం విషయంలో అగ్రరాజ్యం ప్రత్యక్ష చర్చల ఆహ్వానాన్ని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తిరస్కరించారు. పరోక్ష చర్చలకు మాత్రం దారులు తెరిచే ఉన్నాయని అన్నారు. ఈ పరిణామాలతో అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్వరాన్ని పెంచారు.

ఒప్పందాన్ని కుదుర్చుకోని పక్షంలో ఇరాన్‌పై బాంబు దాడులకూ వెనకా డబోమని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ అగ్రరాజ్యం దాడులకు తెగబడితే ఎదురుదాడులు తప్పవని బెదరింపులకు పాల్పడ్డారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త



# కాలుష్య కోరల్లో పెద్ద కాలువ

## - నిడదవోలు మొగల్తూరు పెద్ద కాలువ... పెంట కుప్పల నిలయం
## - తాగునీటి కాలువ... కల్మషాల కుప్ప



**మొగల్తూరు..... (ప్రభాతవార్త) :**
గోదావరి నదిపై ఆనుకుని ఎంతో గొప్ప ఘన చరిత్ర కలిగిన ధవలేశ్వరం కాటన్ బ్యారేజీ మరియు విజ్జేశ్వరం నుండి పశ్చిమగోదావరి జిల్లా లోనికి ఈ గోదావరి నది నీరు పెద్ద కాలువ ద్వారా ప్రవహిస్తుంది. విజ్జేశ్వరం నుంచి ప్రారంభమై పెనుగొండ మార్టేరు పాలకొల్లు నర్సాపురం మీదుగా మొగల్తూరు లాకు వద్దకు వచ్చి ఈ గోదావరి నది నీరు ఆగుతుంది. ఈ మంచినీటి కాలువపై ఆధారపడి పశ్చిమగోదావరి జిల్లాలో లక్షలాదిమంది రైతులు మరియు ప్రజలు తాగునీటి కొరకు ఈ కాలువపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఈ కాలువ నేడు కాలుష్య కోరల్లో కుట్టుమిట్టు లాడుతుంది. కొందరు ప్రజలు అవగాహన రాహిత్యం వలన వారి స్వార్థం నిర్లక్ష్యం తో మంచినీటి కాలువలో చెత్త ప్లాస్టిక్ వస్తువులు జంతు కళేబరాలు డ్రైనేజీ నీరు ఈ మంచినీటి కాలువలోకి వదలడం అధికమైంది. ఈ కాలువ కుండా వచ్చే గోదావరి నది నుంచి వచ్చే ఈకలుషితమైన మంచినీరును మున్సిపాలిటీ పంచాయతీ పరిధిలో ఈ యొక్క కలుషితమైన గోదావరి నీరు ప్యూరిఫికేషన్ చేసి ప్రజలకు మంచినీరు సరఫరా చేస్తున్నారు 1847 నుండి 18 52వ సంవత్సరం అప్పటి బ్రిటిష్ పాలకులు ప్రజల కోరిక మేరకు ధవలేశ్వరం బ్యారేజీ నిర్మించారు ఈ బ్యారేజీ కు సుమారు 130 సంవత్సరాల ఘన చరిత్ర కలదు అంతటి గొప్ప చరిత్ర కలిగిన ధవలేశ్వరం బ్యారేజీ నుంచి విజ్జేశ్వరం కాలువకుండా పశ్చిమగోదావరి జిల్లాలోని ఈ మంచినీటి కాలువ ద్వారా గోదావరి నీరు ప్రవహిస్తుంది. ఈ ప్రధాన కాలువ పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు ప్రాణదాయగాను ప్రజల యొక్క అవసరాలను తీర్చే ఈ మంచినీటి కాలువ విద్యేశ్వరం పెనుగొండ మొదలుకొని నిడదవోలు మార్టేరు పాలకొల్లు నర్సాపురం మీదుగా మొగల్తూరు లాకు వద్దకు చేరుకుని అక్కడినుండి మొగల్తూరు లోని ఉన్న గొంతేరు డ్రైన్ చివరకు కొత్త కాయల తిప్ప కాలువ లోనికి కలుస్తుంది. ఈ కాలువ ప్రధానంగా ఎనిమిది సమస్యలు వల్ల కాలుష్యం కోరల్లో చిక్కుకున్నది. ఈ మంచినీటి కాలు వ నానుకుని ఇరువైపులా అక్రమమైన ఆక్రమమునలు ప్లాస్టిక్ వ్యర్థాలు మంచినీటి కాలువ ఇరువైపుల గట్లపై డంపింగ్ యార్డులు డ్రైనేజీ నీరు జంతు కళేబారాలు మరియు మానవ వ్యర్థాలు గుర్రపు డెక్క మరియు తూటు అధికమవడం ఏడు హోటల్ రెస్టారెంట్లు వాళ్ళ వినియోగించిన వ్యర్థాలు జంతువులను వదించిన వ్యర్థాలను మరియు రక్తమును ఈ యొక్క మంచినీటి కాలువలోనికి వదులుతున్నారు. పైనుంచి సేవలు కూడా వస్తూ ఉంటాయి. చాలా చోట్ల సెప్టిక్ ట్యాంక్ గొట్టాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో కాలువ పరిస్థితి మరీ దయనీయం దుస్తులు ఉతకడానికి ఇదే కేంద్రం. పవర్ ఫుల్ సోడాల్లో నాన్ పెట్టినటువంటి దుస్తులను ఈ కాలువలోనే ఉతికి గుంజుతారు. ఈ మంచినీటి కాలువ అప్పటి సర్దార్ కాటన్ పుణ్యమా అని మన పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు ఈ కాలువలో ఎనలేని అనుబంధం ఏర్పడింది. 5 లక్షలు ఎకరాలకు ఆరు మునిసిపాలిటీలకు 300 పైగా గ్రామాలకు నిడదవోలు మొగల్తూరు కాలువ గొప్ప ప్రాణదాయని గుక్కెడి నీళ్లు దొరక్క ఎన్నో ప్రాంతాల నుండి జనం వలస పోతున్నారు. అలాంటిది బోధన స్వర్గంగా పేరు పొందిన గోదావరి జిల్లాలో మీరంటే మరీ లోకువగా మారింది. మహనీయుల కష్టం ఆలోచన నేడు రిచ్ గుంట గా మార్చినటువంటి దౌర్భాగ్యులను సమాజమే ఎండగట్టాలి. సాగునీరు తాగునీరు కు ఊపిరిగా నిలిచిన కాలువను జనమే కాపాడుకోవాలి. జనం... జలం వేరు కాదు అని గుర్తించాలి. కాలువ రొచ్చుగుంటగా మారడానికి బాధ్యులు ఎవరు అందరికీ తెలుసు. ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి ప్రజల ఆరోగ్య పరంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పెద్ద కాలువ కష్టం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు తెలియనిది కాదు. ఆయనకు దీనిపై విశేషా అవగాహన ఉంది. ఆయన నడుంబిగిస్తే కాసారపు కాలువకు మోక్షం లభిస్తుంది.

## పరిశ్రమల స్థాపనకు ఒత్సాహికులు ముందుకు రావాలి
### ప్రత్యేక అధికారి సూర్యకుమారి



భీమవరం ఏప్రిల్ 1 ప్రభాతవార్త : జిల్లాలో సాంకేతిక ఆధారిత పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దృష్టి సారించాలని పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధి ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి తెలిపారు. మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖలు ప్రభుత్వ కార్యదర్శి పశ్చిమగోదావరి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులై తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన ఎ.సూర్యకుమారి కి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశంలో జిల్లా కలెక్టర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన పారిశ్రామిక వేత్తల నుండి జిల్లా ప్రత్యేక అధికారి వారు నిర్వహిస్తున్న ఉత్పత్తి యూనిట్లు, ముడి సరుకుల సేకరణ, మార్కెటింగ్, బాంకు రుణాలు మంజూరు, పరిశ్రమల నిర్వహణలో ఎదుర్కొంటున్న తదితర విషయాలను అడిగితెలుసుకున్నారు. పారిశ్రామికవేత్తలు ఎస్.దిలీప్ కుమార్( కోకోనట్ క్లస్టర్), వెంకటేశ్వరరావు (మష్రూమ్ పౌడర్ ),హరీష్ (చాక్లెట్ తయారీ), వంశి (సివిడ్), డాక్టర్ బాబు( ప్లాస్టిక్ చిప్స్), దుర్గారావు (ప్లాస్టిక్ వేస్ట్ నుండి పివిసి పైప్ తయారీ), చైతన్య (ఆమోన్స్ పికిల్స్), వాసు (ప్రింటింగ్ క్లస్టర్), పాంద (ఫర్నిచర్ క్లస్టర్) , నారాయణ రావు ప్రోగ్రెసివ్ ఫార్మర్ సమావేశంలో సంబంధిత తయారీ ఉత్పత్తుల గురించి గురించి జిల్లా ప్రత్యేక అధికారి వివరించారు. ప్రతినెల జిల్లా కలెక్టర్ తో కలిసి సమావేశ నిర్వహిస్తామన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులు తయారీలో పోటీ పడాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు యూనిట్ స్థాపనకు అనుమతులు, బ్యాంకు రుణాల మంజూరులో అధికారులు తమ వంతు సహకారం అందించాలన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర, పి 4 కార్యక్రమాల అమలుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రతి జిల్లాకు లక్ష్యాలునిర్దేశించారని, లక్ష్యసాధనకు అందరు సమిష్టిగా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వచ్ఛంద్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లాలను సమగ్ర అభివృద్ధి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిగా, మన జిల్లాకు మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖలు ప్రభుత్వ కార్యదర్శి ఎ.సూర్య కుమారుని నియమించడం జరిగిందన్నారు.

# గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

**కాళ్ళ ఏప్రిల్ 1(ప్రభాతవార్త):**
గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. కాళ్ళ మండలం సీసలి, బొండాడ, బొండాడపేట, పలుచోట్ల సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల రూ. 68.75 లక్షలతో ఇటీవల నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను



ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షుడు గుండా బత్తుల వెంకట నాగేశ్వరరావు, జడ్పిటిసి పి .సోమేశ్వరరావు, ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు, పలు గ్రామాల సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు, టిడిపి నాయకులు కట్రెడ్డి శ్రీనివాసరావు, మందపాటి కృష్ణమూర్తి, దొక్కు సోమేశ్వరరావు, తోట ఫణిబాబు, గొర్ల లక్ష్మణ్, గుడ్ల మధు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిపో నుండి రెండు కొత్త బస్సు లు





**ప్రభాతవార్త నరసాపురం :**
నరసాపురం డిపో నుండి విజయవాడ మరియు నరసాపురం డిపో నుండి ఉదయగిరి డిపోలకు 2 నూతన బస్సులను రాష్ట్ర ప్రభుత్వ విప్,నర్సాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ టిడిపి ఇన్చార్జ్ పోత్తూరి రామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్న రెడ్డి, కోటిపల్లి సురేష్ వలవల నాని ,బందెల రవీంద్ర, గంటా కృష్ణ , పోలిశెట్టి సాంబ,తో అరుణ, బొమ్మిడి కృష్ణకుమారి , కొప్పాడ కృష్ణవేణి,భారతి సురే వనమాల శ్రీనివాస్ ఆర్టీసీ సిబ్బంది మరియు నియోజకవర్గ జనసే టిడిపి బిజెపి నాయకులు కార్యకర్తలు జనసైనికులు వీర మహిళల తదితరులు పాల్గొన్నారు

# లోపాలకు తావు లేకుండా రీ సర్వే పూర్తి చేయాలి..

**ఏలూరు ప్రభాతవార్త :** మంగళవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న రీసర్వేను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే ఎంత మంది చేస్తున్నది, ఎన్ని ఎకరాలు చేస్తున్నారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీసర్వే చేసే భూముల్లో ముందుగా రైతులకు నోటీసులు ద్వారా తెలియజేస్తుంది లేనిది ఆరా తీశారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, చిన్న తప్పు కూడా ఆస్కారం లేకుండా రీసర్వే పూర్తి చేయాలన్నారు. మాదేపల్లి గ్రామాన్ని ప్రభుత్వం రీసర్వే ప్రాజెక్ట్ పైలేట్ గా ఎంపిక చేయడం జరిగింది. గ్రామంలో 1507 ఎకరాల 98 సెంట్లు భూమి ఉండగా దానిని రీ సర్వే 6 బ్లాక్స్ 250 ఎకరాలు వచ్చేటట్లుగా విభజించి రీ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలపై వచ్చిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, తహశీల్దారు శ్రీనివాస్, రీ సర్వే డిటి నాగమణి, పంచాయితీ సెక్రటరీ సుమతీ, గ్రామ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.



# పేదలందరికి ఎన్టీఆర్ భరోసా

**చాట్రాయి,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :**
ఎన్టీఆర్ భరోసా పేరుతో సామాజిక పింఛను పేద వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చర్మకారులకు, డప్పు కళాకారులకు,వికలాంగులకు కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న ధీమా అని ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు .మంగళ వారం చాట్రాయి మండలం, చనుబండ గ్రామంలో జనవరి నెల లో నాగుల శాంతమ్మ కు కొత్తగా మంజూరైన వితంతు పింఛను ను ఎన్నికల కోడ్ అమలు లో ఉన్నందున 3 నెలల పింఛను సొమ్ము రూ:12 వేలు, పింఛను మంజూరు పత్రాన్ని లబ్ది దారురాలు శాంతమ్మ కు అందచేశారు. ఈ కార్యక్రమంలో చీదిరాల మారేశ్వర రావు, నక్కా రాము, గుడిమళ్ళ బ్రహ్మయ్య, విస్సంపల్లి రాజా, కడగంచు మహేష్, నాగుల సురేష్, నాగుల అంజి, వెల్ఫేర్



అసిస్టెంట్ ఏకాంబరాచారీ , భారతి పాల్గొన్నారు.

# సహజ ప్రసవం తల్లి బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

**ప్రభాతవార్త నరసాపురం :**
నర్సాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో తల్లికి నార్మల్ డెలివరీ వలన తల్లికి బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ జరిపారు. ఆంధ్రప్రదేశ్ సెకండరీ డైరెక్టర్ ఏ సిరి మరియు పశ్చిమ గోదావరి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా పి.సూర్యనారాయణ సూచనల మేరకు నర్సాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో తల్లికి నార్మల్ డెలివరీ వలన తల్లికి బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ మంగళవారం ఉదయం 10: 30 నిమిషాలకు హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మరియు ప్రభుత్వ విప్ మరియు ఎంఎల్ఏ బొమ్మిడి నాయకర్ ర్యాలీ ప్రారంభించారు. గర్భము దాల్చక ముందే సాదరణ కాన్పు పై అవగాహన కొరకు దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో కౌన్సిలింగ్ తీసుకోవడం మంచిది ,తల్లికి క్షేమం బిడ్డకు రక్షణ తక్కువ ఖర్చు ఉంటుంది , తల్లి శిశువు మరణాల రేటు తగ్గుతుంది. తల్లి వెంటనే కొలుకుంటుంది, వెంటేనే బిడ్డకు ముర్రు పాలు ఇస్తుంది, తల్లి బిడ్డ మధ్య అనుబంధం ఏర్పడుతుంది. తల్లి మానసికంగా ఆత్మస్థైర్యం కలిగి పాలు సమృద్ధిగా ఉత్పత్తి అవ్వడం ముర్రు పాలు ఇవ్వడం వలన బిడ్డకు,రోగనిరోధక శక్తి పెరుగుతుంది ,ముర్రు పాలు ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. బిడ్డకు శ్వాసకోశ సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది, బిడ్డకు మంచి తెలివి తేటలు, మంచి ఆరోగ్యం ,తరువాతి గర్భం కూడా సాధారణ డెలివరీ అయ్యే అవకాశం తల్లికి రొమ్ము కాన్సర్ వచ్చే అవకాశం తక్కువ , అధిక బరువు పెరగదు తేదీలు,సమయాలు పాటించడం వలన బిడ్డ ఆరోగ్యం పై ప్రభావం చూపే అవకాశం ఉన్నది ,కావున ప్రతి ఒక్కరూ తల్లి బిడ్డల సంక్షేమం సాదరణ కాన్పుని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సూపరింటెండెంట్ డా రామ కృష్ణ , ఆర్ఎంఓ డా నళిని గారు, గైనెకాలజిస్ట్ డా లీటోర్న దేవి ,డా హరిసన్, డా సుహాస్ ,దిలీప్ కుమార్ శాస్త్రి డా గణేశ్ గారు, డా చందన ప్రియాంకా, డా.లక్ష్మి ప్రశాంతి, డా.విజయ శాంతి , డా. రాజేశ్, , డా.బి గరిమ ,డా.నవీన్ కుమార్, డా.లీలా మారుతి, డా. కాంతి ప్రియా, డా భారతి,హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మరియు ప్రభుత్వ విప్ మరియు ఎంఎల్ఏ బొమ్మిడి నాయకర్ అభివృద్ధి కమిటీ సభ్యులు సంకరపు వెంకటేశ్వర్లు , కాగిత



వెంకటేశ్వరరావు ,ఎనుముల సతీష్ కుమార్, పోలిశెట్టి పుష్పా, డా కోటేశ్వర రావు,ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ జ్యోతి,హెడ్ నర్స్ కృపవరం, హెడ్ నర్స్ రాజేశ్వరి, నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రి ఐసిటిసి కౌన్సిలర్ సైకాలజిస్ట్ జి జేసు ప్రసాద్ బాబు, ఎస్ఎస్కే మేనేజర్ అనంత లక్ష్మి, ఐసిటిసి ఎల్టి ఏసు పదం, స్టాఫ్ నర్సులు, కస్తూరిబాయి స్కూల్ నర్సింగ్ కర్స్పాండెంట్ ప్రసాద్ , మరియు కస్తూరిబాయి స్కూల్ నర్సింగ్ విద్యార్థులు , ఏఎన్ఎం లు , ఆషా వర్కర్లు మరియు ఆసుపత్రి సిబ్బంది,ప్రజా ప్రతినిధులు పాల్గొనడం జరిగింది

# వార్షిక ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం

**ఆగిరిపల్లి ఏప్రిల్ 1 ప్రభాతవార్త :**
స్థానిక వెలుగకార్యాలయంలో సీసీలు,వివోఏలు మరియు ఎన్యూమేరేటర్లకు మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించబడింది. 2025 -26 ఆర్థిక సంవత్సరమునకు స్వయం సహాయక సంఘాలకు వార్షిక ప్రణాళికల తయారీపై ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఏబీఎన్ దయాల రాజశేఖర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఈ ఆర్థిక సంవత్సరంలో వారికి కావలసిన ఆర్థిక వార్షిక ప్రణాళికను వారే తయారు చేసుకునే విధంగా స్వయం సహాయక సంఘాలు లలో సమావేశాలు పెట్టి తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు, దీనికి సంబంధించి ఒక్కొక్క ఎన్యుమరేటర్ కి 8 సంఘాలు చొప్పున ట్యాగ్ చేసి ఈ ప్రణాళికలు తయారు చేయడం



జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు దివ్య రజిని హుస్సేన్వి మరియు ఆగిరిపల్లి క్లస్టర్ ఎన్యుమరేటర్స్ పాల్గొన్నారు.

# పశువుల నీటికుంటల పూజా కార్యక్రమంలో పాల్గొన్న చింతలపూడి ఎమ్మెల్యే

**చింతలపూడి.. ప్రభాత వార్త :**
చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి గ్రామం నందు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులలో భాగంగా పశువుల కొరకు నీటి నిల్వలా నీటికుంటాలను ఏర్పాటుకు పూజా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పాల్గొని కొబ్బరికాయ కొట్టి నీటికుంటాను తోవ్వారు అనంతరం ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇప్పటికే రైతులు వ్యవసాయం చేసుకొనుట కొరకు సేద్యపు నీటికుంట (ఫారం పాండ్)ను ఏర్పాట్లు చేస్తున్నట్టు అదేవిదంగా పశువులకు వేసవికాలంలో దాహం తీర్చడానికి నీటికుంటాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే పల్లెలకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తున్నట్టు తెలిపారు ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు రైతులు టీడీపీ జనసేన బీజేపీ కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు



# ఆప్కాస్ కొనసాగించాలని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల ధర్నా

**చింతలపూడి. ప్రభాత వార్త :**
చింతలపూడి నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్ పావని ద్వారా రాష్ట్ర మున్సిపల్ శాఖ మాత్యులు పి నారాయణ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు ఆప్కాసును కొనసాగించాలని, కార్మికుల జీవితాలు ప్రవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని ధర్నాలో నినాదాలు చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు ఈ ధర్నాకు నాయకత్వం వహించారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ వి ఎస్ నారాయణ మాట్లాడుతూ ఆప్కాసుని ఎత్తివేయాలని ప్రభుత్వం దృఢంగా నిశ్చయించుకుంటే కార్మికులను రెగ్యులర్ చేయాలని అనంతరం ఆప్కాస్ సేవలను ఆపివేయవచ్చని అంతేగాని మున్సిపల్ కార్మికుల జీవితాలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించినట్లయితే జీతాలు సక్రమంగా చెల్లించరని, కార్మికుల వద్ద నుండి రికవరీ చేసిన పీఎఫ్,ఈఎస్ఐ నగదు సక్రమంగా ఆయా సంస్థలకు చెల్లించరని, కార్మికుల జీవితాలతో ప్రైవేటు ఏజెన్సీలు చెలగాటమాడతారని అందుకే



ఆప్కాస్ కొనసాగించాలని లేనిచో కార్మికులను రెగ్యులర్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు తానంకి విజయరాజు, వెలగాడి పద్మ, షేక్ సలీం, సోమయ్య, లావేటి వంశీ , బొచ్చ కృష్ణ, సిఐటియు నాయకులు ఆర్. ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం మున్సిపల్ శాఖ మాత్యులు. నారాయణ పంపవలసిన వినిత పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ పావని కి అందజేశారు.

# లంక భూముల సాధనలో ప్రాణ త్యాగానికైనా సిద్ధం

**పెనుమంట్ర, ఏప్రిల్-01, ప్రభాతవార్త :**
పేదల అభివృద్ధికి ముందుకు వచ్చేది భారత కమ్యూనిస్టు పార్టీ (ఎం) అని ఆ పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. మంగళవారం పెనుగొండ తహసిల్దార్ ఆఫీస్ వద్ద జరిగిన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధాంతం గోదావరి పరివాహక ప్రాంతంలోని పెరుగులంక భూములు పేదలకు సాధించి పెట్టేవరకు సిపిఎం ముందుంటుందని అన్నారు. దళిత పేదలకు లంక భూములు సాధనలో ప్రాణ త్యాగానికైనా సిద్ధమని సభలో చెప్పడంతో ప్రజలు హర్షాతిరేకం వ్యక్తం చేశారు. లంక భూములు అక్రమ త్రవ్వకాలు చేపట్టడానికి ఎదురుచూస్తున్న రాబందులకు అధికారులు అడ్డుకట్టు వేయాలని డిమాండ్ చేశారు. గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న దళిత పేదలకు సి పట్టా భూములు ఇచ్చిన తర్వాత ఇంతవరకు సెంటు భూమి కూడా పేదలకు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుమారు 80 ఎకరాలుగా ఉన్న పెరుగు లంక భూములను సిద్ధాంతం దళిత పేదలకు పంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహసిల్దార్ బి అనిత కుమారి కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, కప్పల రత్నరాజు, నాగిశెట్టి గంగారావు, గుమ్మడి భాను, రాజు, చిక్కాల చిన్న, ముత్తబత్తుల ప్రసాదు, చింత శ్రీను (మేస్త్రి), కుసుమే




వెంకటేశ్వరరావు, నక్క స్వామి, నేలపూడి నాగేశ్వరరావు, గడ్డం శ్రీనుబాబు, బత్తుల దుర్గాప్రసాద్, గడ్డం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మావుళ్ళమ్మను దర్శించుకున్న జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి, కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం ఏప్రిల్ 1 ప్రభాతవార్త :మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలసి భీమవరం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించారు. తొలుత ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మంగళ వాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి అంతరాలయానికితీసుకు వెళ్లారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ఆశీర్వచన మండపము నందు జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి లను ఆసీనులను చేసి వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. తొలుత వీరు ఇరువురు విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు, వేద పండితులు, దేవాలయం సిబ్బంది నల్లా లోకనాదం, దేవాలయం ఇన్స్పెక్టర్ యు.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



వేలేరుపాడు,ప్రభాతవార్త : వేలేరుపాడు మండలంలోని కోయమధారం గ్రామానికి చెందిన జనసేన పార్టీ సానుభూతి పరుడు కొర్స మంగారాజు గత కొద్ది రోజుల క్రితం "పారలసిస్"తో బాధ పడుతూ హాస్పిటల్లో ట్రీట్మెంట్ చేయించుకోవడం జరిగింది.అతనికి సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద(50737 రూపాయలు)పోలవరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే" చిర్రి బాలరాజు" చేతుల మీదుగా ఆయన కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ కుటుంబంలో ఒకరూ అనారోగ్యం పాలైతే కుటుంబం మొత్తం ఇబ్బందులు పడుతుంది.వారికి కొంత ఆర్థిక సహాయం క్రింద కూటమి ప్రభుత్వం అందించడం జరుగుతుందని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు దయతో 21 మంది లబ్దిదారులకు 20,57,577 రూపాయలు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించడం జరిగింది అని తెలిపారు. రాష్ట్ర ముఖ్య మంత్రి,చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గార్లకు లబ్దిదారులు తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో వేలేరుపాడు జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ,ప్రధాన కార్యదర్శి పొట్ల మోహన్ దొర, జనసేన సోషల్ మీడియా ఇన్చార్జి క్రాంతి కుమార్, మంగారాజు కుటుంబ సభ్యులు కొర్స బాబు,సున్నం రవి పాల్గొన్నారు.

## జనార్ధనవరం లో 5 లీటర్ల సారా స్వాధీనం



చాట్రాయి, ఏప్రిల్ 1,ప్రభాతవార్త :అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి. హెచ్.అజయ్ కుమార్ సింగ్ ఆధ్వర్యములో చాట్రాయి మండలం జనార్ధనవరం గ్రామములో మంగళవారం జరిపిన దాడులలో ఐదు లీటర్ల నాటు సారాయిని స్వాధీన పరచుకొని నేరముగను చెందిన బొల్లికొండ వెన్న రావుపై కేసు నమోదు చేసినట్లు ఏలూరు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి. హెచ్.అజయ్ కుమార్ సింగ్ తెలిపినారు. ఈ దాడులలో ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ పి. యస్. డి. భోగేశ్వర రావు మరియు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నూజివీడు స్టేషన్ పరిదిలో ఎక్సైజ్ నేరములకు పాల్పడుతు పలు కేసులలో ముద్దయిలుగా వున్న చాట్రాయి మండలం పోలవరం కు చెందిన పిల్లి దుర్గా ప్రసాద్ ని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం తిరువూరు కోర్ట్ కు తరలించినట్లు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఏ.మస్తానయ్య తెలిపారు.

## ఎల్ -1 స్కానర్లతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ



జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త: ప్రభుత్వం లబ్ధిదారుడికి త్వరగా పెన్షన్ పంపిణీ చేయాలని ఉద్దేశంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొత్తగా రూపొందించిన ఎల్ -1 స్కానర్లతో వేలిముద్ర కష్టాలు తీరుతున్నాయ ని చింతలపూడి నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ పారేపల్లి రామారావు అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలోఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు మంగళవారం పంపిణీ కార్యక్రమంలో 7వ సచివాలయల పరిధిలో గల 20 వార్డులో చింతలపూడి నియోజకవర్గం అబ్జర్వర్ పారేపల్లి రామారావు పట్టణ పట్టణ టిడిపి అధ్యక్షులు రావూరి కృష్ణ పట్టణ ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము, రైతు నాయకులు అల్లూరి రామకృష్ణ, పాలూరి లక్ష్మణరావు, పి సీతారాముడు, సచివాలయం సిబ్బందితో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు.

## పెండింగ్ రేషన్ కార్డుదారులకు షెడ్యూల్ ప్రకారం ఈ- కేవైసీ



వేలేరుపాడు, ప్రభాత వార్త : వేలేరుపాడు మండలంలోని మండల తాహసిల్దార్ డి వి సత్యనారాయణ రేషన్ డీలర్లకు,ఆధార్ ఆపరేటర్ మరియు గ్రామ రెవెన్యూ అధికారులకు సమావేశం నిర్వహించారు. మండలంలో ఈ కేవైసీ పెండింగ్ ఉన్న రేషన్ కార్డుదారులకు మరియు చిన్నపిల్లలు ఆధార్ కార్డు అప్డేట్ చేసుకొనుటకు ఆధార్ ఆపరేటర్ పెడకం.వెంకటేశ్వర్లును కే.ఆర్.పురం ప్రాజెక్టు అధికారి నియమించడం జరిగినదని తెలియజేశారు. ఈ సమావేశంలో మండలంలో మొత్తం 1312 ఈ కేవైసీ కార్డుదారులకు ఈ-కేవైసి చేయించాల్సి ఉన్నదని, పెండింగ్ కార్డుదారులకు షెడ్యూల్ ప్రకారం ఆధార్ కార్డ్ బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. సచివాలయాల ప్రకారం కట్కూరు ఏప్రిల్ 2, కోయిదా ఏప్రిల్ 3,మేడేపల్లి ఏప్రిల్ 4,నాల్లవరం ఏప్రిల్ 5, రామవరం ఏప్రిల్ 7, రేపాకాగోమ్ము-1 ఏప్రిల్ 8, రేపాకాగోమ్ము-2 ఏప్రిల్ 9, రుద్రం కోట ఏప్రిల్ 10, తట్కూరుగోమ్ము-1 ఏప్రిల్ 11,తట్కూరుగోమ్ము -2 ఏప్రిల్ 12,తిరుమలాపురం ఏప్రిల్ 13, కోయిదా మరియు కటుకూరు ఏప్రిల్ 15,16 తేదీలలో ఆధార్ సెంటర్ లను ఏర్పాటు చేయటం జరుగుతుందని షెడ్యూల్ ప్రకారం ఆధార్ అప్డేట్ చేయించుకోవాలని సూచించారు.

## చంద్రబాబు ఒకే రోజు ఫించన్ పెంపు నిర్ణయం చారిత్రాత్మకం.

### వృద్ధులు దివ్యాంగులకు ఫించన్ సొమ్ము అందజేసిన మంత్రి రామానాయుడు.

పాలకొల్లు ప్రభాతవార్త :
ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఒకే రోజున పెద్ద ఎత్తున ఫించన్ సొమ్ము పెంచి అందిస్తున్నారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పట్టణ 31 వ వార్డు వడలవానిపేటలో మంగళవారం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఆయన ఫించన్ సొమ్మును అందజేశారు. చిన్నపాటి పాడైన ఉంటున్న ఓ వృద్ధురాలి ఇంటికి వెళ్లి డబ్బులు అందించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. టిడ్కో ఇల్లు మంజూరైన ఇవ్వలేదని ఆమె తెలపగా గత ఐదేళ్లలో జగన్ ఒక్క ఇంటిని ఇవ్వకపోగా అరబస్త సిమెంట్, రూపాయి పని చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇల్లు సుందరవణంగా తయారవుతున్నాయని, త్వరలోనే అందించే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వృద్ధురాలికి పండ్లు ఇవ్వడంతో పాటు స్వయంగా తినిపించి దీవించమంటూ మంత్రి రామానాయుడు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులకు రూ 3వేలు నుంచి 4వేలుకు, దివ్యాంగులకు 3 వేలు నుంచి 6 వేలుకు, మంచం మీద ఉన్న వారికి 5 వేలు నుంచి 10 వేలు, 15 వేలు చొప్పున పెంచి అందిస్తున్నామన్నారు. జగన్కు వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని పనిచేసే ప్రభుత్వానికి , పనిచేయని ప్రభుత్వానికి తేడాను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. నాడు జగన్ రంగుల మీద పెట్టిన శ్రద్ధ వృద్ధులు వితంతువులు దివ్యాంగులపై పెట్టలేదు అన్నారుదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా పెన్షన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీకి నెలకు 3000 పోట్లు చొప్పున ఐదేళ్లకు ?1,80,000 కోట్లు ఖర్చు పెడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదవాడి ఇంటి గుమ్మం దగ్గరకు వెళ్లి పెన్షన్ సొమ్మును స్వయంగా అందిస్తున్నారని గతంలో ఏ ముఖ్యమంత్రి ఈ విధంగా చేయలేదని మంత్రి రామానాయుడు తెలిపారు. చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకపోయినా కూటమి ప్రభుత్వాన్ని దీవించిన అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలని ఉద్దేశంతోనే అభివృద్ధి, సంక్షేమం దిశగా మంచి పాలన అందిస్తున్నారని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ సారథి, టిడిపి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బొంతు తిరుమలరావు, ఊటల నాగేంద్ర,సబ్బితి వెంకట రెడ్డి, కిలారి రామారావు, పోతుల ఉమా శంకర్, చిప్పాడా ఋషి, రాణి, మజ్జి అప్పల నాయుడు, మజ్జి సన్యాసి రావు... ధనని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలపల్లి పంచాయతీలో చెత్త బుట్టలు పంపిణీ



మొగల్తూరు ఏప్రిల్ 1(ప్రభాతవార్త) మండల కేంద్రమైన మొగల్తూరు. ముత్యాలపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం గ్రామ సర్పంచ్ అడ్డాల సూరిబాబు ఆధ్వర్యంలో చెత్తబుట్టల పంపిణీ జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడ్డాల సూరిబాబు ఎంపీటీసీ తిరుమాని స్వామి టిడిపి నాయకులు కొల్లాటి మూలస్వామి కొల్లాటి బాలకృష్ణ కొల్లాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

ముసునూరు, ఏప్రిల్01 ప్రభాతవార్త: పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న పరీక్షలు సోమవారం రంజాన్ పర్వదినం రావడంతో ఆరోజు నిర్వహించాల్సిన సాంఘిక శాస్త్రం పరీక్ష ను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించింది. మండల పరిధిలోని చెక్కపల్లి, ముసునూరు, గోపవరం జడ్పీ ఉన్నత పాఠశాల లలో పరీక్షా కేంద్రాలు కొనసాగాయి. తాసిల్దార్ కే రాజకుమార్ పరీక్షా కేంద్రాలను తనిఖీ నిర్వహించారు.

## నేడు శ్రీ నూకాలమ్మ ఆలయంలో

## విశేష పూజలు,అఖండ అన్న సమారాధన



జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త జంగారెడ్డిగూడెం పట్టణ శ్రీ నూకాలమ్మ అమ్మవారి 61వ ఉగాది వార్షిక జాతర జరుగుతున్న క్రమంలో 8వ రోజైన మంగళవారం అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ ( పండు), ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులకు సకలశుభాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, కార్యసిద్ధి పొందుతారని అర్చక స్వాములు తెలిపారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో సామూహిక కుంకుమ పూజా కార్యక్రమం వేదోక్తంగా జరిగింది. సాయంత్రం 7 గంటల నుంచి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త తిప్పాభట్ల వెంకట రామకృష్ణ చే ఆలయ విశిష్టతపై ప్రత్యేక ప్రవచన కార్యక్రమం జరిగింది. డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) మాట్లాడుతూ ఈ నెల 2 బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఆలయ యాగశాలలో ఆవాహిత దేవి దేవతల హెూమములు, శ్రీ నూకాలమ్మ అమ్మవారి మూల మంత్ర హెూమం, విశ్వశాంతి కొరకు మహా పూర్ణాహుతి జరపబడుతుందని అనంతరం 11 గంటల నుంచి శ్రీ నూకాలమ్మకి కుంభాన్ననివేదన తదుపరి గ్రామ భక్త మహాశయులకు మహా అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 10 గంటల నుంచి కోయ్యలగూడెంకు చెందిన ఆవుల రాంబాబు నేత్రుత్వంలో సాయి సినీ భక్తిరంజని కార్యక్రమం జరుగును. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, గ్రామ భక్త మహా జనులు పాల్గొని కార్యక్రమాలను విజయంతం చేశారని సత్యనారాయణ తెలిపారు.

## భాష్యం స్కూల్లో ఆందోళన

### - అధిక ఫీజులకు నిరసన



ప్రభాతవార్త నరసాపురం :
రాయపేటలో గల భాష్యం స్కూల్లో మంగళవారం ఉద్యమాల మోత మోగింది. అధిక ఫీజులు నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆందోళన చేస్తుండగా చిన్న మామిడి పల్లి కు చెందిన బెల్లంకొండ కృష్ణ అనే విద్యార్థి పై టీచర్ అమానుషంగా కొట్టారని తీవ్రంగా హింసించారని తల్లిదండ్రులు ఆరోపించారు. టీచర్ పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. -కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్లో ప్రభుత్వ నిర్దేశించిన ఫీజు విధానాన్ని అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు స్థానిక పట్టణంలో భాష్యం పబ్లిక్ స్కూల్లో ప్రభుత్వ నిబంధన విరుద్ధంగా అధిక మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులు వసూలు చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కూల్ లోపల వరండాలో నేలపై కూర్చుని నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ భాష్యం స్కూల్లో ప్రభుత్వ నిర్దేశించిన ఫీజులకు విరుద్ధంగా అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు 2025 టూ 2026 విద్యా సంవత్సరం గాను ఎల్కేజీ నుండి 30 వేల రూపాయలు పదో తరగతి విద్యార్థుల నుండి 55 వేల రూపాయల నుండి 75 వేల రూపాయలు వరకు అధిక మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు ఇదేమిటి అని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నించిన గాని యాజమాన్యం సరైన సమాధానం చెప్పట్లేదన్నారు ఇది మా పైనుంచి వచ్చిన రూల్స్ అని చెప్పటం విడ్డూరంగా ఉంటుందన్నారు ప్రభుత్వ గుర్తింపుతో స్కూలు నడుపుతున్న యాజమాన్యాలు ప్రభుత్వం యొక్క ఫీజు విధానాన్ని అమలు చేయకుండా తల్లిదండ్రుల నుండి వేల రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తుంటే సంబంధిత ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు పట్టి పట్టినట్టు వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు ప్రతి విద్యా సంస్థ వారి ఇష్టం వచ్చినట్టు ఫీజులను కట్టించుకోవడం ఏంటని ప్రశ్నించారు కచ్చితంగా ప్రభుత్వ నిర్దేశించిన ఫీజు విధానాన్ని తల్లిదండ్రులకు తెలియజేసే విధంగా ప్రతి స్కూల్లో ఫీజుల ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల విధానాన్ని స్కూల్లో అమలులో జరిగే విధంగా అధికారులు విద్యార్థులు తల్లిదండ్రులతో స్కూలు యాజమాన్యంతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు విద్యార్థులకు తరగతికి సంబంధించిన పుస్తకాలను అధిక ధరలకు స్కూలు యాజమాన్యం విక్రయించడం తగదన్నారు మార్కెట్లో రేట్లు కన్నా అధిక మొత్తంలో విద్యార్థుల నుండి పుస్తకాలను కొనుగోలు చేయిస్తున్నారన్నారు ఒకపక్క ఫీజుల రూపంలో మరోపక్క పుస్తకాల రూపంలో తల్లిదండ్రుల నుండి స్కూలు యాజమాన్యాలు అధిక మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్లో అమలవుతున్న ఈ విధానాన్ని ప్రభుత్వ సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవటం వల్లే స్కూలు యాజమాన్యాలు వారి ఇష్టానుసారం అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు ఈ విధానాన్ని కట్టడి చేయకపోతే విద్యార్థి తల్లిదండ్రులను సమీకరించి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు పి ధనంజయ్ జి ధీరజ్ కౌశిక్ సురేష్ సాయి వేమ సతీష్ విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది




జంగారెడ్డిగూడెం,ప్రభాత వార్త: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో తెల్లవారుఝామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు బారులుదీరి స్వామివారిని దర్శించుకొన్నారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు శ్రీస్వామి వారి ఆలయం చుట్టు 108 ప్రదక్షణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మద్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవల, విరాళాల ద్వారా రూ 1,77,931లు సమకూరింది. సుమారు 1500 మంది భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థానం కార్యనిర్వాహనాధికారిణి ఆర్.వి. చందన పూజా కార్యక్రమాలు,భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు. దేవస్థాన పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ,కురగంటి రంగారావు తగిన ఏర్పాట్లు చేశారు.

## నిర్వాసితుల త్యాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి



వేలేరుపాడు,ప్రభాత వార్త : వేల కుటుంబాల త్యాగాల ఫలితంగానే రాష్ట్రానికి వెన్నుముక అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాకారమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మండలంలోని వేలేరుపాడు, సుద్ధగుంపు, జగన్నాధపురం, మల్లారం, భూదేవిపేట, రామవరం, ఇప్పలగుంపు తదితర గ్రామాల్లో శత జయంతి వేడుకల్లో భాగంగా సీపీఐ చేపట్టిన ప్రచార జాత రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న నిర్వాసితుల త్యాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి వారికి అన్ని విధాలా అండగా ఉండాలన్నారు.

## వర్గీకరణపై జగన్ తను మాట తెలపాలి: ఎమ్మార్పీఎస్



పోడూరు, ఏప్రిల్-01, ప్రభాతవార్త: వర్గీకరణపై జగన్ తను మాట తెలపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చిన్నిబాబు, ఎం. ఎస్పి. పట్టణ అధ్యక్షులు పసుపులేటి నందబాబు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం పాలకొల్లు మార్కెట్ యార్డ్ నందు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పట్టణ అధ్యక్షులు పసల బోసు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని బాబు మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో జగన్ మోహన్ రెడ్డి ద్వంద వైఖరి ని మాదిగ ప్రజలు అందరూ గమనిస్తున్నారని అన్నారు. వర్గీకరణ మీద జగన్ స్థాండ్ ఏంటో తెలియజేయాలనీ డిమాండ్ చేశారు. వర్గీకరణ నా తండ్రి కోరిక నేను అధికారం లోకి వచ్చాక ఖచ్చితంగా వర్గీకరణ చేస్తాను అని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వా కనీసం మాదిగ నాయకులకు అపాయింట్ మెంట్ కూడా ఇవ్వలేదు. అందుకే 11 సీట్లకు పరిమితం అయ్యారని దుయ్యాబెట్టారు. మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పను అనే జగన్ మోహన్ రెడ్డి వర్గీకరణ విషయంలో ఎందుకు నోరుమేధపడం లేదు అని అన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై వివాదం

### - తెదేపా - వైసీపీల మధ్య వాగ్వాదం



చాట్రాయి, ఏప్రిల్ 1,ప్రభాతవార్త : చాట్రాయి మండలం, చనుబండ శివారు సూరంపాలెం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు పై తెలుగుదేశం పార్టీ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. వివరాల ప్రకారం చాట్రాయి మండలం సూరంపాలెం గ్రామంలో మార్చి18 న ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ నాయకుడు నక్కా రాము ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. సదరు స్థలములో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు పనులు టిడిపి నక్కా రాము మరియు టిడిపి కార్యకర్తల సమక్షంలో చేస్తుండగా వైసిపి కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు కుదరదని మేము రాజశేఖర్ రెడ్డి మరియు అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసిన స్థలములో ఏర్పాటుకు కుదరదని వేరే స్థలంలో ఏర్పాటు చేసుకోవాలని పనులను అడ్డుకోవడంతో టిడిపి వైసిపి కార్యకర్తలు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ఇది గ్రామానికి చెందిన అందరి స్థలమని ఈ స్థలములోనే విగ్రహ ఏర్పాటు చేస్తామని పని మొదలు పెట్టగా వైసిపి వారు మేము రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తొలగిస్తామని ఈ ప్రదేశంలో అంబేద్కర్ విగ్రహం ఒక్కటే ఉండే విధంగా చూడాలని గ్రామ యువత కొరగా టిడిపి నాయకుడు నక్కారాము మాట్లాడుతూ మేము ఎవరి విగ్రహాలు తీయాలని కోరడం లేదు మీరు మా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఇక్కడ కుదరదు అన్నారు కనుక మీరు చెప్పిన విధంగానే ఈ నెల 10 తారీకు లోపు రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని అలా జరగిన మీదట మేము వేరే ప్రదేశంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని, మీరు విగ్రహాన్ని తొలగించని పక్షములో మేము భూమి పూజ చేసిన ప్రదేశంలోనే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని ఇరుపార్టీల కార్యకర్తలు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు.

## నేటితో ముగిసిన టెన్త్ క్లాస్ పరీక్షలు.



జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త: మండలంలోని లక్కవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై టెన్త్ క్లాస్ పరీక్షలు ముగించుకుని ఇంటికి వెళ్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న లక్కవరం ఎస్సై.

### డ్వాక్రా సంఘాలు పారదర్శకంగా పనిచేయాలి -ఏ. పి.యం రాజశేఖర్

నూజివీడు, ఏప్రిల్01 ప్రభాతవార్త: స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు,వివోఏలు ఎన్యూమేరేటర్లకు మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపిఎం దయాల రాజశేఖర్ మాట్లాడుతూ 2025 -26 ఆర్థిక సంవత్సరమునకు స్వయం సహాయక సంఘాలకు వార్షిక ప్రణాళికల తయారీపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఈ ఆర్థిక సంవత్సరంలో వారికి కావలసిన ఆర్థిక వార్షిక ప్రణాళికను వారే తయారు చేసుకునే విధంగా స్వయం సహాయక సంఘాలలో సమావేశాలు పెట్టి తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. దీనికి సంబంధించి ఒక్కొక్క ఎన్యుమరేటర్ కి 8 సంఘాలు చొప్పున ట్యాగ్ చేసి ఈ ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు దివ్య రజిని, హుస్సేన్వి ,ఆగిరిపల్లి క్లస్టర్ ఎన్యుమరేటర్స్ పాల్గొన్నారు

## పారదర్శకంగా ఎన్టీఆర్ భరోసా : ఎమ్మెల్యే ఆరిమిల్లి



అత్తిలి – ఏప్రిల్ 1 ( ప్రభాత వార్త ):రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పారదర్శకంగా జరుగుతోందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇరగవరం మండలం అర్జునుడు పాలెం, అత్తిలి మండలం పాలూరు గ్రామాల లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

### వరాల వెంకన్నను తాకిన సూర్య కిరణాలు



అత్తిలి – ఏప్రిల్ 1 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం ఈడూరు లో గల వరాల వేంకటేశ్వరస్వామి వారి దివ్య మూర్తిని సూర్యకిరణాలు తాకాయి. ఉదయము స్వామి వారిని సూర్య కిరణాలు తాకటంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో అర్చనలు జరిపారు.

## ముగిసిన పదోతరగతి పరీక్షలు.



అత్తిలి – ఏప్రిల్ 1 ( ప్రభాత వార్త ): అత్తిలిమండలం లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ పి రమేష్, ప్రసాద్ తెలిపారు. మండలంలోని 4 పరీక్షాకేంద్రాలలో చివరి రోజు 550 మంది పరీక్షా రాసినట్లు తెలిపారు 9 మంది ఆబ్సెంట్ ఐనట్లు తెలిపారు.

## చక్రదేవరపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త: ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తున్న మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,గ్రామ పంచాయతీ సర్పంచ్ సాయిల సత్యనారాయణ మంగళవారం జంగారెడ్డిగూడెం మండలం చక్ర దేవరపల్లి గ్రామంలో పెన్షన్ల ను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గొర్రెల సత్తిబాబు, వైట్ల ఆంజనేయులు సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ కుమార్



చింతలపూడి.. ప్రభాత వార్త :ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం లో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ అందజేసిన చింతలపూడి శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ ఈ కార్యక్రమంలో చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ పావని , పట్టణ మండల కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు

### నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ముసునూరు,ఏప్రిల్01 ప్రభాతవార్త: బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని ఎంపీడీవో జి రాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లు, అధికారుల సమక్షంలో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న యూనిట్లకు సంబంధించి వివరాలు, కుల, నివాస, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డులు కూడా తెచ్చుకోవాలన్నారు. మండల పరిధిలోని 16 గ్రామపంచాయతీలో పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అందరూ విధిగా హాజరు కావాలన్నారు. వివరాల కోసం సంబంధిత పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలన్నారు.

# 'అర్జున్ S/O వైజయంతి' సాంగ్ లాంచ్ ఈవెంట్

నందమూరి కళ్యాణ్ రామ్ హైలీ యాంటిసిపేటెడ్ యాక్షన్‌ప్యాక్డ్ ఫ్యామిలీ డ్రామా అర్జున్ S/O వైజయంతి ఈ వేసవి సీజన్‌లో బిగ్గెస్ట్ ఎంటర్‌టైనర్‌లలో ఒకటిగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు దూకుడుగా జరుగుతున్నాయి. టీజర్ భారీ అంచనాలను నెలకొల్పింది. టీజర్‌తోనే సినిమా థియేటర్, నాన్ థియేటర్ బిజినెస్ మొత్తం క్లోజ్ అయ్యింది. కళ్యాణ్ రామ్ కెరీర్లో హైయెస్ట్ ప్రి రిలీజ్ బిజినెస్ జరిగిన సినిమాగా అర్జున్ S/O వైజయంతి రికార్డు క్రియేట్ చేసింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రంలో విజయశాంతి ఐపిఎస్ అధికారిగా కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ని ఫస్ట్ సింగిల్ నాయల్ది రిలీజ్ చేయడంతో కిక్ స్టార్ట్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ నరసరావుపేటలోని రవి కళా మందిర్‌లో భారీగా తరలివచ్చి ఫ్యాన్స్ సమక్షంలో చాలా గ్రాండ్‌గా జరిగింది. ఈ సందర్భంగా అభిమానులు భారీ ర్యాలీని నిర్వహించారు. సాంగ్స్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. నాయల్ది సాంగ్ కళ్యాణ్ రామ్, సాయి మంజ్రేకర్ మధ్య సిజలింగ్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేసింది.



అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన ఈ ట్రాక్, రఘురామ్ రాసిన లిరిక్స్ తో సాయి అందం పట్ల కళ్యాణ్ రామ్ అభిమానాన్ని ఆకట్టుకునే శైలిలో అందంగా చిత్రీకరించారు. సాఫ్ట్ అండ్ మెలోడీగా మొదలైన సాంగ్ క్రమంగా ఊపందుకుంది. అదిరిపోయే డ్యాన్స్ నంబర్‌గా మారుతుంది. కళ్యాణ్ రామ్ స్టైలిష్, మోడరన్ దుస్తులలో మెరిశారు. డ్యాన్స్ ఫ్లోర్‌లో అతని కమాండింగ్‌తో అదరగొట్టారు. అద్భుతమైన డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నారు. శేఖర్ విజె మాస్టర్ హైఎనర్జీ కొరియోగ్రఫీ చేశారు. సాంప్రదాయ చీరలో ధరించిన సాయి మంజ్రేకర్, కళ్యాణ్ రామ్ ఎనర్జీని మ్యాచ్ చేశారు. ఫస్ట్ సాంగ్‌కి వచ్చిన ఇన్‌స్టంట్ అండ్ ట్రెమండస్ రెస్పాన్స్‌తో మ్యూజిక్ ప్రమోషన్లు బ్లాక్ బస్టర్ ప్రారంభం అయ్యాయి. ఈ పాట మ్యూజిక్ చార్టులలో టాప్ సాంగ్‌గా ట్రెండ్ అవుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రామ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందించగా, తమ్మిరాజు ఎడిటర్. శ్రీకాంత్ విస్సా స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేయనున్నారు మేకర్స్.

# 'చైనా పీస్' ఫస్ట్ లుక్ రిలీజ్

నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాధ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా చైనా పీస్. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్ర పోషించారు. మేకర్స్ వాలి పాత్రలో నిహాల్ కోధాటిని పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. నిహాల్‌ని ఇంటెన్స్ లుక్‌లో ప్రజెంట్ చేసి ఫస్ట్ లుక్ అదిరిపోయింది. ఈ సినిమాలో ఆయన క్యారెక్టర్ ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ సురేష్ రగుతు అందిస్తుండగా సంగీతం కార్తీక్ రోడ్రిగ్జ్ సమకూరుస్తున్నారు. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్. ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుంది. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తారు. నటీనటులు: నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్, హర్షిత బండ్కమూరి, కమల్ కామరాజు, గులాసీ, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్, టెక్నికల్ టీం: రచన, దర్శకత్వం: అక్కి విశ్వనాధ రెడ్డి, బ్యానర్: మూన్ లైట్ డ్రీమ్స్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: సురేష్ రగుతు సంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్.





సిద్ధి ఇద్నాని నయా లుక్

# ప్రేక్షకుల్ని ఆకట్టుకునే మూవీ '28⁰ సి'

ఎమోషనల్ థ్రిల్లర్ లవ్ స్టోరీ మూవీ "28⁰సి"తో ప్రొడ్యూసర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు యువ నిర్మాత సాయి అభిషేక్. ఆయన వీరాంజనేయ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి హీరో హీరోయిన్లుగా ఈ సినిమాను నిర్మించారు. "పొలిమేర" ఫేమ్ డైరెక్టర్ డా.అనిల్ విశ్వనాథ్ తన మొదటి సినిమాగా "28⁰సి" రూపొందించారు. ఈ సినిమా ఈ నెల 4వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. జరిగిన ఇంటర్వ్యూలో "28⁰సి" మూవీ హైలైట్స్ తెలిపారు నిర్మాత సాయి అభిషేక్. నేను, డైరెక్టర్ డా.అనిల్ విశ్వనాథ్ క్లోజ్ ఫ్రెండ్స్. మూవీస్ మీద మా ఇద్దరికీ ప్యాషన్ ఉండేది. అనిల్ క్షణం సినిమాకు డైరెక్షన్ డిపార్ట్ మెంట్‌లో జాయిన్‌అయ్యాడు. నేను కూడా డైరెక్షన్ వైపు ప్రయత్నాలు చేశాను. కొద్ది రోజుల తర్వాత మనమే కలిసి మూవీ చేద్దామని నేను, అనిల్ నిర్ణయించుకున్నాం. "28⁰సి" అనే టెంపరేచర్ పాయింట్‌తో అనిల్ విశ్వనాథ్ చెప్పిన కథ ఇంప్రెస్ చేసింది. ప్రేక్షకులకు కూడా ఇది కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకంతో మూవీ స్టార్ట్ చేశాం. మొదట ఈ మూవీకి వేరే హీరోలను అనుకున్నా, నవీన్ చంద్రకే బాగుంటుందనే నిర్ణయించాం. ఈ మూవీకి ఫస్ట్ అనుకున్న హీరోయిన్ అంజలి. కొంత ట్రెండీగా కొత్త ఫేస్ ఉంటే బాగుంటుందని షాలినీని తీసుకున్నాం.



వైజాగ్‌లో షూటింగ్ స్టార్ట్ చేశాం. అక్కడి నుంచి గోవా, ఆ తర్వాత జార్జియా వెళ్లాం. ప్రొడక్షన్ విషయంలో రాజీ పడకుండా హై క్వాలిటీతో మూవీ చేశాం. సినిమా కంటెంట్ మీద మా టీమ్ అందరికీ మంచి నమ్మకం ఉండేది. 2019లోనే "28⁰సి" మూవీ రెడీ అయ్యింది. 2020 మేలో రిలీజ్ చేయాలని అనుకున్నాం. కరోనా పాండమిక్ వల్ల థియేటర్స్‌లో రిలీజ్ చేయడం కుదరలేదు. ఓటీటీ ఆఫర్స్ వచ్చినా ఈ ప్లాట్ ఫామ్స్‌కు ఇంత డిమాండ్ ఏర్పడుతుందని అప్పుడు ఊహించలేదు. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కోసం సినిమా కదా థియేటర్స్‌లోనే రిలీజ్ చేయాలనే కోరిక ఉండేది. నా కో ప్రొడ్యూసర్స్, అనిల్, టీమ్ అందరితో డిస్కస్ చేశాక వాళ్ల సపోర్ట్‌తో థియేటర్స్‌లోనే రిలీజ్ చేయాలని పట్టుదలగా వేచి చూశాం. కొద్ది రోజుల్లో అంతా మామూలుగా అవుతుందని అనుకుంటే, అది కొన్నినెలల పాటు సాగింది. అలా మామూవీ రిలీజ్ ఆలస్యమైంది. వంశీ నందిపాటి ఇనిషేటివ్‌తో ఈనెల 4న మా "28⁰సి" సినిమాను థియేట్రికల్‌గా రిలీజ్ చేయబోతున్నాం. హీరోగా నవీన్ చంద్ర మాకు బాగా కోపరేట్ చేశాడు. సినిమాను మాతో పాటు ఆయన బాగా నమ్మాడు. షూటింగ్ టైమ్‌లోనే కాదు ఇప్పుడు ప్రమోషన్స్‌లో కూడా సపోర్ట్ చేస్తున్నాడు. ఆయన క్యారెక్టర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. అలాగే హీరోయిన్ షాలినీ బాగా పర్ఫార్మ్ చేసింది.

# 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' ట్రైలర్ అదుర్స్


టీవీ యాంకర్ టర్న్ హీరో ప్రదీప్ మాచిరాజు మోస్ట్ ఎవైటెడ్ మూవీ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి వేసవిలో వన్ అఫ్ ది బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ గా ఏప్రిల్ 11న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది. ఈ యూనిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను యంగ్ ట్యాలంటెండ్ డైరెక్టర్స్ దుయో నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ ఎగ్జైటింగ్ ఎంటర్‌టైనర్‌లో దీపికా పిల్లి కథానాయికగా నటిస్తోంది. టీజర్, పాటలు ఇప్పటికే అద్భుతమైన రెస్పాన్స్ అందుకున్నాయి. మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కథ ఒక మారుమూల గ్రామంలో ఒక ప్రాజెక్ట్‌ను సూపర్ వైజ్ చేయడానికి నియమించబడిన సివిల్ ఇంజనీర్ చుట్టూ నడిచింది, అక్కడ అతను 60 మంది అనుభవం లేని కార్మికులతో పని చేయించాలి గ్రామస్తులలో, ఒకే ఒక అమ్మాయి ఉంది, ఆమె తండ్రి 60 మందిలో ఒకరిని పెళ్లి చేసుకోవాలని అనౌన్స్ చేస్తాడు. ప్రాజెక్ట్ ముందుకు సాగుతున్న కొద్దీ, ఇంజనీర్ మరియు అమ్మాయి ఇద్దరూ ప్రేమలో పడతారు. తర్వాత జరిగే సిచువేషన్స్ చాలా ఎక్సైటింగ్‌గా టర్న్ అవుతాయి.



నితిన్‌భరత్ ద్వయం హ్యూమర్ తో కూడిన ప్రత్యేకమైన కథాంశాన్ని ఎంచుకున్నారు. ఎక్స్ యిటింగ్ సిచువేషన్స్‌తో నవ్వును అందించడంలో వారు విజయం సాధించారు. డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. ప్రదీప్ మాచిరాజు తన పాత్రకు పెర్ఫెక్ట్‌గా ఫిట్ అయ్యారు, తన టైమింగ్‌తో హ్యూమర్‌ని అద్భుతంగా పండించారు. దీపికా పిల్లి పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ వుండే పాత్రలో కనిపించింది. వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను వినోదాన్ని పుష్కలంగా అందించారు. ఎంఎన్ బాల్‌రెడ్డి గ్రామీణ వాతావరణాన్ని అందంగా చూపించారు, రధన్ సంగీతం ప్లజెంట్ గా వుంది. కోదాటి పవన్ కళ్యాన్ ఎడిటర్. నిర్మాణ విలువలు ఉన్నతంగా వున్నాయి. కథ, డైలాగ్స్ సందీప్ బొల్లా రాశారు. అశిష్టేజ పులాల ప్రొడక్షన్ డిజైనర్. మొత్తంమీద, అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి రొమాన్స్, విలేజ్ డ్రామాతో కూడిన వినోదాత్మకంగా ఉంటుందని ట్రైలర్ హామీ ఇస్తుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ, అందరికి నమస్కారం. మా టీవీ షోస్ చూసి ఆడియన్స్ అందరూ ఎలా అయితే ఎంటర్టైన్ అయ్యారో అలాగే అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాని కూడా ఆడియన్స్ అంతే గొప్పగా ఎంజాయ్ చేస్తారు. సినిమా ఏప్రిల్ 11న రిలీజ్ అవుతుంది. సినిమా ఆద్యంతం ఎంటర్టైన్మెంట్‌తో ఉంటుంది. చాలా సరదాగా ఉంటుంది. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాం. మా టీ థాంక్యూ చాలా కష్టపడి పని చేశారు. కథ నచ్చి అందరూ చాలా ఇష్టంగా ఈ ప్రాజెక్టును చేశారు. మా బెస్ట్ ఫ్రెండ్స్ అందరు కలిసి ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమా మాలు మంచి గుర్తింపును తీసుకురావాలని కోరుకున్నాం. ఫ్యూచర్లో మరిన్ని మంచి మంచి సినిమాలు చేయడానికి ఈ సినిమా ఒక మెట్టు అవుతుందని భావిస్తున్నాం. పాటలకు టీజర్ ట్రైలర్‌కు ప్రేక్షకులు వండర్ఫుల్ సపోర్ట్ అందించారు. సినిమా తప్పకుండా మీ అందరికీ నచ్చుతుందన్నారు.

# 'మోగ్లీ 2025' ఫస్ట్ లుక్ సూపర్

తన తొలి చిత్రం బబుల్ గమ్‌లో తన అద్భుతమైన నటనతో అలరించిన యంగ్ హీరో రోషన్ కనకాల ప్రస్తుతం మోగ్లీ 2025లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి నేషనల్ అవార్డ్ విన్నింగ్ కలర్ ఫోటో డైరెక్టర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై విజనరీ ప్రొడ్యూసర్ టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో మల్టీ ట్యాలెంటెడ్ బండి సరోజ్ కుమార్ ఓ పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. నోలన్‌గా ఆయన పాత్రని పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. కాండిల్‌తో సిగరెట్ వెలిగిస్తూ ఇంటెన్స్‌గా చూస్తున్న ఫస్ట్ లుక్ అదిరిపోయింది. ఈ చిత్రంలో ఆయన పాత్ర ఎంత రూత్ లెస్‌గా వుండబోతోందో ఈ పోస్టర్ తెలియజేస్తోంది.




ఇప్పటికే విడుదలైన ఈ సినిమా గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. గ్లింప్స్ రోషన్‌ను హైఆక్టేన్ యాక్షన్ అవతార్‌లో చూపించింది. ఈ చిత్రంతో సాక్షిసాగర్ మడోల్కర్ హీరోయిన్‌గా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, కాల భైరవ సంగీతం అందిస్తున్నారు. కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కిరణ్ మామిడి ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌ను పర్యవేక్షిస్తుండగా, నటరాజ్ మాదిగొండ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రాఫర్ చేస్తున్నారు. స్క్రీన్‌ప్లేను రామ మారుతి ఎం, రాధాకృష్ణ రెడ్డి రాశారు. ప్రతిభావంతులైన తారాగణం, టెక్నికల్ టీంతో రూపొందుతున్న మోగ్లీ 2025 సినీ ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతోంది. మోగ్లీ 2025 ఈ సంవత్సరం చివర్లో విడుదల కానుంది. తారాగణం: రోషన్ కనకాల, సాక్షి సాగర్ మడోల్కర్, బండి సరోజ్ కుమార్ సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: సందీప్ రాజ్, నిర్మాతలు: టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సంగీతం: కాల భైరవ డిఓపి: రామ మారుతి ఎం, ఎడిటర్: కోదాటి పవన్ కళ్యాణ్, ఆర్ట్: కిరణ్ మామిడి, యాక్షన్: నటరాజ్ మాడిగొండ సహ రచయితలు: రామ మారుతి. ఎం అండ్ రాధాకృష్ణరెడ్డి, పీఆర్వో: వంశీ శేఖర్.

# ఎంఎస్ఆర్ క్రియేషన్స్ 'ప్రొడక్షన్ నం.1' షురూ

ప్రముఖ దర్శకుడు మల్లిడి వశిష్ట సోదరుడు మల్లిడి కృష్ణ దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఎంఎస్ఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్.1గా కుశాల్ రాజును హీరోగా పరిచయం చేస్తూ స్కైఫై డ్రామాను తెరకెక్కించబోతున్నారు. డా.లతా రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం సోమవారం అన్నపూర్ణ స్టూడియోలో అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో స్టార్ డైరెక్టర్స్ వీవీ వినాయక్, మల్లిడి వశిష్ట, ఎస్వీ కృష్ణారెడ్డితో పాటు నిర్మాతలు అచ్చిరెడ్డి, బెల్లంకొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి స్క్రిప్ట్‌ను అందజేయగా, వీవీ వినాయక్ ఫస్ట్ షాట్‌కు క్లాప్ కొట్టారు. మల్లిడి వశిష్ట ఫస్ట్ షాట్ డైరెక్టర్ చేశారు. ఎన్నో హిట్ చిత్రాలకు సంగీతం అందించిన శ్రీచరణ్ పాకాల ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. పూజా కార్యక్రమంలో దర్శకుడు మల్లిడి కృష్ణ మాట్లాడుతూ, '2012లో నా జర్నీ మొదలైంది. ఎన్నోమలుపులు తిరిగి మీ ముందుకు డైరెక్టర్‌గా వచ్చాను. లతకి నేను ఫస్ట్ థ్యాంక్స్ చెప్పాలి. అలాంటి మంచి నిర్మాత దొరకాలంటే అదృష్టం ఉండాలి. ఇదొక స్కైఫై డ్రామా మూవీ. ఓటీటీల యుగంలో ఇలాంటి కథను ఎంచుకోవాలంటే ధైర్యం ఉండాలి. రాబోయే ఈవెంట్స్‌లో మరిన్ని వివరాలు వెల్లడిస్తా" అని చెప్పారు. సీనియర్ నటుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ, "పెళ్లి సినిమా తర్వాత నేను చేసిన కొన్ని సినిమాలకు ఇలాంటి భారీ ఓపెనింగ్స్ జరిగాయి. మళ్లీ ఇప్పుడు ఇంత భారీ స్థాయిలో గ్రాండ్ ఓపెనింగ్ జరగడం సంతోషంగా ఉంది. ఇందులో నాది పాజిటివ్ క్యారెక్టర్. డైరెక్టర్ వచ్చి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జయిట్ అయ్యాను. యానిమల్ మూవీ తర్వాత నా సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ అయింది. ప్రస్తుతం నేను 19 సినిమాలు చేస్తున్నా. అందులో ఇది ఒక బెస్ట్ ప్రాజెక్ట్ అని చెప్పొచ్చు. డైరెక్టర్ కృష్ణ వెరీ టాలెంటెడ్ పర్సన్. మొన్న జరిగిన ఫొటో షూట్‌తో నాకు ఆ విషయం అర్థమైంది. ఈ సినిమా చాలా పెద్ద హిట్ అవుతుంది." అని చెప్పారు. హీరో కుశాల్ రాజు మాట్లాడుతూ,"నా దర్శకుడు కృష్ణకు నేను థ్యాంక్స్ చెప్పాలి. నన్ను హీరోగా పరిచయం చేయడం కోసం మా అమ్మ లతగారు చాలా కేర్ తీసుకున్నారు. వీవీ వినాయక్‌కి, బెల్లంకొండ శ్రీనివాస్‌కి, మా టీమ్ మొత్తానికి బిగ్ థ్యాంక్స్" అని అన్నారు. నిర్మాత డాక్టర్ లతారాజు మాట్లాడుతూ, "నిర్మాతగా నాకు ఎలాంటి ఎక్స్‌పీరియన్స్ లేదు. మా అబ్బాయి కోరిక మేరకు నేను నిర్మాత అవ్వాల్సి వచ్చింది.



# నేను గర్వపడే మూవీ 'సారంగపాణి జాతకం'

కోర్ట్ చిత్రంతో కెరీర్ బెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్న వెర్సటైల్ స్టార్ ప్రియదర్శి టైటిల్ రోల్ ప్లే చేసిన చిత్రం "సారంగపాణి జాతకం". "జెంటిల్ మ్యాన్, సమ్మోహనం" చిత్రాల అనంతరం ఇంద్రగంటి మోహనకృష్ణ శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో ప్రియదర్శి, హీరోయిన్ రూపా కొడవాయూర్, దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, ఛాయాగ్రాహకుడు పి.జి.విందా, ఈ చిత్రంలో ముఖ్యపాత్రలు పోషించిన అవసరాల శ్రీనివాస్, సాయి శ్రీనివాస్ వడ్లమాని, అశోక్ కుమార్, ప్రదీప్ రుద్ర, నివితా మనోజ్, సమీర భరద్వాజ పాల్గొన్నారు!

**మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేంత..**

**చాలా మంచి సినిమా!..** చిత్ర ఛాయాగ్రాహకుడు పి.జి.విందా మాట్లాడుతూ, "అష్టాచెమ్మా, అమీతుమీ" తర్వాత ఇంద్రగంటితో నేను చేసిన మూడో సినిమా "సారంగపాణి జాతకం". శ్రీదేవి మూవీస్‌లో కూడా నాకిది మూడో చిత్రం. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేంత మంచి సినిమా ఇది. ఈ చిత్రానికి పని చేయడం నాకు గర్వకారణం. దర్శి నుంచి కోరుకునే కామెడీ ఇందులో పుష్కలంగా ఉంటుంది" అన్నారు!



**ఇంద్రగంటి సినిమాల్లో భాగం..**

**..కావడం ఓ భాగ్యంగా భావిస్తా!..** ఈ చిత్రంలో ఓ ముఖ్యపాత్ర పోషించిన అవసరాల శ్రీనివాస్ మాట్లాడుతూ... "ఇంద్రగంటి మోహన్ కృష్ణ గారి సినిమాల్లో భాగం కావడం ఓ అదృష్టంగా భావిస్తాను. ఇందులో జాతకాలు చెప్పే మోడరన్ స్వామిగా ఎంటర్టైన్ చేస్తాను" అన్నారు!

**నా పేరు పరపతి..**

**పదింతలుపెంచే చిత్రం!..** నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, "నిర్మాతగా నా సెకండ్ ఇన్నింగ్స్ ఇంద్రగంటి మోహన్ కృష్ణ "జెంటిల్ మ్యాన్"తో స్టార్ట్ అయ్యింది. "సమ్మోహనం"తో విజయపరంపర కొనసాగింది. సమంత "యశోద" కూడా మంచి విజయం సాధించింది.

# 'ప్రొడక్షన్ నంబర్ 2' అనౌన్స్‌మెంట్

కలర్ ఫోటోతో అందరినీ ఆకట్టుకొని రైటర్ పద్మభూషణ్‌తో బిగ్ సక్సెస్‌ని సాధించిన సుహాస్ మరో కంటెంట్ రిచ్ సినిమాకి సైన్ చేశారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 2గా బి నరేంద్ర రెడ్డి నిర్మించనున్న ఈ న్యూ వెంచర్‌కు గోపి ఆచార దర్శకత్వం వహిస్తున్నారు. రైటర్ పద్మభూషణ్‌తో ప్రశంసలు అందుకున్న షణ్ముక ప్రశాంత్ ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు. ఈ చిత్రం అవుట్ అండ్ అవుట్ ఫన్ రైడ్‌గా ఉండబోతోంది. అద్భుతమైన కామెడీ టైమింగ్‌కు పేరుపొందిన సుహాస్ ఈ చిత్రంలో హిలేరియస్ పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు మూడు నెలల్లో ముగుస్తాయని, జూలైలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని మేకర్స్ తెలిపారు. నటీనటులు,సిబ్బందికి సంబంధించిన మరిన్ని అనౌన్స్ మెంట్ త్వరలో రానున్నాయి. తారాగణం: సుహాస్, లసాంకేతిక సిబ్బంది: బ్యానర్: త్రిశూల్ విజనరీ స్టూడియోస్, నిర్మాత: బి నరేంద్ర రెడ్డి, దర్శకత్వం: గోపీ ఆచార, కథ: షణ్ముక ప్రశాంత్, పీఆర్వో: వంశీ శేఖర్.



# ప్రధాని వ్యక్తిగత కార్యదర్శిగా..



ప్రధానమంత్రి మోదీకి ప్రైవేట్ సెక్రటరీగా ఓ అధికారిణి నియమితులయ్యారు. దాంతో ఎవరీమె? అంటూ అందరిలోనూ ఆసక్తి మొదలైంది. ఆవిడే నిధి తివారీ. 2014 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీస్ అధికారిణి. వారణాసి మెహముర్గంజ్‌లో చేరిన ఆమె... సివిల్ సర్వీసెస్ పరీక్షలో 96వ ర్యాంకు సాధించారు. ఈ పరీక్ష రాయకముందు అసిస్టెంట్ కమిషనర్ (కమర్షియల్ ట్యాక్స్)గా వారణాసిలో పనిచేశారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్ ర్యాంకు సొంతం చేసుకున్నారు. పీఎంఎలో చేరకముందు విదేశాంగ మంత్రిత్వశాఖలో పని చేశారు ఆ తరవాత 2022లో ప్రధానమంత్రి అండర్ సెక్రటరీగా చేరిన ఆమె తన ప్రతిభతో అనతికాలంలోనే డెప్యూటీ సెక్రటరీగా ఎదిగారు. ఇందులో భాగంగా ఫారెన్ అండ్ సెక్యూరిటీకి చెందిన అంశాలను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్కు ఆమె నివేదించారు. ప్రత్యేకించి అణుశక్తి, విదేశాంగ, భద్రతా సిబ్బందిలో ఆమె కీలకంగా వ్యవహరించారు. ఈ పనితనమే ఆమెను అందరిలోనూ ప్రత్యేకంగా నిలిపింది. ప్రధాని వ్యక్తిగత కార్యదర్శిగా ఎంపికయ్యే అర్హతను సంపాదించేలా చేసింది. □

# ఆత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ..

చదువుకునే రోజుల్లోనే తమ మేధస్సుతో అద్భుతాలు సృష్టిస్తున్నారు కొందరు అమ్మాయిలు. శాస్త్రసాంకేతిక రంగాల్లో పరిశోధనలు చేస్తూ కొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. భారత సంతతికి చెందిన దివ్య త్యాగం ఇదే కోవకు చెందుతుంది. ప్రస్తుతం పెన్సిల్వేనియా యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చదువుతున్న ఆమె.. ఏరోడైనమిక్స్ లో మహామహులు సైతం పరిష్కరించలేని వందేళ్ల నాటి సమస్యను ఇటీవలే పరిష్కరించారు. నుండి గాలి మరల రూపకల్పనలో ఆధునాతన మార్గాలకు తెరతీసినట్లయింది. అంతేకాదు.. దివ్య చూపిన పరిష్కార మార్గం బ్రిటిష్ ఏరోడైనమిస్ట్ హెర్మన్ గ్లౌకెట్ రూపొందించిన గాలి మరల నమూనాను మరింత మెరుగుపరిచేలా ఉందంటూ ఈ విశ్వవిద్యా లయం దివ్యపై ప్రశంసలు కురిపించింది. ఈ నేపథ్యంలో ఈ యంగ్ ట్యాలెంట్ గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందాం..!

**పరిశోధనలే ప్రాణంగా...**

వివిధ విషయాలను తెలుసుకోవాలని పరిశోధ నలు చేయడం, కొత్త విషయాలు ఆరాట పడుతోంది నేటి యువత. దివ్య కూడా ఇలాంటి అమ్మాయే! భారత సంతతికి చెందిన ఆమె.. ప్రస్తుతం గ్రేటర్ ఫిలడెల్ఫియాలో నివసిస్తోంది. చిన్నతనం నుంచి విమానయానం, రక్షణ వ్యవస్థలు, అంతరిక్ష నౌకలు.. ఇతర విషయాలపై ఆసక్తి చూపడం. ఈ మక్కువతోనే పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పూర్తిచేసిన దివ్య.. ప్రస్తుతం ఇదే యూనివర్సిటీలో, ఇదే డిగ్రీ మాస్టర్స్ చదువుతోంది. తదుపరి సంబంధిత పరిశోధనలూ నిర్వహించామె. ఈ కావనే కంప్యుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ (సీఈఎఫ్ఈ)లో కటింగ్ ఎడ్జ్‌తో పలు ప్రయోగాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఇకపై విమానయాన భద్రతను అందించడంపై దృష్టి పెట్టిన ఈ బ్రిలియంట్ లేడీకి ఈ యూఎస్ నేవీ నుంచి పూర్తి సహకారం కూడా అందుతోంది.

**పందేళ్ల నమూనాకు కొనసాగింపుగా!** "ఆత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ దివ్య నిర్వహించే పరిశోధనలు.. ఈ రంగంలో సరికొత్త వ్యక్తులకు శ్రీకారం చుడుతుంటాయి. అలా మరల పనితీరుపై ఆమె చేసిన పరిశోధన ఈ కాంశంలో వందేళ్ల నాటి గణిత సమస్యకు పరిష్కారం చూపింది. టర్బైన్ రోటర్‌పై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఈ యువ శాస్త్రవేత్త పరిశోధనలు కనుగొన్నారు.. ఈ రంగంలో రాణించాలనే భవిష్యత్ తారల వారికి ఇది మరింత ఉపయోగకరమని.. ఈ అధ్యయనంలో దివ్యకు గైడ్ చేసిన Sven Schmitz తెలిపారు.





ఈ పరిశోధనకు సంబంధించిన థీసిస్ 'విండ్ ఎనర్జీ సైన్స్' అనే జర్నల్లో ప్రచురితమైంది. 'ఉత్తమ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ థీసిస్'గానూ ఘనత ఏర్పడింది. ఇలా దివ్య పరిశోధనకు గుర్తింపుగా "Anthony E. Wolk Award" కూడా దక్కింది.

**ఉత్పత్తి ఎక్కువ.. ఖర్చు తక్కు!** అయితే తాను చేసిన ఈ పరిశోధన భవిష్యత్తులో పవన్ శక్తి ఉత్పత్తిని పెంచడంలో, దానికయ్యే ఖర్చును తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతోంది దివ్య. ఒక పెద్ద గాలి మర శక్తిని 1 శాతం పెంచడం వల్ల టర్బైన్ విడుదల చేసే విద్యుత్ ఉత్పత్తి పెరుగుతుంది.దీనితో ఒక చిన్న గ్రామానికి సరిపడా విద్యుత్ను అందించవచ్చు. ఇలా ఈ మరల సహాయంతో విద్యుత్ ఉత్పత్తి పెరగడం వల్ల ఆటోమెటిక్గా దాన్ని వినియోగించుకునే వారికి కూడా తగ్గుతుంది. ఈ గాలి మరల పరిశోధన కోసం, థీసిస్ రాయడానికి నేను వారానికి 1015 గంటల సమయం కేటాయించాను. అయితే ఇది గణిత శాస్త్రంతో ముడిపడి ఉండటం వల్ల కాస్త ఎక్కువ సమయం పట్టింది. అయినా నా పనితీరు నాకు సంతృప్తినిచ్చింది. పవన్ విద్యుత్ శక్తి అనే అంశంలో సరికొత్త ఒరవడిని సృష్టించినందుకు గర్వంగా అనిపిస్తోంది.. అంటోంది యంగ్ రీసెర్చర్. ఇలా దివ్య చేసిన పరిశోధన, ఆమె ప్రతిభను పెన్సిల్వేనియా యూనివర్సిటీ కొనియాడింది. ఈ పరిశోధనను అటు అమెరికా వ్యాప్తంగా, ఇటు ప్రపంచవ్యాప్తంగా పాఠ్యాంశాల్లో చేర్చాలని నిర్ణయించింది. □

# 'చీరె'పై కాలేజి



డిగ్రీ పట్టా తీసుకోవడమనేది ఏ విద్యార్థి జీవితంలోనైనా మైలురాయి. ఆరోజు మీకు నచ్చిన డ్రెస్ వేసుకుని కాలేజీ/యూనివర్సిటీ ప్రాంగణమంతా తిరుగు తుంటారు. ఫొటోలకూ పోజులిస్తారు. కాకినాడకు చెందిన రమ్యారావు చావల అందుకు భిన్నంగా, ఆరోజు తాను కట్టిన చీరపైన తను చదివిన కాలేజీ బొమ్మని వేయించుకున్నారు. హైదరాబాద్‌లోని 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' నుంచి ఇటీవలే రమ్య పీజీపీ ప్రోగ్రాం పూర్తయింది. గ్రాడ్యుయేషన్ డేకు తన చీర కొంగుమీద ఐఎస్‌బీ హైదరాబాద్, మొహాలీ క్యాంపస్ల బొమ్మలను హ్యాండ్‌గా చేసి తన ప్రత్యేకతను ప్రదర్శించారు. తన వినూత్న ఆలోచనతో డిగ్రీతోపాటు ఆరోజు 'బ్రాండ్ అంబాసిడర్ ఆఫ్ ఐఎస్‌బి' అవార్డును అందుకున్నారు. □




**ఈ రోజుల్లో తల్లిదండ్రులు... పిల్లలు అడిగిందల్లా ఇవ్వడమే గొప్ప అమకుంటున్నారు.** కానీ, ఏ మాత్రం శ్రమించకుండానే కోరినవన్నీ దక్కకుంటే... భవిష్యత్తులో కష్టనష్టాలను



# లక్ష్యాలను నిర్దేశించండి

తట్టుకోలేకపోవచ్చు. ఒకవేళ ఎప్పుడైనా తాము అనుకున్నది జరగనప్పుడు తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం, వాటిని సాధించుకోవడానికి ఇతరులను బెదిరించడం జరగొచ్చు. తాము పడ్డ కష్టాలు తమ బిడ్డలు పడకూడదనుకుంటారు కొందరు తల్లిదండ్రులు. అందుకే అడగకముందే అన్నీ సమకూరుస్తారు. మంచి విషయమే కానీ, అవసరాలకు మించిన సౌకర్యాలు, విలాసాలకు వారు అలవడితే భవిష్యత్తుకే ముప్పు. ముఖ్యంగా కష్టం విలువ తెలియకపోతే, సర్దుబాట్లు అర్థం కాకపోతే ఒక్కోసారి జీవితాన్నే కోల్పోవలసి వస్తుంది. అందుకే ఏ వయసులో ఏమివ్వాలి? ఎంత ఇవ్వాలి? అన్నది పెద్దలకు తెలిసి ఉండాలి.

ఒక్కోసారి పిల్లలు తాము కోరింది చేయాల్సిందే అని పట్టుబడుతుంటారు. మీరు అంగీకరించడం మొదలు పెడితే దాన్నే అలుసుగా తీసుకునే ప్రమాదం ఉంది. అది నో చెప్పాల్సిందే అనుకున్నప్పుడు మొహమాటానికి పోవద్దు. ముఖ్యంగా ఖరీదైన వస్తువులనో, వినోదాలనో ఏంచుకుంటే... మీ స్థాయికి తగ్గ ప్రత్యామ్నాయాలను చూపించండి. తక్కువలోనూ ఎక్కువ సంతృప్తి పొందగలిగే విధానాలను పరిచయం చేయండి. అప్పుడే పిల్లలకు జీవితం విలువ అర్థమవుతుంది. ఏ కారణంతో అయినా పిల్లలు అడిగింది పేచీ పెడితే వెంటనే తలొగ్గకండి. వారు అడిగింది ఎంత చిన్నదైనా, పెద్దదైనా సరే... ఊరకే ఇచ్చేయొద్దు. ఒకవేళ మీరు అంగీకరిం చాల్సి వచ్చినా... దానికి షరతులు విధించండి. దాన్ని సాధించాలంటే.. వారికి కొన్ని లక్ష్యాలను నిర్దేశించండి. వాటిని పూర్తి చేస్తేనే దక్కుతాయనే విషయం చెప్పండి. అప్పుడే ఏదైనా కావాలంటే కష్టపడాలన్న విషయం అర్థమవుతుంది. □

మన దేశంలో మహిళల విజయ గాథల ప్రభావం వారు పని చేస్తున్న రంగానికే పరిమితం కాలేదు. ఆ విజయ తరంగాలు ప్రతి మహిళా తనకు నచ్చిన రంగంలో ప్రవేశించి రాణించేలా స్ఫూర్తినిసునతన్నాయి.



**- ఫాల్గుణి నాయర్, నైకా**

# ప్రెగ్నెన్సీలో ప్రయాణాలు మంచిదేనా ?



గర్భం ధరించానని తెలియ గానే కొందరు తమ పనులు తాము కూడా వెనక ముందు అవుతారు. ఇంకొంతమందైతే అత్యవసర పరిస్థితుల్లో తప్ప డెలివరీ అయ్యే వాక ప్రయాణాలు కూడా మానుకుంటారు. ఇలా తమ పనుల వల్ల కడుపులోని బిడ్డకు ఏదైనా కలుగుతుందేమో అని జాగ్రత్తపడుతుంటారు కాబోయే అమ్మలు. అయితే ప్రెగ్నెన్సీ అనేది అనారోగ్యం కాదని, ఈ శరీరం, ఆరోగ్యం సహకరిస్తే ఎవరికి వారు అన్ని పనులు చేసుకోవచ్చని, దీనివల్ల మరింత చురుగ్గా ఉండగలుగుతారని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. గర్భంతో ఉన్నప్పుడు ప్రయాణాలు కూడా చేయకూడదు, అయితే అందుకు ముందుగా డాక్టర్ సలహా ఇస్తున్నారు. ఇక దీనితో పాటు ప్రయాణం చేయాలనుకునే గర్భిణులు కొన్ని జాగ్రత్తలు కూడా పాటించడం అన్ని విధాల శ్రేయస్కరమంటు న్నారు. మరి, ఇంతకీ ఆమెతో తెలుసుకుందాం ..

మన ఉండే ప్రొజెస్టారాన్ హార్మోన్ గర్భాశయానికి రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఈ గర్భాశయ ముఖద్వారాన్ని బిగుతుగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఫలితంగా మెట్లెక్కడం, ప్రయాణాలు, చిన్నపాటి వ్యాయామాలు.. స్టాండింగ్ చేయడం వల్ల ఎలాంటి ఇబ్బంది కలగదని నిపుణులు చెబుతున్నారు. అయితే గర్భం ధరించిన మహిళల్లో ఒక్కొక్కరి ఆరోగ్య పరిస్థితి ఒక్కోలా ఉంటుంది. ఈ ఎవరైనా చురుగ్గా ఉంటే మరికొందరు ఎక్కువ సమయం విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుంది. కాబోయే అమ్మలు మాత్రం ప్రయాణాలు చేసేటప్పుడు వైద్యుల సలహాతో పాటు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

**తేలికైన ఆహారం.. అనుకూలమైన దుస్తులు !**

గర్భం ధరించిన మహిళల్లో వికారం, వంతులు.. వంటి లక్షణాలు కొన్ని నెలల పాటు కొనసాగుతాయి. అందుకే ప్రయాణాల్లో ఇలాంటి సమస్యలు లేకుండా ఉండాలంటే సులభంగా జీర్ణమయ్యే పోషకాహారాన్ని తక్కువ మొత్తంలో తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ప్రయాణ సమయంలోనూ తేలికపాటి ఆహారమే మంచిది. మీ ప్రెగ్నెన్సీ రిపోర్టులు, డాక్టర్ ప్రిస్క్రిప్షన్స్, మందులు.. వంటివన్నీ ఎప్పుడూ మీ వెంటే ఉంచుకోవాలి. ఏదైనా అత్యవసరం వస్తే వెంటనే అక్కడికి దగ్గరలోని ఆసుపత్రిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవచ్చు. ఓ నీళ్ల బాటిల్ను వెంట ఉంచుకోవడమూ మరవద్దు. అలాగే మధ్యమధ్యలో వీలుంటే కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరంలో నీటి స్థాయులు పడిపోకుండా ఉంటాయి.. అలాగే శరీరానికి తక్షణ శక్తి కూడా వస్తుంది. ఇక పండ్ల రసాలు తాగాలనుకున్న వారు ఇంటి నుంచే తయారు చేసి పట్టుకెళ్లడం ఉత్తమం. ప్రయాణాల్లో బిగుతైన దుస్తులు కాకుండా వదులు, వస్తువులు ఉండే దుస్తులు వేసుకోవడం మంచిది. కూర్చున్నా ఇబ్బందిగా అనిపించదు. అలాగే చెప్పుల విషయంలోనూ ప్లాట్స్‌ఖిని ఏంచుకుంటే కంఫర్టబుల్గా నడవడానికి వీలవుతుంది. ఇక మధ్యమధ్యలో టాయిలెట్స్కి వెళ్లే వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఈ విధంగా ఆయా వాష్రూమ్స్ డోర్స్, నర్సిని తాకినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడానికి వీలుగా మీ వెంటే ఓ మినీ హ్యాండ్‌వాష్ బాటిల్‌ను ఉంచుకోవడం మంచిది. అలాగే మధ్యమధ్యలో చేతులు శానిటైజ్ చేసుకోవడమూ ముఖ్యమే. జెస్టేషనల్ డయాబెటిస్ లేదంటే మల్టిపుల్ ప్రెగ్నెన్సీ (కవలలు, ట్రిప్లెట్స్‌కు జన్మనివ్వబోయే తల్లులు) ఉన్న వారు విమానాల్లో ప్రయాణించకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. అలాగే గర్భం ధరించి 35 వారాలు దాటిన వారు కూడా విమాన ప్రయాణానికి నో చెప్పడమే మంచిదట! ఎందుకంటే ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రి-మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయట! ఇక కారులో వెళ్లే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవడం, మధ్యమధ్యలో ప్రశాంతమైన వాతావరణం ఉన్న ప్రదేశంలో వాహనాన్ని ఆపి కాసేపు రిలాకనసవడం, అటూ ఇటూ తిరగడం వల్ల ప్రయాణ అలసటను దూరం చేసుకోవచ్చు.

**ఈ సమస్యలుంటే వద్దే వద్దు ! ...**

అయితే కొన్ని అనారోగ్యాలున్న గర్భిణులు మాత్రం ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. గతంలో గర్భస్రావం లేదా ప్రీ మెచ్యూర్ డెలివరీ అయిన వారు గర్భాశయంలో ఏదైనా సమస్యలుంటే. గర్భం దాల్చిన తొలి నెలల్లో రక్తస్రావం లేదా ఇతర సమస్య లెదురైతే.. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ (గర్భాశయం వెలుపల పిండం పెరగడం), లేటు వయసులో గర్భం ధరించడం, కవలలు లేదా ట్రిప్లెట్స్ తమ గర్భంలో పెరుగుతున్నప్పుడు (మల్టిపుల్ ప్రెగ్నెన్సీ)... ఇలాంటి వారు ప్రయాణాలు చేయకపోవడమే మంచిదట. □



# ఇంటిని కాలుష్య రహితంగా...

బయటి కాలుష్యం నుంచి తప్పించుకోవడానికి ఇల్లే సురక్షితమైన ప్రదేశం అనుకుంటాం. ఈ క్రమంలోనే ఇంటి వాతావరణాన్ని శుభ్రంగా ఉంచుకోవడానికి పలు చిట్కాలు పాటిస్తుంటాం. అయితే నిజానికి ఇల్లూ కాలుష్యానికి మినహాయింపేమీ కాదంటున్నారు నిపుణులు, ఇంట్లోని దుప్పట్లు, కార్పెట్లు, కర్టెన్లు, పెంపుడు జంతువులు, వంటగదిలో వెలువడే వాయువులు, వాడుకునే ఉపకరణాలు, ఆఖరికి పెంచుకునే కొన్ని మొక్కలు కూడా కాలుష్య కారకాలే అని చెబుతున్నారు. తద్వారా దగ్గు, ఆస్తమా, అలర్జీలు, చర్మవ్యాధులు.. ఇలా వివిధ సమస్యలు తప్పవంటున్నారు. అందుకే వీటి పరిశుభ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. మరి, ఇంటి కాలుష్యాన్ని తగ్గించడానికి నిపుణులు సూచిస్తున్న కొన్ని మార్గాలేంటో తెలుసుకుందాం రండి..



ఇల్లంతా సువాసనభరితంగా ఉండాలని కొందరు కృత్రిమ ఎయిర్ ఫ్రెషనర్లు వాడుతుంటారు. ఇవి బెంజీన్, హైడ్రోకార్బన్.. వంటి రసాయనాల్ని వాతావరణంలోకి విడుదల చేస్తాయని చెబుతున్నారు నిపుణులు, తద్వారా కళ్లు, ముక్కు, గొంతుపై దుష్ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంలో ఊపిరితిత్తుల పైనా ఈ రసాయనాలు ప్రతికూల ప్రభావం చూపుతాయ! అందుకే వీటికి బదులుగా సహజసిద్ధమైన పరిమళాల్ని విడుదల చేసే అత్యవసర నూనెల్ని రూమ్/ఎయిర్ ఫ్రెషనర్లుగా ఉపయోగించుకోవచ్చు.

**ఆ మొక్కలే!** ఇంటి నిండా మొక్కలు పెంచేస్తుంటారు. మొక్కలు రాత్రిపూట కార్బన్ డై ఆక్సైడ్ను విడుదల చేస్తాయనే విషయం మరవద్దు. తులసి లాంటి కొన్ని మొక్కలను ఇంట్లో పెంచుకోవడం మంచిది. అలాగే కాలుష్యాన్ని అరికట్టే మొక్కలకూ ప్రాధాన్యమివ్వాలి.

**గాలి, వెలుతురు..** చాలా వరకు ఇంట్లోకి గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా కిటికీలు, తలుపులు తెరిచి ఉంచాలి. సూర్యరశ్మి ఇంట్లో నేరుగా పడేలా చేయాలి. ఫలితంగా గదుల్లో తేమ, చెమ్మ వంటివేవైనా ఉంటే తొలగిపోతాయి. హానికారక వాయువులు బయటకు వెళ్లిపోతాయి.

**వీటితో..** వెనిగర్, బయో క్లీనర్ గా పని చేస్తుంది. ఇల్లు తుడిచే మిశ్రమంలో బయట దొరికే క్లీనర్స్కి బదులుగా దీన్ని నీటిలో కలపచ్చు. చీమలు, బొద్దింకలు, చిన్న చిన్న పురుగులు సహజంగానే కాలుష్య వాహకాలు. ఇవి బయటి కాలుష్యాన్ని ఇల్లంతా వ్యాపింపజేస్తాయి. వీటిని అరికట్టడానికి వంట సోడా అక్కడక్కడా చల్లాలి. వీటితో పాటు వంటగదిని, ఇంట్లో వాడే ఉపకరణాలు కర్టెన్లు. అలాగే ఇంట్లో పెంపుడు జంతువులుంటే వాటి విషయంలోనూ శుభ్రత పాటించాలి. □

# ఆమ్‌చూర్ పౌడర్ చేద్దామా !

కూరలు, చిరుతిళ్లలో ఆమచూర్ పౌడర్ వాడుతాం. కొన్ని సార్లు చారులో కూడా చింతపండు లేదా నిమ్మ రసానికి బదులు దీన్నే వేస్తాం. సమోసా చాట్, శాండ్విచ్లోనూ ఇదుండాల్సిందే! ఆ రుచి అలాంటిది. ఇంత ముఖ్యమైన ఆమూర్ పౌడర్ని కొనకుండా ఇంట్లోనే చేసుకుంటే ఇంకెంత బాగుంటుంది కదూ? ! ఇదేదో పెద్ద ప్రహసనం అనుకుంటున్నారా.. ఊహూ, చాలా తేలిగ్గా చేసేయొచ్చు. దీనికి పచ్చి మామిడికాయలు, కాస్తంత ఉప్పు ఉంటే చాలు. కాయలు మాత్రం చాలా పుల్లగా ఉండేవాటిని ఎంచుకోవాలి. నాలుగు కాయలకు అర చెంచా ఉప్పు పడుతుంది. మామిడి కాయలను కడిగి, చెక్కు తీసి.. ఒక అర గంట సేపు నీళ్లలో ఉంచాలి. లేకుంటే రంగు మారి, నల్లగా అవు తాయి. బయటకు తీసి, తుడిచి.. చిప్స్ కటర్తో స్లైసులుగా కోయాలి. అవి సన్నగా ఉండాలి. లేదంటే సరిగ్గా ఎండవు. అన్నీ అయ్యాక శుభ్రమైన వస్త్రం మీద పరచి.. పగలు ఎండలో, రాత్రి లోనికి తెచ్చి ఫ్యాన్ కింద ఎండబెట్టాలి. ఇలా మూడు రోజులు చేయాలి. వీటికి ఉప్పు జతచేసి, గ్రైండ్ చేయాలి. చాలా మెత్తగా ఉండాలి కనుక.. జల్లెడపట్టి, మళ్లీ గ్రైండ్ చేయాలి. ఈ ఆమూర్ పౌడర్ న్ను తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రంచేస్తే.. ఆరు నెలలు నిలవనుంది. □



# బలిని శపించిన విష్ణువు

బలి చక్రవర్తి శిశువుగా ఉన్నప్పుడు ఆయనను ఊయలలో వేసే ఉత్సవానికి విష్ణుమూర్తికి ఆహ్వానం అందలేదు. అందుకాయన కోపించి ఈ బాలుడు పెద్దయ్యాక తన వద్దకు యాచన కోసం వచ్చిన బ్రాహ్మణులను సంతృప్తి పరచపోతే చేటు వాటిల్లుతుంది. అని శపించాడు. తాను చక్రవర్తి అయ్యాక కూడా విష్ణు శాపాన్ని మర్చిపోలేదు బలి. ఒకరోజు పొట్టిగా ఉన్న బ్రాహ్మణుడు వచ్చి మేం రాజ్యంలో సనపక్షాదులకు ఆవాసముంది కానీ ఈ దీన బ్రాహ్మణుడు తలదాచు కోవడానికి గుడిసె కూడా లేదయ్యా. ఏ అరుగు మీదనైనా పడుకుంచామంటే నీళ్ల జల్లి పొమ్మంటున్నారు. మీ రాజ్యంలో ఆలయాలు కిటకిటలాడుతాయి. అక్క కుదరదు. కనుక మూడడుగుల నేల ఇస్తే.. సితంగా ఉంటాను అన్నాడు. అందుకు బలి రాష్ట్ర "మూడడుగులే చాలన్న బ్రాహ్మణుడి పాదం బ్రహ్మాండంగా ఎదిగి భూభాగమంతా ఆక్రమించింది. మరో అడుగు ఆకాశాన్ని ఆక్రమించింది. వచ్చిందనరో, జరుగుతున్నదేమిటో గ్రహించిన బలి మూడో అడుగు మీద పెట్టు స్వామి అన్నాడు. వామన రూపంలో ఉన్న విష్ణుమూర్తి హృదయం మెత్తబడి ఏదైనా వరం కోరుకోమన్నాడు. పాతాళలోకానికి వెళ్లబోతున్న బలిచక్రవర్తి ఒక రోజున దీపం పెట్టి వాను చేసేవారి ఇళ్ల లక్ష్మీనిలయాలు అయ్యేటట్టు వరమివ్వు' అన్నాడు. అలా దీపావళి పండుగ ఆరంభమైంది. ఆరోజు బలిచక్రవర్తిని తలచుకుంటూ దీపదానం చేయాలంటారు. □



ఆధ్యాత్మికం

# రోజంతా పరిమళభరితంగా..

**చక్కని స్ప్రే లేదా పెర్ఫ్యూమ్ ఉపయోగిస్తే దాని ప్రభావంతో శరీరం పరిమళాలు వెదజల్లడమే కాదు.. మనసు కూడా కాస్త ఉత్సాహంగా మారుతుంది.** అయితే ఇలా చేయడం వల్ల వచ్చే పరిమళం కొద్ది సమయం మాత్రమే నిలిచి ఉంటుంది. మరి, రోజంతా పరిమళభరితంగా ఉండాలంటే మనం ఉపయోగించే బ్యూటీ ఉత్పత్తులు, వేసుకునే దుస్తులు.. తదితర విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాంరండి..

ఉదయం స్నానం చేసిన తర్వాత సాయంత్రం వరకు వివిధ పనుల మీద బయటికి వెళ్లొస్తాం. అలాంటప్పుడు ముఖం జిడ్డుగా అనిపిస్తే సబ్బుతో ఫేస్‌వాష్ చేయడం కంటే బేబీ వైప్స్ తుడుచుకోవడం మేలు. ఫలితంగా మురికిపోయి ముఖం తాజాగా కనిపించడమే కాదు.. పరిమళభరితంగా కూడా మారుతుంది.

చాలామందిలో పాదాలకు చెమట పట్టి వాసన వస్తుంటుంది. మీరూ ఇదే సమస్యతో సతమతమవుతున్నారా? అయితే స్నానం చేసిన తర్వాత కాళ్లను బాగా ఆరనిచ్చి మాయిశ్చరైజర్ అప్లై చేయండి. అలాగే సాక్సులు ధరించేవారు వాటిలోని పరిమళాలు వెదజల్లే పౌడర్ వేసినప్పుడు పాదాల నుంచి చెమట వాసన రాకుండా చెక్ పెట్టచ్చు. శరీరం పరిమళభరితంగా ఉండాలంటే వేసుకునే దుస్తులు కూడా సువాసనలు వెదజల్లడం చాలా ముఖ్యం. అందుకే దుస్తులు ఉతికేటప్పుడు ఫ్యాబ్రిక్ కండిషనర్లు వాడుతూనే, వార్డ్రోబ్లో భద్రపరిచేటప్పుడు కూడా నాఫ్తలీన్ బాల్స్ మూలల్లో వేస్తే ఫలితం ఉంటుంది. □



# బరిలోకి దిగకున్నా విజేతలే

## ఒక్క మ్యాచ్ ఆడకుండానే ఛాంపియన్స్


వాషింగ్టన్ సుందర్


రిషభ్ పంత్


అర్షదీప్ సింగ్


యుజ్వేంద్ర చాహల్


సంజూ శాంసన్


యశశ్వి జైస్వాల్

**న్యూఢిల్లీ:** ప్రతి క్రికెట్ ప్లేయర్ దేశానికి ప్రాతినిధ్యం వహించాలని, ఐసిసి ట్రోఫీ గెలవాలని కలలు కంటుంటారు. కానీ, ఒక్కోసారి ఐసిసి టోర్నీలకు ఎంపికైనా, స్క్వాడ్‌లోని ఆటగాళ్లందరికీ మ్యాచ్ ఆడే అవకాశం రాకపోవచ్చు. ఇలా ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే ఐసిసి ట్రోఫీ గెలిచిన భారత్ ప్లేయర్లు చాలా మందే ఉన్నారు. ఈ ఏడాది జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమిండియా విజేతగా నిలిచింది. ఈ జట్టులో యంగ్ ప్లేయర్లు వాషింగ్టన్ సుందర్, రిషభ్ పంత్, అర్షదీప్ సింగ్‌లు కూడా టీమిండియాలోని 15మంది స్క్వాడ్‌లో ఎంపిక య్యారు.

వీరంతా టీమ్‌ఇండియాతో పాటుగా, దుబాయ్‌కు కూడా వెళ్లారు. కానీ, ఈ ముగ్గురికి టోర్నీలో ఒక్క మ్యాచ్‌లో కూడా బరిలో దిగే ఛాన్స్ రాలేదు. దీంతో వీళ్లు టోర్నీలో ఒక్క గేమ్ ఆడకున్నప్పటికీ ఛాంపియన్స్ అయ్యారు. అలాగు అమెరికా, వెస్టిండీస్ వేదికగా గతేడాది టీ20 వరల్డ్ కప్-2024 జరిగింది. ఈ టోర్నీలోనూ భారత్ విశ్వవిజేతగా నిలిచింది. లెగ్‌స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, సంజూ శాంసన్ కూడా ఈ జట్టులో సెలెక్ట్ అయిన వారిలో ఉన్నారు. ఈ టోర్నీలో భారత్ తొలి మ్యాచ్ నుంచి ఓటమి లేకుండా దూసుకెళ్లింది. దీంతో విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చే ఉద్దేశం లేకపోవడం వల్ల చాహల్, శాంసన్‌కు ఆడే ఛాన్స్ రాలేదు. టోర్నమెంట్ అంతా బెంచ్‌కే పరిమితం అయ్యారు. అలా వీళ్లు కూడా విశ్వవిజేతలు అయ్యారు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌కు సంబంధించి టీమ్‌ఇండియా దీన్ని కూడా దక్కించుకుంది. ఆ టోర్నీకి ఆటగాళ్లు వినయ్ కుమార్, ఇర్ఫాన్ పఠాన్, అమిత్ మిశ్రా, మరళీ విజయ్ జట్టులో ఎంపికయ్యారు. కానీ, వీళ్లెవరూ ఈ ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో ఆడలేదు. అలా ఆ టోర్నీలో ఈ నలుగురు ప్లేయర్లు అసలు బరిలోకి దిగలేదు. అలాగే లెగ్ స్పిన్నర్ పియూష్ చావ్లా 2007 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియా స్క్వాడ్‌లో ఉన్నాడు.

భారత్ ఆ టీ20 వరల్డ్ కప్ గెలిచింది. అయితే చావ్లాకి ఒక్క మ్యాచ్‌లో కూడా ఛాన్స్ రాలేదు. 2002లో ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ శ్రీలంక తలపడ్డాయి. అయితే వర్షం కారణంగా మ్యాచ్ నిర్వహించడం సాధ్యం కాలేదు. దీంతో రెండు టీమ్‌లు టైటిల్ షేర్ చేసుకున్నాయి. ఇందులో జై ప్రకాష్ యాదవ్ టోర్నీకి సెలక్ట్ అయ్యాడు. కానీ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. భారత్ తొలిసారి 1983లో వన్డే వరల్డ్ కప్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీకి ఎంపికైన సునీల్ వాల్సన్‌కి ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా రాలేదు. అయినా వీరంతా హీరోలు అయి పోయారు.



# ఇంగ్లండ్, భారత్ ద్వైపాక్షిక టెస్టుకు గుడ్ బై

**న్యూఢిల్లీ:** ఏటా ఇంగ్లండ్, భారత్ మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌కు స్వస్తి పలకాలని నిర్ణయించింది. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటన జరగాల్సి ఉంది. అయితే ఈ సిరీస్ ఈ ఏడాది జరిగే అవకాశం కనిపించడం లేదు. ఇంగ్లండ్ గడ్డపై ఇరు జట్ల మధ్య మన్సూర్ అలీఖాన్ పటౌడీ ట్రోఫీ పేరిట 1961 నుండి ద్వైపాక్షిక టెస్టు సిరీస్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అయితే ఈ ట్రోఫీకి గుడ్‌బై చెప్పాలని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు భావిస్తోంది. ఈ ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌ను 1961 నుండి 1975 మధ్య కాలంలో భారత్ జట్టు తరపున 46 టెస్టులు జరిగాయి. దీన్ని రద్దు చేసి దానికి బదులుగా రెండు జట్ల మధ్య మరో సిరీస్‌ను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఇక ఇంగ్లండ్ పర్యటన సమయంలో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య 2024 నుండి క్రో-థోర్స్ ట్రోఫీని నిర్వహిస్తున్నారు. ఇంగ్లండ్ పర్యటన సమయంలో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య టెస్టు సిరీస్ 2007 నుండి పటౌడీ ట్రోఫీ పేరుతో జరుగుతోంది. భారత్ వేదికగా ఈ రెండు జట్ల మధ్య టెస్టు సిరీస్‌ను 1951 నుండి భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు నిర్వహిస్తోంది. ఈవిధంగానే భారత్-ఆస్ట్రేలియా మధ్య విజ్డెన్ ట్రోఫీతో సిరీస్‌లు జరిగాయి. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు విజ్డెన్ ట్రోఫీని రద్దు చేసి, దాని బదులుగా రెండు జట్ల మధ్య రిచర్డ్స్-బోథమ్ ట్రోఫీ పేరుతో మరో సిరీస్‌లను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ఆయా దేశాల మధ్య నాలుగు ట్రోఫీల టెస్టు సిరీస్‌లు నిర్వహిస్తున్నాయి. ఇదే విధంగా భారత్-ఆస్ట్రేలియా మధ్య 1996 నుండి బోర్డర్ గావాస్కర్ ట్రోఫీ, వెస్టిండీస్-ఆస్ట్రేలియా మధ్య 1960 నుండి ఫ్రాంక్ వోరెల్ ట్రోఫీ, ఆస్ట్రేలియా-శ్రీలంక జట్ల మధ్య 2007 నుండి వార్న్-మురళీధరన్ ట్రోఫీ, న్యూజిలాండ్-ఇంగ్లండ్ జట్ల మధ్య 2024 నుండి క్రో-థోర్ప్ ట్రోఫీలను నిర్వహిస్తున్నాయి.

# మయామి ఓపెన్‌లో.. జోకోవిచ్ ఘోర ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రపంచ దిగ్గజం, సెర్బియాకు చెందిన నోవాక్ జొకోవిచ్‌కు ఘోర ఓటమి ఎదురైంది. 2019 తర్వాత పాల్గొన్న మయామి ఓపెన్ ఎటిపి మాస్టర్స్-1000 సిరీస్ టెన్నిస్ టోర్నీలో తన కెరీర్‌లో 100వ టైటిల్ సాధించాలని ఆశించి, పట్టుదలతో ఆడిన జోకోవిచ్‌కు చుక్కెదురైంది. ఈ టెన్నిస్ టోర్నీలో కేవలం రన్నరప్‌గానే నిలిచాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19 ఏళ్ల జాకుబ్ మెన్‌షిక్ అసాధారణ ఆట తీరు కనపరచి మోనార్క్‌కు గట్టి షాక్ ఇచ్చాడు. 2 గంటల 3 నిముషాల పాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో మెన్‌షిక్ 7-6 (7/4), 7-6 (7/4)తో గతంలో ఆరుసార్లు మయామి ఓపెన్ ఛాంపియన్‌గా నిలిచిన జోక్‌విచ్‌ను బోల్తా కొట్టించాడు. 6 అడుగుల 4 అంగుళాల ఎత్తు, 83 కేజీల బరువు ఉన్న మెన్‌షిక్ 14 ఏస్‌లతో అదరగొట్టాడు. ఇద్దరూ తమ సర్వీస్‌లను ఒక్కోసారి కోల్పోగా, టైబ్రేక్‌లలో మెన్‌షిక్ పై చేయి సాధించి తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. విజేతగా నిలిచిన మెన్‌సిక్‌కు 11,24,380 డాలర్ల (రూ.9 కోట్ల 61 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 1000 ర్యాంకింగ్ పాయింట్లు, రన్నరప్ జోకోవిచ్‌కు 5,97,80 డాలర్ల ( రూ.5 కోట్ల 11 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ విజయంతో మెన్‌సిక్ ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 30 స్థానాలు పురోగతి సాధించి కెరీర్ బెస్ట్ 24వ రాయంక్‌కు చేరుకున్నాడు.

# ఐపిఎల్ రన్ రేట్‌లో.. టాప్ ప్లేస్‌లో ఆర్సీబీ

## సెకండ్ పొజిషన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 ట్రోఫీ కోసం అన్ని జట్లు తమ వేటను ఆరంభించాయి. ఇప్పటివరకు అన్ని జట్లు రెండేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకోగా, పంజాబ్ కింగ్స్ మాత్రం ఒక మ్యాచ్ మాత్రమే ఆడింది. మరికొన్ని జట్లు మూడు మ్యాచ్‌లు కూడా ఆడేశాయి. ఇప్పటికే అన్ని జట్లు పాయింట్ల ఖాతాను ఓపెన్ చేశాయి. ఈసారైనా కప్ సాధించాలని పట్టుదలతో ఉన్నా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఘన విజయాలు సాధించి నాలుగు పాయింట్లతో టేబుల్‌లో టాప్ ప్లేస్‌లో ఉంది. రన్ రేట్ కూడా +2.266 అన్ని జట్ల కంటే చాలా ఎక్కువగా ఉంది. రెండో స్థానంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఉంది. ఢిల్లీ కూడా రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించగా, నెట్‌రన్ రేట్ +1.320 ఆర్‌సీబీ కంటే తక్కువగా ఉంది. మూడోస్థానంలో లక్నో సూపర్ జెయింట్స్ ఉంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒక గెలుపు, ఒక ఓటమితో రెండు పాయింట్లు సాధించింది. లక్నోకు రన్‌రేట్ +0.963 ఇతర జట్ల కంటే మెరుగ్గా ఉంది. గుజరాత్ టైటాన్స్ రెండు మ్యాచ్‌ల్లో ఒక గెలుపుతో రెండు పాయింట్లు, +0.625 రన్‌రేట్‌తో నాలుగోస్థానంలో ఉంది.

పంజాబ్ కింగ్స్ ఆడిన ఒకే మ్యాచ్‌లో విజయం సాధించి ఐదోస్థానంలో ఉంది. ముంబై ఇండియన్స్ మూడు మ్యాచ్‌లు ఆడగా రెండు ఓటములు, ఒక గెలుపుతో ఆరోస్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ మూడు మ్యాచ్‌లు ఆడగా, ఒక మ్యాచ్‌లోనే విజయం సాధించింది. రెండు పాయింట్లు 0.771 రన్‌రేట్‌తో ఏడోస్థానంలో కొనసాగుతుంది. మొదట మ్యాచ్‌లోనే భారీ స్కోరుతో అంచనాలు పెంచేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆ తరువాత రెండు మ్యాచ్‌ల్లోనూ దారుణంగా ఓటమిపాలైంది.

రెండు పాయింట్లు, 0.871 రన్‌రేట్‌తో 8వ స్థానానికి పడిపోయింది. రాజస్థాన్ రాయల్స్ ఒకగెలుపు, రెండుఓటములతో తొమ్మిదో స్థానంలో ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఒకే గెలుపుతో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది.

# ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. స్వర్ణాలతో రాణించిన జెస్సీరాజ్



**న్యూఢిల్లీ:** అర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ అమ్మాయి జెస్సీరాజ్ అద్భుత ప్రదర్శన కనపరచింది. ఆల్ రౌండర్‌గావివిధ విభాగాల్లో స్వర్ణ,రజత, కాంస్య పతకా లతో ప్రపంచదేశాల్లో భారత్‌కు గుర్తింపు తెచ్చింది. మార్చి 26వ తేదీ నుండి 31 వరకూ తైవాన్‌లో జరిగిన అర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో జెస్సీరాజ్ పసిడి పతకాలతో రాణించింది. ఈ పోటీల్లో జనెస్సీరాజ్ 2 స్వర్ణ పతకాలు, ఒక రజతం, ఒక కాంస్య పతకాన్ని సాధించింది. సోలో డ్యాన్స్, కపుల్ డ్యాన్స్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు లభించాయి. అలాగే పెయిర్ స్కేటింగ్ విభాగంలో వెండి, ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా తైవాన్‌లో జరిగిన కార్యక్రమంలో అర్టిస్టిక్ స్కేటింగ్ ఛైర్మన్ అలెక్స్ వాంగ్ చేతుల మీదుగా ఈ పతకాలను జెస్సీరాజ్ అందుకుంది. కాగా జెస్సీరాజ్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏలూరు జిల్లా దెందులూరులో 9వ తరగతి చదువుతుండటం విశేషం.

# సెన్సెక్స్, నిఫ్టీల భారీ పతనం

**ముంబై, ఏప్రిల్ 1:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిసాయి. అమెరికా ప్రతీకార సుంకాల భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటి, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా కుదేలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఏకంగా 1400 పాయింట్లకుపైగా నష్టపోగా, నిఫ్టీ 23,200 మార్క్ దిగువకు చేరింది. ఇన్వెస్టర్ల సంపద రూ.3.5లక్షల కోట్లు క్షీణించి రూ.409 లక్షల కోట్లకు పరిమితమైంది. ఉదయం 76,882.58 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై రోజంతా నష్టాల్లోనే కదలాడింది.

ఇంట్రాడేలో 75,912.18 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరిన సూచి, చివరికి 1390.41 పాయింట్లు నష్టపోయి 76,024.51 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 353.65 పాయింట్లు నష్టపోయి 23,165 పాయింట్ల వద్ద నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిసాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దేశీయ ఐటి కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. అలాంటిది అమెరికాలో ఐటీకి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చన్న అంచనాలతో ఐటి స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టి, హెచ్‌సిఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇటీవల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి



చేరింది. భారత్ చమురును ప్రధానంగా దిగుమతి చేసుకొనే దేశం కావడంతో మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీవల దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుగా 8 సెషన్లలో దాదాపు 5శాతానికిపైగా పెరిగాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, రిలయన్స్ షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి.


# అమ్మకాల్లో కియా అప్..హుండయ్ డౌన్



**ముంబై, ఏప్రిల్ 1:** దక్షిణ కొరియా కార్ల తయారీ దిగ్గజం కియా మోటార్స్ మార్చి నెల అమ్మకాల్లో 2.2శాతం వృద్ధిని నమోదు చేసింది. దేశీయంగా,అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడంతో ఈ వృద్ధి సాధ్యమైందని కంపెనీ పేర్కొంది. కియా గత నెలలో 2,78,058 వాహనాలను విక్రయించగా, గత యేడాది ఇదే నెలలో 2,72,011 యూనిట్లు అమ్ముడయ్యాయి. దేశీయ అమ్మకాలు 2శాతం పెరిగి 50,006 యూనిట్లకు చేరుకున్నాయి. విదేశీ అమ్మకాలు 2.2శాతం పెరిగి 2,27,724 యూనిట్లకు చేరాయి. ఈ సందర్భంగా కియా మోటార్స్ ప్రతి నిధి మాట్లాడుతూ, ఈ యేడాది మొదటి త్రైమాసికంలోనే అత్యధిక అమ్మకాలు సాధించాం. జనవరి- మార్చి మధ్య మొత్తం 7,72,351 యూనిట్లను విక్రయించాం. ఇది గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 1.6శాతం ఎక్కువ. ఇవి3, స్పోర్టేజ్, సోరెంటో వంటి కీలక మోడళ్ల హైబ్రిడ్ వెర్షన్లు గతేడాది ద్వితీయార్థంలో విడుదలయ్యాయి. ఇవి అమ్మకాలను పెంచడంలో సహాయ పడ్డాయని, తద్వారా మొదటి త్రైమాసికంలోనే అత్యధిక పనితీరును కనబరిచాం అని అన్నారు. అదే సమయంలో హుండయ్ మోటార్స్ మార్చి నెల అమ్మకాల్లో తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు క్షీణించడంతో మార్చి నెలలో హుండయ్ మోటార్స్ అమ్మకాలు 2శాతం తగ్గాయని ఆ సంస్థ తెలిపింది. గత నెలలో 3,65,812 వాహనాలను విక్రయించగా, గత సంవత్సరం ఇదే నెలలో 3,73,290 యూనిట్లు అమ్ముడయ్యాయి. దేశీయంగా 0.9శాతం వృద్ధి చెంది 63,090 యూనిట్లు విక్రయించినా, అంతర్జాతీయంగా అమ్మకాలు 2.6శాతం తగ్గి 3,02,722 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఒకే దేశానికి చెందిన రెండు కార్ల కంపెనీల అమ్మకాలలో ఇంత వ్యత్యాసం ఎందుకు కనిపిస్తోందనే దానిపై విశ్లేషకులు పలు రకాలుగా స్పందిస్తున్నారు. హుండయ్ పాత మోడల్ కార్ల అమ్మకాలపై దృష్టిపెట్టిం దని, కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడంలో వెనుకబటి ఉందని అభిప్రాయపడుతున్నారు. దీనికి విరుద్ధంగా కియా మాత్రం సరికొత్త మోడళ్లను ఎప్పటికప్పుడు విడుదలచేస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటోందని, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై దృష్టిసారించడం కియాకు కలిసొచ్చే అంశం.

# 60 నిమిషాల్లో 10 లక్షల మంది యూజర్లు

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** ఓపెన్‌ఎఐ ఆధ్వర్యంలోని చాట్‌జిపిటి కేవలం ఒకే గంటలో పది లక్షల మంది యూజర్లను సంపాదించినట్లు కంపెనీ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. కంపెనీ ఇటీవల ప్రారంభించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆర్ట్ స్టూడియో జీబ్లీకి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఇలా చాట్‌జిపిటికి వినియోగదారులు పెరుగుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆల్ట్‌మన్ తన ఎక్స్ ఖాతాలో ఈ విషయాన్ని పంచుకున్నారు. 26 నెలల క్రితం చాట్‌జిపిటి ప్రారంభించిన సమయంలో అత్యంత క్రేజ్‌తో క్షణాల్లో ఈ ప్లాట్‌ఫామ్ వైరల్ అయి ఐదు రోజుల్లో 10 లక్షల మంది యూజర్లను సంపాదించుకున్నట్లు ఆల్ట్‌మన్ చెప్పారు. కానీ కొత్తగా ప్రవేశపెట్టిన జీబ్లీ స్టూడియో ద్వారా చాట్‌జిపిటి గతంలో కంటే మరింత వైరల్ అయి కేవలం గంటలోనే 10 లక్షల మంది యూజర్ల బేస్‌ను సంపాదించిందని వివరించారు. ప్రస్తుతానికి కంపెనీ మొత్తం వినియోగదారుల సంఖ్యను విడుదల చేయలేదు. ఈ కొత్త ఫీచర్‌ను ఓపెన్‌ఎఐ గత వారం జిపిటి-4ఓలో ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఎలాంటి ఎక్స్‌టర్నల్ టూల్స్ అవసరం లేకుండా నేరుగా చాట్‌జిపిటిలోనే టెక్ట్స్, యూజర్ ఫోటోలు అప్‌లోడ్ చేసి జీబ్లీఇమేజ్‌లను



పొందవచ్చు. ఇప్పటికే చాలా మంది యూజర్లు తమసెల్ఫీలు, పెంపుడు జంతువులు, కుటుంబచిత్రాలు, చాట్‌జిపిటిలో అప్‌లోడ్ చేసి జీబ్లీ ఫోటోలను పొందుతున్నారు. వాటిని తమకు చెందిన వివిధ సామాజిక మాధ్యమ ఖాతాల్లో షేర్ చేస్తున్నారు. జీబ్లీ ఇమేజ్ క్రియేట్ చేసేందుకు అనువైన మౌలిక సదుపాయాలు కావాల్సి ఉంటుంది. దీనివల్ల భారీగా జిపియు కరిగిపోతుంది. దీనిపై కొంత ఆందోళనలు వ్యక్తమవుతున్నా కొత్త ఫీచర్‌ను ఉపయోగించాలని ఆల్ట్‌మన్ వినియోగదారులను కోరారు.

# ఎస్‌బిఐ సేవల్లో అంతరాయం

**ముంబై, ఏప్రిల్ 1:** స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కస్టమర్లు ఆన్‌లైన్ సేవలతో సమస్యలను ఎదుర్కొంటున్నారు. వెబ్‌సైట్ పర్ఫామెన్స్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డెటెక్టర్ ప్రకారం, మంగళవారం ఉదయం 8:15 గంటలకు ఈ అంతరాయం ప్రారంభమైంది. 11:45 గంటలకు సమస్య తీవ్రమై 800కంటే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. వార్షిక ముగింపు కార్యకలాపాల కారణంగా ఏప్రిల్ 1 మధ్యాహ్నం 1:100 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో లైట్, యుపిఐ సేవల వంటి డిజిటల్ సర్వీసులు అందుబాటులో ఉండవని, ఈ అంతరాయానికి క్షమించమని ఎస్‌బిఐ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. డౌన్‌డెటెక్టర్ ప్రకారం సుమారు 64శాతం మొబైల్ బ్యాంకింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు, 33 లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంతరాయం నుంచి బయటపడడానికి కస్టమర్లు యుపిఐ లైట్, ఎటిఎం ఉపయోగించుకోవచ్చని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెల్లడించింది.



## వాణిజ్యం


# సిఎన్‌జి ధరల పెరుగుదల

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దేశీయంగా ఉత్పత్తి అయ్యే సహజవాయువు ధరలను భారత్ రెండేళ్లలో తొలిసారిగా పెంచింది. ఏప్రిల్ 1 నుంచి ఎపిఎం (అడ్మినిస్ట్రేటెడ్ ప్రైసింగ్ మెకానిజం) గ్యాస్ ధరను 10 లక్షల థర్మల్ యూనిట్లకు 6.50 డాలర్ల నుంచి 6.75 డాలర్లకు పెంచినట్లు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖకు చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ విభాగం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఒఎన్‌జిసి), ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లు నామినేషన్ ప్రాతిపదికన కేటాయించిన క్షేత్రాల నుంచి ఉత్పత్తి చేసే సహజ వాయువును ఎపిఎం గ్యాస్ అంటారు. ఈ గ్యాస్‌ను 'అడ్మినిస్ట్రేటెడ్ ప్రైసింగ్ మెకానిజం' వద్ద వినియోగదారులకు విక్రయిస్తారు. ఇంట్లో వంట అవసరాలకు పైపుల ద్వారా సహజ వాయువుగా ఈ గ్యాస్‌ను సరఫరా చేస్తారు. ఆటోమొబైల్స్ అవసరాల కోసం కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్‌గా మారుస్తారు. ప్రభుత్వం రూపొందించిన రోడ్ మ్యాప్‌కు అనుగుణంగా రెండేళ్లలో తొలిసారి ధరల పెంపును అమలుచేశారు. 2023 ఏప్రిల్‌లో దేశీయంగా ఉత్పత్తి అయిన సహజ వాయువు ధరలను మిలియన్ థర్మల్ యూనిట్లకు 4 డాలర్లు నుంచి గరిష్టంగా 6.5డాలర్లుగా పరిమితిని విధించారు. ధరల పెంపుకు సంబంధించి నిపుణుల కమిటీ నివేదికను గతంలో కేంద్ర కేబినెట్ ఆమోదించింది. 2027 వరకు 0.5 డాలర్లు పెంచాలని సూచించింది. 2023 నుంచి రెండేళ్ల పాటు ఎలాంటి పెంపు తీసుకోలేదు. ఈ గడువు ముగియడంతో తాజాగా 0.25 డాలర్ల పెంపు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చే రెండేళ్ల పాటు రేట్లు మారవని, ఆ తర్వాత మరో 0.25 డాలర్లు పెంచాలని కేంద్ర కేబినెట్ ఇప్పటికే నిర్ణయించింది. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ అనేది అధిక పీడనం వద్ద నిల్వ చేసి ఉపయోగించేందుకు వీలైన గ్యాస్. దీన్ని ప్రధానంగా మీథేన్, గ్యాసోలిన్, డీజిల్ లేదా బొగ్గు వంటి సాంప్రదాయ శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్నారు. కార్లు, బస్సులు, ట్రక్కులు, ఆటోరిక్షాలు సహా ఆటోమొబైల్స్‌కు ప్రత్యామ్నాయ ఇంధనంగా సిఎన్‌జిని విస్తృతంగా వాడుతున్నారు. గ్యాసోలిన్ లేదా డీజిల్, పెట్రోల్‌తో పోలిస్తే తక్కువ ఉద్గారాలు విడుదల చేస్తుంది.



# 900 ఔషధాల ధరల పెంపు!

**ముంబై, ఏప్రిల్ 1:** దేశీయంగా 900 రకాలకు పైగా ఔషధాల ధరలు ఏప్రిల్ ఒకటి నుంచి పెరిగాయి. ఈ విషయాన్ని నేషనల్ ఫార్మా స్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) ప్రకటించింది. పెరిగిన వాటి జాబితాలో యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, గుండె జబ్బులు, మధుమేహానికి సంబంధించిన మందులున్నాయి. టోకు ద్రవ్యోల్బణ సూచి ఆధారంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా తయారీదారులు ఔషధాల ధరలను సవరించొచ్చు. 2023తో పోలిస్తే 2024 కేలండర్ సంవత్సరంలో నమోదైన టోకు ద్రవ్యోల్బణం ఆధారంగా, ఔషధ ధరలను గరిష్టంగా 1.74శాతం వరకు ధరలు పెరిగినట్లు ఎన్‌పిపిఎ పేర్కొంది. సవరించిన ధరల ప్రకారం యాంటీబయాటిక్ అజిత్రోమైసిన్ 250 ఎంజి ఒక్కో టాబ్లెట్ ధర రూ.11.87, 500 ఎంజి ధర రూ.23.97కు పెరిగింది. అమోక్సిసిలిన్, క్లావులానిక్ యాసిడ్ కలిగిన యాంటీబయాటిక్ డ్రై సిరప్ ధర ఒక్కో ఎంఎల్ గరిష్ట ధరను రూ.2.09గా నిర్ణయించారు. డైక్లోఫెనాక్ టాబ్లెట్ గరిష్ట ధర రూ.2.09, ఇబ్రూఫెన్ 200 ఎంజి ఒక టాబ్లెట్ ధర రూ.0.72, 400ఎంజి టాబ్లెట్ ధర రూ.1.22గా పేర్కొన్నారు. దీంతో పాటు డయాబెటిస్, గుండెజబ్బులకు సంబంధించిన ధరలను స్వల్పంగా పెంచి వాటి గరిష్ట పరిమితులను ఎన్‌పిపిఎ తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.